
నవంబరు 2015 ఆశ్వయుజం-కార్తీకం | శాలివాహన శకం 1937 ₹ 5

ఆంధ్రప్రదేశ్



అంగరంగ వైభోగంగా
అమరావతికి అంకురార్పణ



విజయదశమి నాడు (అక్టోబరు 22, 2015) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి, అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించిన భారత ప్రధాని నరేంద్రమోడి.

నవ్యాంధ్ర కలల రాజధాని సాకారమైన పర్వదినమిది.
తెలుగువారి చరిత్రలో కలకాలం నిలిచిపోనున్న విజయదశమి ఇది.
తరతరాల సుఖమయ జీవనానికి, ఆర్థిక స్వావలంబనకు, ఉజ్వల సంస్కృతికి పునాదిరాయి పడిన ఘట్టమిది.
ప్రజాభాగస్వామ్యానికి అరుదైన గౌరవం దక్కిన రోజిది.
ఆంధ్రుల ఘనమైన వారసత్వానికి ఒక సరికొత్త కొనసాగింపు ఇది.
ఒక కొత్త బంగారు లోకాన్ని నేలమీదకు తీసుకురానున్న భగీరథ యత్నమిది.
సర్వం ఒడ్డి ఒక ఆధునిక ప్రజారాజధానికి ప్రాణప్రతిష్ఠ చేసిన ఒక నాయకుడి ఉక్కు సంకల్పానికి ప్రతీక ఇది.
అజరామర అమరావతికి పునఃప్రతిష్ఠ చేసిన దివ్యముహూర్తమిది.

ఈ సంచికలో...

ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 59 సంచిక 4
శాలివాహన శకం 1937 ఆశ్వయుజం-కార్తీకం

పబ్లిషర్ కమిషనర్
డా. పి కృష్ణమోహన్

ప్రధాన సంపాదకుడు
కందుల రమేష్

సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
అమరావతి శంకుస్థాపనలో ప్రముఖులు

రెండవ కవర్
అమరావతి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరణ

మూడవ కవర్
ముఖ్యమంత్రి కార్యక్రమాల చిత్రమాలిక

నాల్గవ కవర్
పేదరికంపై గెలుపు ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ – 500 028
ఫోన్: 040 – 23300258

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.

రూపకల్పన
కార్తీక్ బీసు

ఫొటోలు
టి.శ్రీనివాస రెడ్డి, విజయవాడ

ముద్రణ
కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in



ఆధునిక చరిత్రకు శ్రీకారం!

తెలుగువారి చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఆంధ్రప్రదేశ్ బంగారు భవితకు పునాది పడింది. విజయదశమి పర్వదినాన ఉద్దండరాయునిపాలెం వేదికగా లక్షలాదిమంది ప్రజల సమక్షంలో దేశవిదేశాల అతిథుల ఆశీస్సులతో ఆధునిక అమరావతి రాజధాని నగరానికి సాంప్రదాయబద్ధంగా శంకుస్థాపన జరిగింది.

తివిరి ఇసుమున తైలంబు తీయగల ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి నాయకుడిగా ఉండటం వల్లనే అసాధ్యంగా తోచిన ఈ బృహత్ కార్యం సుసాధ్యమైంది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కేంద్రంగా, అభివృద్ధికి ఆలంబనగా రాజధాని నగరాన్ని నిర్మించుకోవాలని యావత్ రాష్ట్రం పలవరిస్తున్నా, సంకుచిత ప్రయోజనాలే పరమావధిగా పరిగణించే శక్తులు మాత్రం పది చేతులతో అడ్డుకోవడానికి వెనుకాడలేదు.

విభజనానంతర విభేదాలను పక్కన పెట్టి, సోదర రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం స్వయంగా స్వాగతించిన సత్సంకల్పం చంద్రబాబు నాయుడిది. ఈ సదుద్దేశాన్ని కూడా గ్రహించకుండా, స్వరాష్ట్రంలోని విపక్ష నాయకులు జాతి చరిత్రలోని ఈ అరుదైన ఘట్టానికి దూరంగా ఉండటం తెలుగువారి దురదృష్టమని అనుకోవాలి.

అయినా ఏ కష్టానికీ నష్టానికీ వెరవని చంద్రబాబు అన్నీ తానై ఈ అపూర్వ ఘట్టాన్ని దగ్గరుండి విజయవంతంగా నిర్వహించారు. ఇది మా రాజధాని అని రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఈ యజ్ఞంలో పాలుపంచుకునేలా ప్రోత్సహించారు. అందుకే అమరావతి ప్రజాభాగస్వామ్యంతో నిర్మితమవుతున్న తొలి ప్రజా రాజధాని.


ఈ ప్రత్యేకతను గుర్తించినందునే సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ తొలి ఇటుకను పేర్చారు. పార్లమెంటు ప్రాంగణం నుంచి పుట్టమట్టిని స్వహస్తాలతో బహుకరించారు. జపాన్, సింగపూర్ సీనియర్ మంత్రులు, విదేశీ ప్రముఖులు ఈ మారుమూల ప్రదేశానికి తరలి వచ్చారు. మనస్ఫూర్తిగా తమ శుభాశీస్సులు అందించారు.

ఒక అంకం ముగిసింది. మలి అంకానికి ముఖ్యమంత్రి సిద్ధవుతున్నారు. ఈ జగన్నాథ రథ చక్రాలను ఇక ఎవ్వరూ ఆపలేరు. తెలుగువారి ఆధునిక చరిత్రకు సాక్షులుగా ఉండగలగడం మనందరికీ గర్వకారణం. రాబోయే తరాలకు ఒక కొత్త చరిత్రను అందించగలగడం మన అదృష్టం!

కందుల రమేష్

కందుల రమేష్
చీఫ్ ఎడిటర్

Printed and Published by **DR P KRISHNA MOHAN** on behalf of Commissioner, Information and Public Relations Dept., (on behalf of Govt. of AP); Published at Samachar Bhavan, AC Guards, Hyderabad - 500028 Ph: 040-23300258 Printed at **M/s Caxton Offset Pvt. Ltd.**, 11.5.416/3, Red Hills, Hyderabad - 500 004 Chief Editor: Ramesh Kandula



రాష్ట్ర ప్రగతికి సమగ్రదర్శిని

ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక అక్టోబరు సంచిక సరికొత్తదనంతో చిరునవ్వుల చంద్రబాబునాయుడు ముఖచిత్రంతో ఆకర్షణీయంగా వుంది. ముఖ్యంగా రాజధాని స్థాయి నగరంగా విజయవాడను తీర్చిదిద్దుతున్న అంశం, కృష్ణా - గోదావరి అనుసంధాన ప్రాధాన్యత గురించి చక్కగా వివరించారు. 'ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నెంబర్-2' వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది. నవ్యాంధ్ర అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక చేస్తున్న కృషి ప్రశంసనీయం. ప్రభుత్వ ప్రగతి సూచించే కవితలు, జోక్స్ ప్రచురించండి.

– ఎల్. ప్రఫుల్లచంద్ర, జర్నలిస్ట్, ధర్మవరం.

షడ్రుచుల విందు

ఆంధ్రప్రదేశ్ అక్టోబరు సంచికలో బ్రహ్మోత్సవంలో బ్రహ్మాండ నాయకుడు.... అంటూ శ్రీవారి ఫోటోతో పాటుగా అన్నమయ్య సంకీర్తన అందించి నందులకు ధన్యవాదాలు. సంచికలో ఫలిస్తున్న కష్టం అంటూ సి.ఎం. చంద్రబాబు నవ్వుతున్న సందర్భం చాలా బాగుంది. శ్రమ ఫలిస్తున్న వేళ అంటూ చీఫ్ ఎడిటర్ గారి సంపాదకీయం, సింగపూర్ ప్రధానికి ఆహ్వానం పలుకుతున్న ఘట్టం, రాజధాని స్థాయి నగరంగా విజయవాడంటూ వ్రాసిన కథనం, కృష్ణా - గోదావరి సంగమహారం ! అంటూ నదుల అనుసంధానాన్ని సచిత్రంగా వర్ణించినవి చాలా బాగున్నాయి. మీ సేవలో- మీ వెంట అంటూ పల్లె రఘునాథరెడ్డి సందేశం చాలా బాగుంది.

– ఎస్. కోటిలింగేశ్వరరావు, రాజమండ్రి

దేశభక్తి స్ఫూర్తి నింపిన వ్యాసం

ఆంధ్రప్రదేశ్ అక్టోబరు సంచికలో వీరచక్ర తాతా పోతు రాజు గారిపై వ్యాసం యువతలో గొప్ప దేశభక్తి స్ఫూర్తిని నింపింది. 'ఓషధుల గుట్టూ...చెంచీత పట్టూ!'- వివిధ వ్యాధుల కోసం ఔషధాల్ని సాంప్రదాయ మూలికా పద్ధతిలో సూచించిన సందర్భం బాగుంది. 'మన రాష్ట్రం- మన ప్రభుత్వం' ఛాయా చిత్రాలు చాలా బాగున్నాయి. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ఆశిస్తూ.

– శిడగం దొరయ్య, ఏలేశ్వరం

వ్యక్తిత్వ వికాసానికి దోహదం

"వ్యక్తిత్వం" శీర్షికన సి నరసింహారావు గారు అందిస్తున్న వ్యాసాలు చాలా ఉపయుక్తంగా ఉన్నాయి. అక్టోబర్ మాసపు "ఆంధ్రప్రదేశ్" పత్రిక చాలా చక్కటి నాణ్యత కలిగిన రంగుల పేజీలతో ముద్రితమయ్యి మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. పత్రిక పేపర్ నాణ్యతతో పాటుగా అందించే అంశాల విషయంలో కూడా ఏ విధమైన రాజీపడకుండా పాఠకులకు అవసరమైన, తెలియవల్సిన విషయాలను అందిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టే విధంగా ఆధారాలతో అందించడం అనేది అభినందదాయకం. ఎడిటర్ గారి "ముందుమాట" అక్షరసత్యం.

పెయ్యల శ్రీనివాసరావు, అలికాం గ్రామం, ప్రకాశం జిల్లా

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు చందా ఇలా కట్టాలి

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు 040 23399048 ఎక్స్‌టెన్షన్ 123

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

ముందుచూపున్న ముఖ్యమంత్రి

జీవితంలో స్థిరపడాలనీ ఆత్రుతతో కన్నతల్లి వంటి జన్మభూమికి దూరమైన మాలాంటి ఆంధ్రప్రదేశ్ వాసులకు ఈ ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక సంజీవినిలాతోస్తుంది. ప్రస్తుత నవ్యాంధ్ర విశేషాలు తెలుసుకుంటూ అక్కడే వున్నట్లు, ఆ గాలి పీలుస్తున్నట్లు, ఆ నీరు తాగుతున్నట్లు భావిస్తున్నాను. ముందుచూపుతో కదులుతున్న ముఖ్యమంత్రి ఆలోచనలు కార్యరూపం దాల్చటం సంతోషదాయకం.

– పెరుగు జాలయ్య, సికింద్రాబాద్

పట్టువదలని నారా విక్రమార్కుడు

నిర్విరామ శ్రామికుడు, అనుకున్నది సాధించే చంద్రబాబు నాయుడు గారి కష్టం ఫలించింది. పట్టినపట్టు విడవకుండా పట్టిసీమ నీరు కదల్చినారు. అవశేషాంధ్రని నవ్యాంధ్రగా తీర్చి దిద్దుతున్నారు. జై అమరావతి.


– వాస్తు రామచంద్ర, నెల్లూరు

కృష్ణా-గోదావరి సంగమహారం బాగుంది

అక్టోబర్ మాసపత్రికలో ప్రచురితమైన అంశాలన్నీ బాగున్నాయి. ప్రధానంగా 'కృష్ణా-గోదావరి సంగమహారం' శీర్షికతో ప్రచురితమైన కథనం నాకు బాగా నచ్చింది. మిగిలిన అంశాలు కూడ బాగున్నాయి. 'స్పందన' ఏ పేజీలో ఉన్నదో తెలుపుతూ విషయసూచికలో తెలిపితే సంతోషిస్తాను.

– ఏవిజి కృష్ణ, విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ (తెలుగు, ఇంగ్లీష్) పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో **www.andhrapradeshagazine.org** లో కూడా చదువుకోవచ్చు.



ఆంధ్రనగరి అమరావతి శంకుస్థాపన

మరోప్రపంచం తలవాకిట నవ్యాంధ్ర

అక్టోబర్ 22, 2015– మన్మథనామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమి!

ఆంధ్ర జాతి చరిత్రలో రాజధాని నిర్మాణాన్ని శంకుస్థాపన సంరంభంతో ఓ ఉజ్వలఘట్టం చేసిన రోజు.

పదమూడు జిల్లాల పుట్టమట్టి... జీవజలాల భిన్నత్వమంతా సంప్రోక్షితమై ఏకమైన రోజు.

తెలుగు స్థానీయ... ప్రవాస సమాజం కొత్త రక్తం నింపుకొని కొత్త ఉత్సాహంతో ఒక్కటైన రోజు

కిక్కిరిసిన మొన్నటి కలలు, చెలరేగిన నిన్నటి ఊహలు, నేటి సాకార ప్రణాళికలై ఐదుకోట్ల హృదయాల్ని తబ్బిబ్బు చేసిన రోజు.

అమరావతి తన పూర్వప్రాభవపు అడుగుజాడలను మళ్ళీ వెతుక్కుంటూ నూతన వైభవం దిశగా అడుగులు వేసిన రోజు, ఒకనాటి గణరాజ్య రాజధాని, నేటి ఆంధ్రప్రదేశ్ అనే జనరాజ్య రాజధాని కావడానికి నాంది పలికిన రోజు.

ఆంధ్రజాతిని 60 ఏళ్లుగా ఉత్తేజితం చేస్తున్న 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా... గతమెంతో ఘనకీర్తి కలవోడా!' గీతం ఒక కొత్త చారిత్రక సందర్భమై నిలిచిన రోజు– అక్టోబర్ 22, 2015!

"పెనుగాలి వీచింది ...అణగారి పోయింది

నట్టనడి సంద్రాన నావ నిలుచుండాది

చుక్కాని బట్టరా తెలుగోడా!

నావ దరిచేర్చరా మొనగాడా!!"

నిజంగానే పెనుగాలి వీచింది ..... నట్టనడి సముద్రంలో నావ నిలిచిపోయింది. రాష్ట్ర విభజన అనంతరం అవశేషాంధ్రప్రదేశ్ స్థితి కచ్చితంగా అదే. అంతా అగమ్యగోచరం అయినప్పుడు చుక్కాని పట్టి, నావ దరిచేర్చిన మొనగాడు... తెలుగు వాడి అధినాయకుడు– నారా చంద్రబాబు నాయుడు. అందుకే చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!

రెండున్నర వేల ఏళ్ల చారిత్రక స్ఫూర్తి.... సాంస్కృతిక దీప్తి.... తెలుగు జాతి అఖండ జ్యోతి – అమరావతి! అదే పేరిట నవ్యాంధ్రప్రదేశ్ రాజధానికి ఆ విజయదశమి పర్వదినాన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించిన వర్తమాన ప్రశస్తి, వెయ్యేళ్ల భవితవ్యాన్ని జాతికి అందించే క్రాంతదర్శన యుక్తి– చంద్రబాబు.

కాబట్టి గత కీర్తిని చూసుకొనే కాదు, ఆ స్ఫూర్తిప్రదాత, జనహృదయ విజేత నేడు సాధించిన, రేపటికి సముపార్జించిన ఘనకీర్తికి ఇప్పుడు చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా! జైకొట్టి మేల్కొలుపు తెలుగోడా!

ఆకాశమే పందిరిగా.... భూదేవే పీటగా అన్నట్లు... ఆంధ్రుల కలల రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన సంబరం అంగరంగ వైభోగంగా జరిగింది. విజయదశమి పర్వదినాన శంకుస్థాపన చేసిన తర్వాత ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ మన దేశంలో స్వాతంత్ర్యానంతరం కొత్త నగరాలను నిర్మించిన దాఖలాలు లేవన్నారు. పట్టణీకరణను ఒక సమస్యగా చూస్తూ వస్తున్నామని, కానీ దాన్నొక అవకాశంగా

చూడాలనీ అన్నారు. రాజధాని నిర్మాణమంటే భూసేకరణ కాదనీ, రియల్ ఎస్టేట్ కి రెక్కలు తొడగటం కాదనీ, ప్రభుత్వం ఏదో చేస్తుంటే జనం తటస్థంగా చూడటం కాదనీ, అసలు రాజధాని అంటే కేవలం భౌతికం కానే కాదని ప్రత్యక్షంగా చూపిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఆరంభ సంబరమే ప్రధానితో ఆ సందేశాన్ని పలికించి ఉండొచ్చు. పదిహేను మంది అతి ప్రముఖులు మాత్రమే ఆశీనులైన ఆ ప్రధాన వేదిక నుంచి తేరిపారా చూస్తే రానున్న మహానిర్మాణానికి పునాది రాళ్లై, రేపటి మహోదయానికి కాంతిబీజాలై తమ పొలాలు స్వచ్ఛందంగా చేసిన త్యాగం చేసిన అన్నదాతలు; మరో పక్క 'మన నీరు– మన మట్టి – మన అమరావతి' అన్న చంద్రన్న పిలుపుకి తరలి వచ్చి 'మేము సైతం' అని గొంతుకలిపిన జనసామాన్యులు. బహుశా, ఆ మహత్తర దృశ్యమే ఆంధ్రనగరి అమరావతి, భారతావనికే కాదు, ప్రపంచానికే ఆదర్శప్రాయమైన మహానగరం కాబోతుందని ప్రధానికి స్ఫురించి ఉండొచ్చు.

ఉద్దండరాయునిపాలెం నవ్యాంధ్రకి నమూనా

గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలంలోని ఉద్దండరాయుని పాలెం – నవనవోన్మేషంతో ఉరకలేస్తున్న యావత్ నవ్యాంధ్రకీ ఒక నమూనాగా, ఒక ప్రతీకగా నిలిచింది. హెలీపాడ్లు, బారికేడ్లు, బందోబస్తూ ఏర్పటవ్వడం కాదు ఆ సంబరానికి కారణం; ఆంధ్రజాతికి కేంద్రబిందువు కావడం, ప్రధానితో సహా, అనేకానేక దేశవిదేశీ ప్రముఖులకి ఆతిథ్యం ఇవ్వడం. రాష్ట్రాధినేతైన ఓ ఉద్దండరాయుడి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలూ నెల రోజుల పాటు శ్రమించి నిర్విఘ్నంగా నిర్వహించిన ఒక మహోన్నత ఘట్టానికి వేదిక అయినందుకు ఉద్దండరాయుని పాలెం సంతోషంతో పోటెత్తింది. మట్టి పరిమళాల పల్లెలు అంతర్భాగమైన, భిన్నత్వంలోని ఏకత్వాన్ని సొంతం చేసుకున్న అచ్చమైన భారతీయ, ఆదర్శ నగరం– అమరావతికి తొలి అడుగులు తనునుంచే కావడాన్ని అపురూప సందర్భంగా చరిత్రకెక్కింది ఉద్దండ రాయుని పాలెం.

మన తెలుగు తల్లికి మంగళారతులు

సర్వం సమ్మంగళం.... ప్రాంగణమంతా మంగళకరం... మార్మోగిన వేద మంత్రోచ్చారణం... హోమజ్వాలల్లో ఆ ప్రాంతమంతా పులకాంకితం, వేడుక అంతా శాస్త్రబద్ధం. ప్రధాన వేదిక పక్కనే 36 అడుగుల పొడవు, 36 అడుగుల వెడల్పుతో ప్రత్యేకంగా నిర్మించిన హోమశాలలో విష్వక్సేన పూజతో ఉదయం 9 గంటల నుంచే పూజలు మొదలయ్యాయి. వేద పండితులు శంకుస్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం వాస్తుపూజ, నవగ్రహ మండపారాధన చేశారు. ఆ తర్వాత లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. ప్రధాని వచ్చే సమయానికి పూర్ణాహుతికి కోసం అంతా సిద్ధంగా ఉంచారు. మధ్యాహ్నం12.30 గంటల సమయానికి ప్రధాని హోమశాలకు చేరుకున్నారు.

ఆయనకువేదపండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. 12.35 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. నేతిలో తడిపిన వస్త్రంలో యాగద్రవ్యాలు మూటకట్టారు. వేద మంత్రోచ్చారణల ప్రధాని వాటిని హోమగుండంలో అగ్నిదేవుడికి సమర్పించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు రత్నన్యాసం చేశారు. నేలను కొంత లోతుగా తవ్వి శంకుస్థాపన కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో రత్నన్యాసం జరిగింది. ప్రధాని, ముఖ్యమంత్రి నవరత్నాలను ఒక పేటికలో వేశారు. ఏ గ్రహానికి ఏ రత్నం వేయాలో... ఎన్ని వేయాలో... శాస్త్రాన్ని అనుసరించి అన్ని రత్నాలను పేటికలో ఉంచారు. బంగారం, వెండి, రాగి కూడా వేశారు. ఆ పేటికను భూమిలో ఉంచారు. అనంతరం బంగారం, వెండి, రాగి నాణేలు వేశారు. ఆ తర్వాత శిలాన్యాసం కార్యక్రమం జరిగింది. అనంతరం యంత్రస్థాపన చేశారు. ప్రధాని, ముఖ్యమంత్రులకు పండితులు వేదాశీర్వాదం చేశారు. దాంతో శంకుస్థాపన క్రతువుపూర్తయింది. అనంతరం ప్రధాని అమరావతి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత జరిగిన బహిరంగసభలో, చంద్రబాబు ఇచ్చిన మన మట్టి...మన నీరు...మన అమరావతి' పిలుపుకి స్పందించానన్న భారత ప్రధాని నరేంద్రమోదీ 'నేను సైతం'అంటూ భారత పార్లమెంటు ప్రాంగణం నుంచి సేకరించిన మట్టి, పవిత్రమైన యమున నదీజలాలను ముఖ్యమంత్రికి అందించడం విశేషం.

జగమంత కుటుంబ వేడుక

రాష్ట్రం నలు మూలల నుంచే కాకుండా, ఇరుగుపొరుగు రాష్ట్రాల తెలుగు వారంతా రాజధాని శంకుస్థాపన కార్యక్రమాన్ని తమ సొంతింట్లో పండగలా భావించి తండోపతండాలుగా తరలి వచ్చారు. ప్రతీ గ్రామం, పట్టణం, నగరం నుంచి పవిత్రమైన మట్టిని ఈ శంకుస్థాపన ప్రక్రియలో కలిపి తమ పరిపూర్ణ భాగస్వామ్యాన్ని చాటుకోగలిగారు. రాజధానికి భూములిచ్చిన రైతులు కుటుంబసమేతంగా తరలి వచ్చారు. 'నిన్న మొన్నటి వరకు ఇదే మా పొలం గట్టు' అంటూ పలువురు రైతులు తమతమ స్నేహితులు, బంధువులతో జ్ఞాపకాలను నెమరేసుకోవడం హృద్యమైన దృశం. తమ కెమెరాలు, మొబైల్ ఫోన్లతో సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ వర్తమానాన్ని భావి తరాలకి భద్రపరిచారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యల వల్ల ఆహ్వానితులెవ్వరూ ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు చేపట్టిన చర్యలు మంచి ఫలితానిచ్చాయి. ప్రధాన వేదికకి చేరువగా రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్రత్యేక పందిళ్లు నిర్మించారు. వీవీఐపీలు, వీఐపీలకు కూడ ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖులు, ఆహ్వానితులు వేదిక ప్రాంగణానికి, శంకుస్థాపన ప్రదేశానికి సులభంగా చేరుకోడానికి వీలుగా ప్రత్యేక రహదారులను ఒకదానికొకటి అనుసంధానం చేస్తూ నిర్మించారు.

చరితార్థుడి నేతృత్వం చారిత్రకం

రాష్ట్ర విభజన జరిగినప్పుడు అవశేషాంధ్రకి కొత్త రాజధాని కావాలనుకున్నారు కానీ, అది అమరావతే కాబోతోందని ఎవరూ అనుకోలేదు. అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి తలపులనుంచి వికసించిన అందమైన ఊహ. అద్భుతమైన ఆలోచన. పేరు వినగానే గొప్ప చారిత్రక స్ఫూర్తిని నింపే అమరావతి మన రాజధాని అని ఆయన ప్రకటించినప్పుడు వేల సంవత్సరాల తెలుగువారి మతరాజకీయసామాజిక వికాసక్రమానికి సాక్షిగా నిలిచిన అమరావతి చరిత్ర అంతా కళ్ళముందు కదలాడింది. అమరావతి కడుపులో దాగిన తెలుగువారి సాంస్కృతిక ఖజానా ధగధగలు ఒక్కసారిగా మన చూపుల్ని తాకి ఎదురుగా విశాలమైన వెలుగు వాకిళ్ళు పరిచాయి. వర్ణమాలలో తొలి అక్షరంతో మొదలవుతున్న అమరావతి, అభివృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్ ను తొలి పేరుగా నిలబడుతుందన్న భరోసాను నింపాయి.

ఆ ఐతిహాసికుడు శ్రీకారం చుట్టిన నవ్య చరిత్రకి వర్తమానంలో సాక్షులం మనం. మనం చూస్తుండగానే కొన్ని తేదీలు కొండగుర్తులై చరిత్రలో నిలిచిపోతాయి. రేపటి అనేకానేక తరాలు ఆ తేదీలను పదేపదే మననం చేసుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శంకుస్థాపన జరిగిన అక్టోబర్ 22 అలాంటి అతి ముఖ్యమైన తేదీ.

– నున్నా నరేష్



ఆంధ్రప్రదేశ్‌కి అన్ని విధాలా అండ

- ప్రధాని అభయం

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయదశమినాడు ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానికి శంకుస్థాపన చేయటం శుభపరిణామమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపనతో కొత్త అధ్యాయం ఆరంభమైందని తెలిపారు. రాజధాని అమరావతికి శంకుస్థాపన తర్వాత ప్రధాని ప్రసంగిస్తూ ఏపీలో కొత్తగా నిర్మించే రాజధానికి చారిత్రక నేపథ్యం వుందని, అన్ని సాంకేతిక హంగులతో కూడిన ప్రజారాజధానిగా రూపొందించటం చక్కని ఆలోచన అన్నారు. శతాబ్దాల చరిత్రకు అద్దంపట్టేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తమ రాజధానుల మంచి పద్ధతులను అధ్యయనం చేసి ఆ ప్రత్యేకతలను అమరావతికి జోడించాలని నిర్ణయించడం ప్రశంసనీయమన్నారు.

దేశవ్యాప్తంగా తాము ఏర్పరిచే ఆకర్షణీయ నగరాలకు అమరావతి నాంది కావాలన్నారు. వ్యర్థాలు లేకుండా అత్యంత పరిశుభ్రంగా నగరాలు వుంటే అభివృద్ధికి రాచబాట పడుతుందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో నగరాలను ప్రణాళికాబద్ధంగా నిర్మించలేదని, అనుకున్నట్లుగా నిర్మించలేకపోయారని చెప్పారు.

స్వాతంత్ర్యానంతరం అప్పటి ప్రభుత్వాలు నగరాలపై శ్రద్ధ తీసుకోలేదని, అందుకే సమస్యల నిలయాలుగా మారాయని తెలిపారు.

పట్టణీకరణను ఒక సమస్యగా కాకుండా, మంచి నగరం నిర్మించే గొప్ప అవకాశంగా తీసుకోవాలన్నారు. ప్రపంచ స్థాయి శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి దేశవ్యాప్తంగా 100 ఆకర్షణీయ నగరాల నిర్మాణంపై పెట్టామన్నారు. నగరాలు వ్యర్థాలతో నిండిపోతున్నాయని, వ్యర్థపదార్థాలు లేని పరిశుభ్రనగరాలుగా తయారు చేసుకుందామని మోడీ చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందే అద్భుతనగరం అమరావతి అంటూ అమరావతి అభివృద్ధికి సహకరిస్తామని జపాన్ మంత్రి చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. 2001లో తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు భుజ్, కచ్ భూకంపం రాష్ట్రాన్ని కుదిపివేసిందని చెప్పారు. కచ్ జిల్లా నామరూపాలు లేకుండా పోయిందని గుర్తు చేశారు. ఆ విధ్వంసక ప్రాంతాన్ని పునరుద్ధరించటాన్ని సవాలుగా తీసుకుని పనిచేశానన్నారు. సత్‌సంకల్పం వుంటే సాధించలేనిది లేదని చెప్పటానికే ఈ అంశాన్ని ప్రస్తావించానని మోడీ వివరించారు. కచ్ జిల్లా పునరుద్ధరణ ఎన్నో అనుభవాలను నేర్పిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించగానే తాను అంగీకరించానని, హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి వెళ్లి చంద్రబాబు ఆహ్వానించారని తెలిసి ఎంతో సంతోషించానని మోడీ తెలిపారు. రాజకీయ స్వార్థంతో రాష్ట్ర విభజన సందర్భంగా యూపీఏ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఏర్పడిన దుష్ఫలితాలను

ప్రస్తావించారు. ఆంగ్లేయులు వదిలివెళ్లిన విభజించి పాలించు విధానాలను కొంతమంది ఇంకా కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఆంధ్రులైనా, తెలంగాణ వారయినా తెలుగువారి ఆత్మ ఒక్కటేనని మోడీ అన్నారు. ఇద్దరూ కలిసి పనిచేసి రెండు రాష్ట్రాలను అభివృద్ధి చేసుకుంటే ఈ దేశం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన, మార్పుల్ని అందిపుచ్చురునే సత్తా ఆంధ్రులకు వుందని, ఏపీ ప్రజలు ప్రపంచమంతా వివిధ రంగాల్లో గొప్ప స్థానాల్లో వున్నారని కొనియాడారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండూ కలసి పనిచేస్తే దాని ప్రభావం వల్ల భారతదేశం మరింతగా ముందుకు వెళుతుందన్నారు. ఆనాడు వాజ్‌పేయీ ప్రధానిగా వున్నప్పుడు తాము 3 కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశామని, అయినా ఎటువంటి సమస్యలు రాలేదని, గత ప్రభుత్వాల రాష్ట్రాలను చిన్నచూపు చూశాయని విమర్శించారు. కానీ తాను అలా వ్యవహరించబోనని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలను అందించటం జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సమన్వయం వుందని,

> యమునా నదీజలాలు, పార్లమెంటు ప్రాంగణమట్టిని నేను ఆషామాషీగా తేలేదు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వేసే ప్రతి అడుగులో కేంద్రం అడుగువేసి కలసి పనిచేస్తుందని చెప్పటానికే వాటిని తెచ్చాను.
>
> – ప్రధాని

మానవ మేధను, శక్తిని ఉపయోగించుకుని ముందుకు వెళదామని చెప్పారు. విభజన ఒప్పందంలో భాగంగా కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో ఐఐటి, ఐఐఎం, పెట్రో యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ లాంటి 11 ఉన్నత విద్యాసంస్థలను మంజూరు చేసిందని, వీటిలో అనేక సంస్థలతో ఇప్పటికే అడ్మిషన్లు ఇచ్చారని నరేంద్రమోడీ అన్నారు. మానవవనరుల అభివృద్ధికి ఇక్కడ అవకాశం వుందని గుర్తించి, తాము త్వరగా మంజూరు చేసి నిధులిచ్చామని వివరించారు.

కొత్త రాజధాని అమరావతి శంకుస్థాపన మహోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోని పుణ్యక్షేత్రాల నుంచి, నదుల నుంచి పుట్టమట్టి, నీరు సేకరించే కార్యక్రమం చేపట్టారని తెలిసిందని, తాను యమునా నది పవిత్ర జలాలను, యావత్ దేశానికి చెందిన పార్లమెంట్ భవన ప్రాంగణం నుంచి మట్టిని సేకరించి తెచ్చానని ప్రధాని చెప్పారు. ఇలా పవిత్ర నదీ జలాలను, మట్టిని సమర్పించటం తననెంతో భావోద్వేగానికి గురిచేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొనడం సంతోషకరమన్నారు. రాష్ట్ర విభజన అయిన తరువాత కొందరు నేతలు విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని, యువతలో భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని, తాను ఒక్కటే స్పష్టం చేస్తున్నానని, ఆనాడు తిరుపతిలో ప్రకటించినట్లే విభజనచట్టంలోని అన్ని అంశాలను నూటికి నూరు శాతం అమలు చేస్తానని, హామీలను నెరవేరుస్తామని ప్రకటించారు. మోడీ–బాబు జోడీ కలిస్తే దేశం, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయనిస్తాయన్నారు.

❖



ఇద్దరు ముఖ్యమంత్రులు మంచిసంకేతం చూపారు: వెంకయ్యనాయుడు

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ భౌగోళికంగా విడిపోయినా కలిసి అభివృద్ధి చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు ఇద్దరూ ముందుకు రావడం గొప్పవిషయంగా పేర్కొన్నారు. మంచిమార్గం చూపారు, మంచిసంకేతం ఇచ్చారని వారిని అభినందించారు. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తుంటే భారతదేశం యావత్తూ ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వైపు చూస్తోందన్నారు. తెలుగుజాతి శ్రేయోభిలాషిగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఢిల్లీలో సహకరిస్తామన్నారు. సుపరిపాలనకోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని, పోలవరం ప్రాజెక్టు నుంచి విభజనచట్టంలో ఆఖరి అంశంవరకు తు.చ. తప్పకుండా సహకరిస్తామన్నారు. మోడీజీ పార్లమెంట్ ప్రాంగణం నుంచి పుట్టమట్టిని, యమునానది నుంచి పవిత్ర జలాలను తీసుకువచ్చినందుకు సంతోషంగా వుందన్నారు. అమరావతిని చరిత్ర ప్రసిద్ధి చెందిన శాతవాహనుల, విష్ణుకుండినులు, రెడ్డిరాజులు పరిపాలించారని, తెలుగువారి ఐక్యతకు కృషి చేశారన్నారు. చరిత్ర సృష్టిద్దామని,తెలుగు ఔన్నత్యాన్ని చాటుదామని పిలుపునిచ్చారు.

❖



జపాన్ మంత్రి యొకుషో టకాగీ మాట్లాడుతూ అమరావతి నగరాన్ని సుందరంగా నిర్మించటంలో తాము సహకారం అందిస్తామని తెలిపారు. ఆసియా–పసిఫిక్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖద్వారంలా వుంటుందని చెప్పారు. రాజధాని శంకుస్థాపన ఉత్సవం ఈ ప్రాంత ఉజ్వల భవితకు నాందిపలుకుతుందన్నారు.

సింగపూర్ మంత్రి కె ఈశ్వరన్ మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిలో నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించడం తమదేశానికే గర్వకారణంగా పేర్కొన్నారు. ఘనమైన వారసత్వసంపద ఉన్న ఈ ప్రాంతం చంద్రబాబు నాయకత్వంలో గణనీయంగా అభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

❖



విజయదశమి నుంచే విజయపరంపర

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

విజయదశమినుంచే ఆంధ్రప్రదేశ్ విజయపరంపర కొనసాగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో విజయదశమి, అమరావతి రెండు పండుగలు ఒకేసారి వచ్చాయంటూ రెండూ రాష్ట్రానికి శుభసూచకంగా అభివర్ణించారు.

ఆంధ్రప్రదేశ్ 2022 నాటికి దేశంలో మూడో అత్యుత్తమ రాష్ట్రం కావాలి, 2029 నాటికి నెంబర్ వన్ రాష్ట్రం కావాలి, 2050 నాటికి ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రం కావాలనేదే తన సంకల్పమన్నారు. 'సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు' అని నందమూరి తారక రామారావు ప్రబోధించారని చెప్పారు. పేదరికం లేని, పరి శుభ్రమైన, ఆరోగ్యకర, ఆనందమయ రాష్టంగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడమే తన ఆశయంగా ప్రకటించారు.

ఈ శంకుస్థాపన మహోత్సవం ఈరోజు ఇక్కడ జరగడానికి ప్రధాన కారణం ఇక్కడి రైతాంగం అంటూ రాజధానికి భూములు ఇచ్చిన ప్రతి ఒక్క రైతుకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినా విజ్ఞత చూపారని రైతులను ప్రశంసించారు. ప్రజారాజధాని నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలంటూ, వారి మనోభావాల ప్రకారమే అమరావతి నిర్మిస్తామన్నారు. అందుకే మనమట్టి-మననీరు-మన అమరావతి కార్యక్రమం చేపట్టామంటూ 13 వేల గ్రామాలు, 3 వేల వార్డులు అద్భుతంగా స్పందించాయన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన, సిక్కు మతాలవారు, బ్రహ్మకుమారీలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్ధనలు చేయడం శుభప్రదమన్నారు. దేశంలోని పుణ్యనదులు గంగా, యమున, బ్రహ్మపుత్ర, రాష్ట్రంలోని పుణ్యనదులు గోదావరి, కృష్ణా, మరో 33 పుణ్యనదుల నుంచి పవిత్రజలం తెచ్చారని అన్నారు. తిరుమల ఏడుకొండలనుంచి పవిత్రమట్టిని, బంగారుబావి నుంచి పవిత్రజలాన్ని, మానస సరోవర్, కాశీ విశ్వేశ్వరాలయం, పూరీ జగన్నాథ దేవాలయం, స్వర్ణ దేవాలయం, బుద్ధగయ, మెదక్ చర్చి, మక్కా మసీదు, జామా మసీదు, అజ్మీర్ దర్గా, కడప దర్గా, పవిత్ర ప్రదేశాల నుంచి తెచ్చిన మట్టితో, పవిత్రజలంతో ఈ ప్రాంతం శక్తిమంతమయిందన్నారు. మహాత్మాగాంధీ, సర్ధార్ పటేల్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం, ఎన్టీ రామారావు, పీవీ నరసింహారావు, అబ్దుల్ కలాం వంటి మహానీయుల జన్మస్థలాల నుంచి తెచ్చిన మట్టి, పవిత్రజలాలను సమ్మిళితం చేసి హెలికాప్టర్ ద్వారా జల్లి రాజధాని ప్రాంతాన్ని సుసంపన్నం చేశామన్నారు. దీంతో రాజధాని ప్రాంతం ఒక శక్తిసంపన్నంగా, గొప్ప ఆకర్షణీయ ప్రాంతంగా అవుతుందనడంలో తనకెటువంటి సందేహం లేదన్నారు.

ప్రధాని నరేంద్రమోడీ చేతులమీదుగా ప్రారంభించిన అన్ని కార్యక్రమాలు విజయవంతం అయ్యాయంటూ ఆయన శంకుస్థాపన చేసిన అమరావతి కూడా అద్భుత నగరం అవుతుందన్నారు. అమరావతికి స్థల బలం ఉంది, పేరు బలం కుదిరింది, ముహూర్తబలం చేకూరింది, దైవబలం తోడైంది, అశేష ప్రజాబలం

అండగా నిలిచిందన్నారు. అన్ని బలాలతో మన రాజధాని ప్రపంచంలోనే పటిష్టమైన నగరం అవుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రధాని నరేంద్రమోడీ అండగా నిలబడ్డారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి నరేంద్రమోదీ ఇస్తున్న సహకారానికి రాష్ట్ర ప్రజలందరి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి పోలవరం ప్రాజెక్టుకున్న అవరోధాలను తొలగించారని, రాజధాని నిర్మాణానికి రూ. 1850 కోట్లు ఇచ్చారని, రూ 2,300 కోట్లు లోటు బడ్జెట్ భర్తీకి ఇచ్చారని, 11 అత్యున్నత విద్యాసంస్థలు నెలకొల్పారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ. 700 కోట్లు సహకారం అందించారని, మెట్రోలు, ఎయిర్ పోర్టులు, మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటు అందించారని ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీని మించిన రాజధానిని నిర్మించుకోవాలని తిరుపతి ఎన్నికల సభలో నరేంద్రమోడి చేసిన

> అమరావతికి స్థల బలం ఉంది, పేరు బలం కుదిరింది, ముహూర్తబలం చేకూరింది, దైవబలం తోడైంది, అశేష ప్రజాబలం అండగా ఉంది. ఇప్పుడిక కావాల్సింది కేంద్ర సాయమే.
>
> – ముఖ్యమంత్రి

సూచనను గుర్తుచేశారు. ఇటీవల రష్యా దేశాలలో పర్యటన నుంచి తిరిగి వచ్చిన మరుసటి రోజే ప్రధాని మోడీ ఫోన్ చేసి, తుర్క్‌మెనిస్థాన్, కజకిస్థాన్‌లలో పర్యటించి అక్కడి రాజధాని నగరాల నిర్మాణాన్ని అధ్యయనం చేయాలని సూచించిన విషయం ప్రస్తావించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో హరిత/నీలి నగరంగా (గ్రీన్ అండ్ బ్లూ) మన అమరావతి శోభిల్లాలనేది తన ఆకాంక్షగా తెలిపారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నదుల అనుసంధానం, పవర్ ఫర్ ఆల్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, 21 రోజుల్లోనే అనుమతులు, జన్ ధన్ యోజన అమలులో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. తెలుగువారు తెలివైనవారు, కష్టజీవులంటూ, వారి అభివృద్ధికి కేంద్రప్రభుత్వం అన్నివిధాలా తోడ్పాటునివ్వాలని కోరారు. తెలంగాణకు హైదరాబాద్, తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు గొప్ప ఆదాయాన్నిచ్చే నగరాలంటూ ఆ స్థాయి నగరం ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించేవరకు కేంద్రప్రభుత్వమే తోడ్పాటును అందించాలని విజ్ఞప్తిచేశారు. కలిసి పనిచేసుకుంటూ సామరస్యంగా ముందుకుపోతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే తన అభిప్రాయంగా వివరించారు. విభజన చట్టంలో లోపాల వల్ల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ ముఖ్యమంత్రి సహకరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ❖



కేసీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం – కార్యక్రమాల్లో ప్రాధాన్యం

అమరావతి శంకుస్థాపన మహోత్సవానికి రావల్సిందిగా తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావు ఇంటికి వెళ్ళి ఆంధ్రప్రదేశ్ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆహ్వానిస్తే, అధినాయకుని స్ఫూర్తిని అందిపుచ్చుకున్న ఆంధ్ర ప్రజ కెసిఆర్‌కి నీరాజనాలు పట్టారు. స్పర్థకి వీసమెత్తు కూడా తావులేని ఒక స్నేహపూరిత వాతావరణం అమరావతి ప్రాంగణంలో వెల్లివిరిసింది. శంకుస్థాపన కార్యక్రమానికి కేసీఆర్‌ను ఆహ్వానించడం దగ్గర నుంచీ, రాష్ట్రానికి వచ్చింది మొదలు తిరిగి వెళ్ళే వరకూ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. కేసీఆర్‌కు ఏపీ ప్రభుత్వం తరపున ఘనస్వాగతం సైతం లభించింది. ప్రధాని మోడి అమరావతిలో అడుగుపెట్టింది మొదలు తిరుగు ప్రయాణం అయ్యే వరకు రాజధాని శంకుస్థాపనకు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కేసీఆర్ ప్రముఖంగా పాల్గొన్నారు. శంకుస్థాపన పూజా కార్యక్రమం జరుగుతున్న సమయంలో ప్రధానికి కుడి, ఎడమన చంద్రబాబు, కేసీఆర్ ఉన్నారు.

కేసీఆర్‌కి స్వాగత, వీడ్కోలు బాధ్యతలను ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప నిర్వహించారు. అమరావతి శంకుస్థాపనకు తెలంగాణ సీఎం కేసీఆర్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ, ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, విద్యుత్‌మంత్రి జగదీశ్‌రెడ్డి కూడా అమరావతి వేడుకకి హాజరయ్యారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో కేసీఆర్‌కు మాట్లాడే అవకాశం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంది. తొలుత రూపొందించిన షెడ్యూలులో ఇది లేకపోయినా తదుపరి ఈ అంశాన్ని చేర్పించడంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న చొరవకి ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఆమోదముద్ర వేసింది. అమరావతి శంకుస్థాపన శిలాఫలకంలో మొత్తం 12 మంది పేర్లలో కేసీఆర్ పేరును ముద్రించి ఆయనకు సముచిత గౌరవాన్నిచ్చారు. శిలాఫలకం ప్రారంభోత్సవంలో కూడా కేసీఆర్‌ను చంద్రబాబు తన పక్కనే నిలబెట్టుకున్నారు.

శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగ సభ ప్రధాన వేదికపై ప్రధాని మోడితోపాటు 15 మంది మాత్రమే కూర్చున్నప్పటికీ ఆ వేదికపై కేసీఆర్‌కు స్థానం కల్పించారు. ఇక సభా వేదికపై కేసీఆర్‌కు చంద్రబాబు పుష్పగుచ్ఛం ఇస్తున్న సమయంలో జనం పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. కేసీఆర్ జనం వైపు ఉత్సాహంగా చేయి ఊపారు.

అమరావతి నగర ప్రస్థానం అద్భుతంగా ముందుకుసాగాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆకాంక్షించారు. పవిత్రమైన విజయదశమినాడు ప్రధాని చేతుల మీదుగా రాజధాని శంకుస్థాపన జరగడం ఆనందదాయకంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ❖

రాష్ట్రం నలుమూలల నుంచి సేకరించిన మన నీరు - మన మట్టి



అపూర్వ ఘట్టం 'అమరావతి' శంకుస్థాపన

అమరావతి శంకుస్థాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిందని నవ్యాంధ్ర సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని వేనోళ్ల కొనియాడుతున్నారందరూ. ఇక్కడ అంగరంగ వైభవంగా అంటే అట్టహాసంగా జరిగిందని కాదు, ఆడంబరాలకి పోయామని కాదు; ఆచితూచి అడుగేసే చంద్రబాబు నేతృత్వంలో అసలు ఆర్భాటాలకి చోటు ఎంతమాత్రం లేదు. ఉ న్నమాట చెప్పుకోవాలంటే, శంకుస్థాపన కార్యక్రమం మొత్తం ఒక ఆత్మీయమైన కలయిక, ఆప్యాయమైన వేడుక. ఈ మహోత్సవం 'నభూతో.. నభవిష్యతి' గా అందరి మనసుల్లో నిలిచిపోడానికి మూల కారణాలు - ఒకటి నిర్వహణ, రెండు ఆతిథ్యం. ఏ మాత్రం ఏమరుపాటు లేని ఏర్పాట్లు. ఆతిథ్యంలో, మర్యాద మన్ననల్లో ఖండాంతరాలు దాటివెళ్లిన ఆంధ్రుల కీర్తిని అమరావతి శంకుస్థాపన సంబరం మరెన్నో రెట్లు పెంచింది.

రాజధాని అమరావతి శంకుస్థాపన సంబరాలు అంబరాన్ని తాకాయి. నవ్యాంధ్ర రాజధాని శంకుస్థాపన చారిత్రక సన్నివేశాన్ని కనులారా తిలకించటానికి 13 జిల్లాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా తరలి వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహించారు. పూర్తి సమన్వయంతో అన్ని శాఖలు చక్కగా విధులు నిర్వహించి ప్రజల ప్రశంసలందుకున్నాయి.

ఆకట్టుకున్న సభా ప్రాంగణ ఏర్పాట్లు

పర్యాటకశాఖ,సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరావతి ఎగ్జిబిషన్ గ్యాలరీని ప్రధాని నరేంద్రమోడీ తిలకించారు. తొలి విభాగంలో అమరావతి, అమరావతి నగర చరిత్ర, రెండో విభాగంలో 29 గ్రామాల రూపురేఖలు, ప్రజల జీవన విధానం, మూడో విభాగంలో సింగపూర్ మాస్టర్ ప్లాను- భవిష్యత్తు అభివృద్ధిపై ఊహా చిత్రాలను ప్రదర్శించారు. చారిత్రక విభాగంలో ఆదిమానవుడి అడుగుజాడలు, వివిధ రాజవంశాల పాలన, శైవ, బౌద్ధాల కేంద్రంగా అమరావతి విరాజిల్లిన వైనం, 1797లో రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అమరావతి చారిత్రక నగరం నిర్మించిన విధానం ఆధారాలను ప్రదర్శించారు. ఇంకా 2006లో దలైలామా కాలచక్ర మహాసమ్మేళనం నిర్వహించిన నాటి ఛాయాచిత్రాలను చూపారు. 'కాలచక్ర' మ్యూజియంలో భద్రపరిచిన ఆధారాలు అమరావతి శిల్ప సౌందర్య నమూనాలు, శాతవాహనుల కాలంనాటి నాణేలు ఆకట్టుకున్నాయి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక వేదికపై వివిధ కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యరూపకాలు, పాటలు, వాద్యబృంద ప్రదర్శనలు, మిమిక్రీ, కామెడీ స్కిట్స్, ప్రజలను అలరించాయి. రైతులకు వేనవేల వందనాలు అంటూ 29 గ్రామాల పేర్ల ప్రస్తావనతో వందేమాతరం శ్రీనివాస్, ఉష బృందం ఆలపించిన గీతం విశేషంగా

ఆకట్టుకుంది. 'జయహో అమరావతి జయహో' గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'రైతుకు వందనం' కూచిపూడి నృత్యప్రదర్శన, కుమారి అంబిక రింగ్ డ్యాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ముప్ఫయ్ నిమిషాలపాటు నిర్వహించిన శివమణి డ్రమ్స్ వాద్యం ఉర్రూతలూగించింది. 'జయహో అమరావతి' గీత నృత్యరూపకానికి సభా ప్రాంగణం కరతాళ ధ్వనులతో మార్మోగింది. శివమణి డ్రమ్స్ వాద్యాలకు అనుగుణంగా సభికులు చప్పట్లు కొడుతూ ఆయనను మరింతగా ఉత్సాహపరిచారు. ప్రముఖ గాయని సునీత, ప్రముఖ నటుడు సాయికుమార్‌ల వ్యాఖ్యానం అందరినీ అలరించింది.

ఆకట్టుకున్న సైకత శిల్పాలు

కృష్ణానదీ తీరంలో మంచాల సనత్‌కుమార్ 'అమరశిల్పి జక్కనలా చంద్రబాబు రాజధాని అమరావతి నిర్మిస్తారు' అనే నినాదంతో రూపొందించిన 51 అడుగుల చంద్రబాబు, గౌతమ బుద్ధుని సైకత శిల్పాలు విజయవాడ నగర ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

3డీ రూపంలో అమరావతి

నవ్యాంధ్ర నూతన రాజధాని ఎలా ఉండబోతోందన్న కోణంలో తయారు చేసిన బృహత్తర కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా చెన్నైకి చెందిన సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన అతి పెద్ద త్రీడీ చిత్రం ప్రముఖులు, రైతన్నలు, సందర్శకులను ఎంతగానో ఆకర్షించింది. రాజధానిలో ఏఏ భవంతులు ఎక్కడెక్కడ నిర్మించబోతున్నారు, అభివృద్ధి చెందిన అనంతరం నదీ తీరం ఎంత ఆహ్లాదంగా రూపాంతరం చెందనున్నదో ఈ త్రీడీ చిత్ర ప్రదర్శనలో కళ్లకుకట్టినట్లు ఎంతో ఆకర్షణీయంగా చూపించగలిగారు. భవిష్యత్‌లో అమరావతి సమగ్ర పురోగతి స్వరూపాన్ని కూడా ప్రదర్శించారు. ఈ త్రీడీ చిత్రాన్ని ప్రధాని నరేంద్రమోదీ, దేశ, విదేశీ ప్రముఖులంతా కనుల పండువగా తిలకించారు. శంకుస్థాపన వేదికకు దగ్గరలో 450 చదరపు అడుగుల విస్తీర్ణం మేరకు ఆరు పలకలతో కూడిన అతి పెద్ద త్రీడి చిత్రాన్ని ప్రదర్శించి అందర్నీ ఆకట్టుకున్నారు.

శంకుస్థాపన గ్రామం ప్రత్యేకత

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి రాజధాని నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం విజయవాడకు కూతవేటు దూరంలో కృష్ణమ్మ పాదచెంతనే ఉన్న 'ఉద్దండరాయునిపాలెం' అనే ఒక చిన్న గ్రామంలో జరిగింది. భారత ప్రధాని నరేంద్రమోదీ చేసిన శంకుస్థాపనతో ఈ గ్రామానికి మంచి ప్రాచుర్యం ఏర్పడింది. అందరి దృష్టీ ఉద్దండరాయునిపాలెం పైనే పడింది. వాస్తు రీత్యా అత్యంత శక్తివంతమైన ప్రదేశంగా గుర్తింపు పొందడవల్లే రాజధాని శంకుస్థాపన ప్రక్రియ ఈ గ్రామంలో జరిగింది. నిన్న మొన్నటి దాకా ఈ గ్రామం గురించి విజయవాడ, కృష్ణాజిల్లా వాసులకే పెద్దగా తెలియదు. రాజధాని శంకుస్థాపనతో ఇపుడు ఆ గ్రామం పేరు దేశ, విదేశాలలో మార్మోగిపోతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితం కానున్న అమరావతి రాజధానికి ఈ గ్రామం ప్రధాన భూమిక వహించనున్నది. సుమారు 1500 జనాభా గల ఆ గ్రామంలో 400కు పైచిలుకు ఇళ్లు ఉన్నాయి. ఇన్నాళ్లూ ఈ గ్రామం గురించి తెలియనివారు, పట్టించుకోని వారంతా గ్రామం భవిష్యత్‌ను ఊహించుకుని ఆశ్చర్యపోతున్నారు.

4.08 లక్షల మందికి ఆహ్వానాలు

నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని 4.08 లక్షల మంది అతిథులను ఆహ్వానించడం విశేషం. వీరందరికీ ఆహ్వానపత్రికలు పంపిణీ చేశారు. ఈ పత్రాలను నాలుగు విభాగాలుగా విభజించారు. రైతులు, సామాన్యులకు ఆహ్వాన పత్రికలు అందించారు. మిగతా వారిలో తొలి కేటగిరీగా ఏఏఏ – ఎంఐపిలు, రెండవ కేటగిరీగా ఏఏ – వీవీఐపీలు, తృతీయ కేటగిరీగా ఏ– వీఐపిలుగా విభజించారు. వీరికి సభాప్రాంగణం ప్రవేశ పాసులు, ఎరుపు, నీలం రంగులు గల వాహన పాస్‌లతోపాటు రూట్ మ్యాప్‌లను కూడా ఆ ఆహ్వానపత్రికల్లో పెట్టి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వంతో అనుబంధం ఉండేవారందరినీ మూడు కేటగిరీలుగా పరిగణించి, ఆహ్వానపత్రాలు పంపిణీ చేశారు.

ఆహ్వానపత్రికల్లో ప్రత్యేకత

పైమూడు కేటగిరీలకు చెందిన ఆహ్వాన పత్రికలకు 'క్విక్ రెస్పాన్స్ (క్యూ.ఆర్.)' అనే కోడ్

సభికులలో ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి, కుటుంబ సభ్యులు



నంబరు ఉంది. ఆ పత్రికలపై అతికించి ఉన్న 'హోలోగ్రామ్'ను స్కానింగ్ చేయగానే ఆహ్వానం ప్రభుత్వం జారీచేసినట్టుగా తెలిపోవడంవల్ల నకిలీ ఆహ్వానాలకు తావులేకుండా పోయింది. వాహనపాస్‌లు, వేదిక పాస్‌లు కూడ సరైనవా, కావా అనేది సునాయాసంగా తెలిపోయింది.

'రాకపోకల' సమాచారంపై ప్రత్యేక సెల్

అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర ప్రముఖుల రాకపోకల సమాచారం తెలుసుకునేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అతిథి స్థాయి ఆధారంగా వారికి వాహనం, ఒక కోఆర్డినేటర్‌ను కేటాయించారు. విదేశీ ప్రముఖులకు ఆహ్వానపత్రికలతో పాటుపాస్‌లను నేరుగా పంపిణీ చేయడానికి వీలుగా గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు.

తెలంగాణ నుంచి కూడ 'మట్టి' భాగస్వామ్యం

నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రరాజధాని నిర్మాణంలో తెలంగాణ వాసులు కూడ భాగస్వామ్యం కావడం హర్షణీయం. తెలంగాణ రాష్ట్రంలో పవిత్రమైన పుణ్యక్షేత్రాల నుంచి పలువురు నేతలు సేకరించిన మట, జలాలను కూడా అమరావతి రాజధాని నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో భాగస్వామ్యమైంది. వరంగల్ జిల్లాలోని మేడారం సమ్మక్క –సారలమ్మ జాతర ప్రాంతంలోని మట్టి, జలాన్ని తెలుగుయువత ఆధ్వర్యంలో సేకరించి తెచ్చారు.

ఖిలావరంగల్ నుంచి రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి మట్టిని తీసుకెళ్ళి కలిపారు. దర్గా కాజీపేటలోని హజరత్ అఫ్జల్ బియాబాని దర్గాలోని మట్టిని మాజీ ఎమ్మెల్యే సీతక్క సేకరించారు. మెదక్ చర్చి, పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వద్ద మట్టి, నీటిని సేకరించి అక్కడ తెలుగురైతులు తీసుకువచ్చారు. నిజామాబాద్‌లోని మంజీరా జలాలను , ఖమ్మంజిల్లా భద్రాచలం, కరీంనగర్ జల్లా ధర్మపురి, వేములవాడ ప్రాంతాల నుంచి మట్టి, జలాలను తెచ్చారు. నల్లగొండ జిల్లాలోని యాదాద్రి పుణ్యక్షేత్రం నుంచి జలాలను మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సేకరించారు. రంగారెడ్డిజిల్లాలోని చిలుకూరు బాలాజీ ఆలయం, గండిపేటలోని ఎన్టీఆర్ కుటీరం నుంచి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఇఓ విష్ణువర్ధన్ ప్రభృతులు పుట్టమట్టిని సేకరించి కలిపించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సేకరించిన మట్టి, జలాలను మల్కజ్‌గిరి ఎంపి మల్లారెడ్డి ఎమ్మెల్యే గోపీనాథ్, ఎమ్మెల్సీ చౌదరి, మాజీ ఎమ్మెల్యే ఎల్ రమణల నాయకత్వంలో హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లోని బాలాజీ మందిర్‌కు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం రైలులో శంకుస్థాపన ప్రదేశానికి తరలించి మననీరు–మన మట్టిలో కలిపించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు దంపతులు బాసర సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలుచేయించి, అక్కడ మట్టిని, జలాలను సేకరించి కలిపారు.

దేశం నలుమూలలనుంచి సేకరించిన మట్టి, పవిత్రమైన నదీ జలాలను చంద్రబాబు ఒక రోజు ముందే హెలీకాప్టర్‌లో రాజధాని ప్రాంతంలో వెదజల్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్గాష్టమినాడు మహాసంకల్ప జ్యోతిని ఆవిష్కరించారు. ఆ జ్యోతి ప్రధాని శంకుస్థాపన కార్యక్రమం పూర్తయ్యే వరకు వెలిగేలా చర్యలు తీసుకున్నారు

నవ్యాంధ్రప్రదేష్ నూతన రాజధాని అమరావతి మహానగర నిర్మాణ శంకుస్థాపన అత్యద్భుతంగా, అంగరంగవైభవంగా సాగింది. ఇక అజరామర నగర నిర్మాణానికి రాళ్లెత్తే పని ఆరంభమైనట్టే. బౌద్ధం నడయాడిన ధర్మభూమిలో అన్న దాతలు దానకర్ణులై ఇచ్చిన కర్మభూమిలో 21వ శతాబ్దపు మహా నగర నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ నాంది పలికారు. .

'మా తెలుగుతల్లి 'గీతాలాపనతో శ్రీకారం

భారత ప్రధాని నరేంద్రమోదీ హాజరైన అమరావతి శంకుస్థాపన సభా కార్యక్రమం 'మా తెలుగుతల్లికి...మల్లెపూదండ' గీతంలో ఆరంభమైంది. ఈ గీతాన్ని ప్రముఖ గాయని సునీత ఆలపించారు. ఈ గీతాలాపన పూర్తయ్యే వరకు మోదీతోసహా ప్రముఖులంతా నిలబడే ఉన్నారు. అనంతరం ప్రధాని మోడి, ఇతర ప్రముఖులకు ముఖ్యమంత్రి చంద్రబాబు

పెద్ద ఎత్తున తరలివచ్చిన సినీ కళాకారులు, ప్రజలు





పుష్పగుచ్ఛాలు సమర్పించి, కార్యక్రమానికి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమానంతరం ప్రధాని, ఇతర ప్రముఖులందరికీ 'అమరావతి' జ్ఞాపికలను అందజేశారు.

భారీగా తరలి వచ్చిన మహిళలు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి శంకుసస్థాపన కార్యక్రమంలో అత్యధికశాతం మహిళలే పాల్గొన్నారు. రాజధాని సంబంధిత గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో రైతులు, ప్రజలంతా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి డ్వాక్రా మహిళలు పెద్దసంఖ్యలో సభకు తరలి వచ్చారు.

ప్రధాని మోడికి ఘన స్వాగతం

అమరావతి రాజధాని శంకుస్థాపన కోసం ప్రధాని మోడి న్యూఢిల్లీ నుంచి వాయుసేన ప్రత్యేక విమానంలో గురువారం ఉదయం 11.35కు గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. అనంతరం ప్రధాని 11.58కి హెలికాప్టర్‌లో ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చేరుకున్నారు. శంకుస్థాపన ఘట్టం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.25కు తిరిగి మోడి గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. 2.47కు వాయుసేన ప్రత్యేక విమానంలో తిరుపతికి పయనమయ్యారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మనుమడు ఆర్నెల్ల దేవాన్ష్‌తో ప్రధాని నరేంద్రమోడీ ముద్దూముచ్చట అందర్నీ ఆకర్షించింది. చంద్రబాబు తనయుడు లోకేష్‌బాబు చేతుల్లో ఉన్న దేవాన్ష్‌ను చూసి చిరునవ్వుతో బుగ్గలు గిల్లి, పిల్లాడి చేతుల్లో చేతులు పెట్టి ముద్దైన ముచ్చట్లు చేశారు. మోడి తన కళ్లజోడును తీసి దేవాన్ష్ కళ్లకు పెట్టి కొద్దిక్షణాలు అందర్నీ నవ్వించారు. ఆ సమయంలో లోకేష్ సతీమణి బ్రాహ్మణి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరీ దేవి, ఇతర ప్రముఖులంతా ఉన్నారు.

గిన్నీస్‌బుక్‌లో 'అమరావతి'...

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా అత్యంత అపూర్వంగా జరిగిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కార్యక్రమం గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కబోతోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేంద్ర మంత్రి చౌదరి వెల్లడించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని నమోదు చేసుకునేందుకు గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు కూడా హాజరుకావడం మరో విశేషం.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పవిత్రమైన కృష్ణానదీ తీరంలో నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతి మహానగర నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, తెలుగుదనం...మేళవింపుతో కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. అమరావతిసంస్కృతి గొప్పదనం, వారసత్వం, చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఎంతగానో ఆకర్షించాయి. రాజధాని నిర్మాణానికి అవసరమైన భూములను త్యాగం చేసిన రైతులకు వందనం చేస్తూ ప్రదర్శించిన నృత్యరూపకం సభికులందరినీ మెప్పించింది.

వందేమాతరం శ్రీనివాస్ అలపించిన దేశభక్తి గేయం, అమరావతి రూపకర్త, నవ్యాంధ్ర సారథి, నదుల అనుసంధానంతో చరిత్ర సృష్టించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని సమర్ధతను ప్రశంసిస్తూ కళాకారులు పలు గేయాలను ఆలపించారు.

ప్రతిష్ఠాత్మకంగా జరిగిన అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి సినీనటుడు సాయికుమార్, గాయని సునీత వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. తెలుగువారి గొప్పదనం, అమరావతి ప్రత్యేకత, అమరావతి నిర్మాణ ప్రదేశం ప్రత్యేకతల గురించి మధ్యమధ్యలో తమదైన శైలిలో వివరిస్తూ కార్యక్రమం ఆహుతులకు రక్తికట్టించేలా చొరవ చూపారు. రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు వందనం తెలుపుతూ కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకంఅందర్నీ ఆకర్షించింది. కూచిభొట్ల ఆనంద్ ఆధ్వర్యంలో కళాకారులు 'దండాలు దండాలు ఓ రైతన్న... వేల వేల దండాలు మా రైతన్న' అంటూ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

అనంతశ్రీరామ్ రాసిన రైతుకు వందనం పాటను వందేమాతరం శ్రీనివాస్ బృందం ఆలపించారు.

సభకు హాజరైన రాష్ట్ర నాయకులు, ఇతర ప్రముఖులు



రాజధాని కోసం తొలి రైతుగా భూమి ఇచ్చిన ఆదిలక్ష్మి పేరుతోపాటు మొత్తం 29 గ్రామాల రైతులకు పాదాభివందనాలు అంటూ పలుమార్లు రైతుల త్యాగాలను వ్యాఖ్యాతలు సాయికుమార్, సునీత సందర్భోచితంగా ప్రస్తావించారు.

చంద్రబాబుపై కళాకారుల ప్రశంసల జల్లు

అమరావతి మహానగరం నిర్మాణానికి సారథ్యం వహిస్తున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును పలువురు కళాకారులు ఈ సందర్భంగా కొనియాడారు. 'వస్తున్నా మీకోసం... వస్తున్నా మీకోసం...' అంటూ గుమ్మడి గోపాలకృష్ణ చంద్రబాబును అభినందిస్తూ పద్యగానం ఆలపించారు. నవ్యాంధ్ర సృష్టికర్త, అమరావతి రూపశిల్పి అంటూ కళాకారులు చంద్రబాబును ప్రశంసల జల్లు కురిపిస్తూ నృత్యాలు చేశారు. 'మచ్చలేని చంద్రుడు... స్వచ్ఛభారతీయుడు... అచ్చతెలుగు ఆంధ్రుడు' అంటూ చంద్రబాబును ఉద్దేశించి రమేష్ బృందం ఆలపించిన గానానికి ఆహుతుల నుంచి మంచి స్పందన వచ్చింది. సామాజిక పింఛన్లు, రైతు రుణమాఫీ, నవ్యాంధ్ర భవిష్యత్తు, రాజధాని నగర నిర్మాణం తదితర అంశాలను స్పృశిస్తూ గాయకులు చంద్రబాబుని ప్రశంసించారు.

జయహో అమరావతి...

అమరావతి నగర నిర్మాణాన్ని కీర్తిస్తూ భవిష్యత్తులో ధనరాశులతో ఆంధ్రరాజ్యం వర్ధిల్లాలంటూ పసుపర్తి రామలింగేశ్వరశాస్త్రి రూపొందించిన నృత్యరూపకం తెలుగువారి గతకీర్తిని వివరిస్తూ, అందర్నీ ఆడుకున్నది. అసమానం, అద్భుతమైన జయహో అమరావతి అంటూ తెలుగువారి ప్రతిభకు అద్దంపట్టేలా అద్భుతమైన నృత్యాన్ని ప్రదర్శించి ఆహుతులను ఆకట్టుకున్నారు. వందేమాతరం అంటూ రింగ్‌లతో చేసిన కళాకారుల నృత్యం ఆకట్టుకుంది.

ముగ్ధులను చేసినశివమణి వాయిద్యం

ప్రముఖ డ్రమ్స్ వాద్యకారుడు శివమణి వాయిద్యం అందర్నీ ముగ్ధులను చేసింది. శంకువు ఊది... తాళాలు కొట్టి ఆరు గంటలపాటు నిర్విరామంగా చేసిన శివమణి ప్రదర్శన సభికులను ఉర్రూతలూగించింది. శివమణి బృందం వాయిద్యహోరుతో ఆద్యంతం జనాన్ని ఓలలాడించారు.

సర్వమతపెద్దల ప్రార్థనలు

అమరావతి శంకుస్థాపన సందర్భంగా హిందూ, ముస్లిం, బౌద్ధ, జైన, క్రైస్తవ మతపెద్దలు ప్రజారాజధాని నిర్మాణం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ సర్వమతపెద్దలు ప్రార్థనలు చేశారు.

పోలీసుల సేవలు

రాజధాని శంకుస్థాపన కార్యక్రమంలో దాదాపు 9 వేలమంది పోలీసులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 14 మంది ఐపీఎస్‌లు, 855 మంది డిఎస్పీలు, సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు, 7673 మంది పోలీసుల మొత్తం 8,531 మంది పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. సభా ప్రాంగణాన్ని 12 సెక్టార్లుగా విభజించి 12 మంది ఐపీఎస్ ఉన్నతాధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

నవ్యాంధ్రప్రదేశ్ పర్యాటక,సాంస్కృతికశాఖల ఆధ్వర్యంలో అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను బాగా ఆకట్టుకున్నది. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ సందర్శించి, ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందించారు. తొలి విభాగంలో అమరావతి, అమరావతి నగర చరిత్ర, రెండో విభాగంలో 29 గ్రామాల రూపురేఖలు, ప్రజల జీవన విధానం, మూడో విభాగంలో సింగపూర్ మాస్టర్ ప్లాను, భవిష్యత్ అభివృద్ధిపై ఊహా చిత్రాలను ప్రదర్శించారు.

అతిథులకు తెలుగింటి రుచులు

అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి తెలుగింటి ప్రత్యేక వంటకాలను రుచి చూపించారు. వచ్చే దేశ, విదేశీ ప్రముఖులు, రైతులు, ఆహ్వానితులందరికీ తెలుగింటి వంటకాల రుచులు చూపించారు. దాదాపు లక్షన్నర మంది రైతులు, సామాన్య ప్రజలకు పసందైన, రుచికరమైన భోజన, అల్పాహారాలను అందించారు. ఆహార సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేకమైన ఆహార ప్యాకింగ్‌లు చేసి జయప్రదంగా సరఫరా

చంద్రునికో నూలుపోగు

అమరావతి శంకుస్థాపన మహూత్సవం – ఒక రోజు కార్యక్రమం కాదు; దానికి ముందూవెనకలున్నాయి; వాటి వెనక కష్టసుఖాలున్నాయి; ఆకాంక్షలు ఆలోచనలై, ఆనక భూమార్గం పట్టి ఆచరణలైన సాధకబాధకాలున్నాయి. అందరూ సమష్టిగా జరిపించి గెలిపించుకున్న ఆశయమే అమరావతి శంకుస్థాపన. అయితే, అందరినీ ఆ ఆశయం వైపు నడిపించిన స్ఫూర్తి, అందరి కోసం ఒక్కడై నిలిచిన మూర్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. మొక్కవోని ఆయన పట్టుదల, సడలని సంకల్పబలం, విరామమెరగని కార్యకర్తృత్వం కలగలిసి ఐదుకోట్ల మంది ఆంధ్రుల్ని, అశేష ప్రవాసాంధ్రుల్నీ ఉర్రూతలూగించడమే కాదు, స్వపక్ష విపక్ష నేతల్ని, దేశ విదేశ ప్రముఖుల్నీ కూడా సంభ్రమాశ్చర్యాలకి గురిచేశాయి. చంద్రబాబుని ముంచెత్తిన ప్రశంసలే అందుకు నిదర్శనం.

సింగపూర్ మంత్రి కె. ఈశ్వరన్, జపాన్ మంత్రి నయోషీ నోగుచి తమ ప్రసంగాలలో చంద్రబాబుపై ప్రశంసలు కురిపించారు. ఒక జాతి యావత్తునీ ఒక తాటి మీద నడిపించడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి తార్కాణమని శంకుస్థాపనకి హాజరైన హైదరాబాద్‌లో బ్రిటిష్ డిప్యూటీ కమిషనర్ ఆండ్రీ మెక్‌మినిస్టర్, బంగ్లాదేశ్ హైకమిషనర్ మహ్మద్ తారిక్ కరీం, వెనిజుల్లా రాయబారి అగస్టో ముంటియల్ వంటి విదేశీ అతిథులు అభిప్రాయపడ్డారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి మాత్రమే కాదని, సూర్యోదయ రాష్ట్రం నవ్యాంధ్ర – సిఈవో కూడానని కార్యక్రమానికి హాజరైన దాల్మియా సిమెంట్స్, వాల్‌మార్ట్ ఇండియా, సుమిటోమో కార్పోరేషన్, మిత్సుబిషి ప్రతినిధులు ప్రశంసించారు. అమరావతి స్వప్నం చంద్రబాబు వల్లే సాకారమయ్యిందని శంకుస్థాపన మహోత్సవంలో పాలుపంచుకున్న పారిశ్రామికవేత్తలు జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, అపోలో హాస్పిటల్ చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అన్నారు.

అభినందన సందేశాల వెల్లువ

ప్రపంచానికీ తలమానికంగా నిలిచే రాజధాని నగరాన్ని నిర్మించగల సమర్థత దార్శనికత మీకు ఉన్నాయని ప్రశంసిస్తూ, చంద్రబాబు తలపెట్టిన కార్యక్రమం విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రికి పలువురు నేతలు లేఖలు పంపారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, చోడులు పరిపాలించిన నేలపై ఏపీ రాజధాని నిర్మాణం జరగడం భారతీయ సంస్కృతికి పట్టం కట్టడమేనని బీజేపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రజల ఆంకాంక్షలకు తగ్గ రాజధానిని నిర్మించదగిన కార్యదక్షత చంద్రబాబుకే ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. ప్రపంచంలోనే అందమైన నగరాల్లో అమరావతి ఒకటిగా నిలుస్తుందని, ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని భుజానికెత్తుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదుని అభినందిస్తున్నానని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జనరల్ వీకే సింగ్ తన లేఖలో పేర్కొన్నారు.

ఆంధ్రుల రాజధాని అమరావతి కల సాకారానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ఎంతో గొప్పదని తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత తన సందేశంలో ప్రశంసించారు. చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు గొప్ప అభివృద్ధి బాటలో పయనించాలని ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) అధ్యక్షుడు కరుణానిధి తమ శుభాశీస్సులు అందించారు. రెండు వేల యేళ్ల చరిత్ర కలిగిన అమరావతి పేరిట నిర్మితం కానున్న రాజధాని నగరం వెయ్యేళ్ళు పరిఢవిల్లాలంటూ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఓ లేఖలో ఆకాంక్షించారు.

చేయగలిగారు.

ప్రముఖుల ఆహారంలో గోంగూర

ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులందరికీ ప్రత్యేక భోజనం, అల్పాహారాన్ని అందించారు. సూప్‌లు, భోజనం, పండ్లు, ఇతర స్నాక్స్ తదితర పదార్థాలను పంపిణీ చేశారు. లెమన్ జ్యూస్, గ్రీన్ సలాడ్, మొలకెత్తిన గింజలు, మొక్కజొన్న సలాడ్‌లు కూడ అందించారు. గోంగూర పచ్చడి, మిరియాల రసం, కొత్త ఆవకాయ, వంకాయ పచ్చిపులుసు, మెంతీ మజ్జిగ, కొబ్బరి చట్నీ, పచ్చి జామకాయ పచ్చడి, కరివేపాకు కారం, కొబ్బరి శనగకారం, అప్పడాలు, తేనె జిలేబీ, నేతి బొబ్బట్లు అందించారు. వీటితోపాటు మూడు రకాలైన ఐస్‌క్రీములు, మిఠాయి కిళ్లీ, సాధారణ కిళ్లీలు కూడా సరఫరా చేసారు. వీవీఐపీలకు పూర్ణం, డ్రైఫ్రూట్స్, కార్న్ సమోసా, రియల్ ఫ్రూట్ జ్యూస్ అందించారు.

వైద్యశిబిరాలు, ఇతర ఏర్పాట్లు

సభా ప్రాంగణం వద్ద వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో 25 వైద్య శిబిరాలను నిర్వహించారు. 15 వందల మంది పారిశుధ్య సిబ్బంది, 250 మంది మలేరియా నియంత్రణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది తమ సేవలను అందించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా లక్షా 50 వేలమందికి ఆహార పొట్లాలను, మంచినీటి ప్యాకెట్లను, సీసాలను అందజేశారు. హెరిటేజ్ సంస్థ లక్షన్నర మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసింది.

తరలివచ్చిన ప్రముఖులు...

రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రముఖుల్లో సింగపూర్ మంత్రి కె ఈశ్వరన్, జపాన్ మంత్రి నయోషీ నోగుచి, తమిళనాడు గవర్నర్ కె రోశయ్య, అసోం, నాగాలాండ్ గవర్నర్ పిబి ఆచార్య, తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్ వి రమణ, కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, నిర్మలా సీతారామన్, వైఎస్ చౌదరి, ఉమ్మడి హైకోర్టు ప్రధాన నాయమూర్తి దిలీప్ బాబా సాహెబ్ భోంస్లే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు, విధాన మండలి చైర్మన్ చక్రపాణి, శాసనసభ స్పీకర్ కోడెల ప్రసాదరావు, హైదరాబాద్‌లో బ్రిటిష్ డిప్యూటి కమిషనర్ ఆండ్రీ మెక్‌మినిస్టర్, డిప్యూటీ హెడ్ అభిలాష్ పుళఖరా, బంగ్లాదేశ్ హైకమిషనర్ మహ్మద్ తారిక్ కరీం, బెల్జియం ఎంబసీ ప్రతినిధులు పెట్కో డోయెకో, వెనిజుల్లా రాయబారి అగస్టో ముంటియల్, మునీ ముంటియల్, కెనడా, రువాండా హైకమిషనర్లు ఉన్నారు.

పారిశ్రామికవేత్తలు మిత్సుబిషి ప్రతినిధులు మన్సూయాకీ గుబో, సంజయ్ ముండ్లే, దాల్మియా సిమెంట్స్ ఎండీ గోనె పునీత్, సుమిటోమో కార్పోరేషన్ జిఎం సిద్దికి ఎమానో, మెక్సి డైరెక్టర్ రియో ఇసుదున్, సుమిటోమో ఇండియా చైర్మన్,

మసాహిరో నకియో తేదసుజరోతాని, హెచ్ ఓడీ (చెన్నయ్) సుమిటోమో జీఎం చంద్రమౌళీశ్వరన్, వాల్‌మార్ట్ ఇండియా ఉపాధ్యక్షుడు రజనీష్ కుమార్, మార్గ్ ప్రతినిధి జిఆర్‌కె రెడ్డి, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ శ్రీ గ్రంథి మల్లికార్జునరావు, రుచిసోయా సంస్థ ప్రతినిధి కపిల్ జైన్, అపోలో హాస్పిటల్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి పాల్గొన్నారు.

– డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

అర్థంచేసుకున్నామా అమరావతిని?



క్యోటో లాంటి పాతనగరం మోడల్ అనుకుంటాం...!

కాళ్లు తడవకుండా బైటపడేందుకు ప్రయాసపడే వెనిస్ మనకి అద్భుతం...!

ఉడెన్, గ్లాస్ స్ట్రక్చర్స్ తో కనిపించే డెలికేట్ బ్రెసీలియా మనకి సమ్మోహనం...!

ఇవన్నీ కాదు. వీటన్నిటినీ తలదన్ని... ప్రపంచమే ఆదర్శంగా తీసుకునేంత అద్భుతం అమరావతి.

అబ్బురంగా చెప్పడం కాదు... నిబ్బరమైన నిజం ఇది. ఆర్కిటెక్చర్, రూపురేఖల్లోనే కాదు జీవన ప్రమాణాలు, అన్నిటికీమించి ప్లానింగ్ లోనూ ప్రపంచానికి నమూనా కాబోతోంది మన రాజధాని. రాబోయే కాలానికి కాబోయే అద్భుతం అమరావతి అని చెప్పేందుకు ఒకట్రెండు కారణాలు చెప్పడమైతే కష్టం. పదులు, వందలు చెప్పే అవకాశం ఉంటే తప్ప !! ఎదుటివాటితో పోల్చుకునే నగరాలు చాలానే ఉంటాయ్. కానీ పోల్చిచూడదగినవి కొన్నే! అలాంటి కొన్నిట్లో ఒక్కటిగా... యునిక్ అప్పీల్‌తో అమరావతి అలరారబోతోందనేది ఆకాంక్ష కాదు. భరోసా !

ప్లానింగ్ లేకపోతే ఎంత భయానకంగా ఉంటుందో ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా లాంటి నగరాల్ని చూస్తే అర్థమవుతుంది. నిర్మించిన ఉద్దేశం వేరు... ఇప్పుడున్న పరిస్థితి వేరు అన్నట్టు తయారైన నగరాలివి. ఢిల్లీ 1500 % అధిక వలసలతో దిగజారిపోతోంది. మిగతా నగరాల్లోనూ అంతే ! కనీసం 500 శాతం జనాభా ఓవర్ ఫ్లో అయ్యింది ఇప్పటి వరకూ ! ఎలాంటి ఆలోచనా లేకుండా చుట్టుపక్కల భూములు, ఇండస్ట్రియల్ పాలసీ... సివిక్ ప్లేసెస్ మేనేజ్ మెంట్ లాంటివి పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి నగరాల్లో దాదాపు 40 శాతం జనాభా మురికి వాడల్లో బతుకుతోంది. 1975 ఢిల్లీలో కొత్తగా 27 కాలనీలు నిర్మించారు... మురికివాడలు లేకుండా చూసేందుకు. పరిశ్రమల్ని కూడా మాయా పురి, వజీర్ పూర్ లాంటి శివారు ప్రాంతాలకి తరలించారు. అయినా ఆ తర్వాత కూడా అదే అవ్యవస్థ కంటిన్యూ అవుతోంది. ఇప్పటికీ ఢిల్లీ జీవన పోరాటంచేస్తూనే ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే కాదు మొన్నీమధ్య కట్టుకున్న సిటీల పరిస్థితి కూడా ఇంచుమించు ఇంతే! 75 ఏళ్ల నాడు న్యూఢిల్లీ నిర్మాణం జరిగినా...తర్వాత, చండీగఢ్ లాంటి సిటీలు కట్టుకున్నా అవన్నీ అవసరాల పునాదులపైనే ఉన్నాయ్ తప్ప... వాటి పునాదులు మన అవసరాలు తీర్చేవిగా ఉన్నాయా అంటే సమాధానం దొరకడం కష్టం. భోపాల్, భువనేశ్వర్ ఆధునిక సొబగులు అద్దుకున్నా పరిస్థితుల ప్రభావానికి తగ్గట్టుగా సర్దుకుపోయాయ్ తప్ప... తలెత్తి ప్రపంచం వైపు చూసింది తక్కువే ! ఇక పరిపాలనా అవసరాలకోసం కొత్తగా కట్టిన గాంధీ నగర్ కేవలం గుజరాత్ ప్రభుత్వానికి ఆఫీస్‌లా ఉంటుందంతే! ఇలాంటి సిటీలు చూస్తే... పరిపాలనా అవసరాల్ని దృష్టిలో పెట్టుకొనే ఇక్కడ ఇటుకలు పేర్చారని అర్థమైపోతుంది. ఇదంతా ప్లానింగ్ లేని ఫలితం. ఒక్క ఢిల్లీనే కాదు ముంబై, కోల్‌కతా లాంటి నగరాల్లో ఇలాంటి పరిస్థితులు పేదరికానికి జాతీయస్థాయి నమూనాలు. ఇండియా పరువు అంతర్జాతీయ స్థాయిలో పోవడానికి కూడా ఇవి కారణాలే !

పెరిగే జనాభాకి తగ్గట్టు సౌకర్యాల్లేకపోవడానికి తోడు... ఇండియాలో నగరాలు ఎదుర్కొంటున్న మరో పెనుముప్పు కాలుష్యం. గ్రీన్ జోన్ లేకపోవడం. గ్రీన్ పాలసీ జోలికే వెళ్లకపోవడం. వాహనాలు పెరిగి గాలి కాలుష్యం..డ్రైనేజీ లాంటి కనీస వ్యవస్థలు కూడాలేక నీరు, భూమికూడా కలుషితం అవుతున్నాయ్. పరిశ్రమలెక్కడ...జనావాసాలెక్కడ అనే స్పష్టత ఇప్పటికీ కనిపించని మన నగరాలు అవ్యవస్థకి ఆనవాళ్లు. హైద్రాబాద్‌నే తీసుకోండి. ఎప్పుడో నిజాం కాలం నాటి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ. కొత్తగా పెరిగిన భారాన్ని తట్టుకోలేదు. ఇప్పుడా విస్తరించే అవకాశం కనిపించడం లేదు. శివార్లలో అపార్టుమెంట్లు పుట్టుకొచ్చినా... పైన రంగుల మేడలు, కింద మట్టి రోడ్లు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. డ్రైనేజీ, కనెక్టివిటీ అనేవి ఉండనే ఉండవ్. కూకట్ పల్లి, బీహెచ్ఈఎల్ లాంటి ప్రాంతాలే చెబుతాయ్ ఆ సంగతి. అందుకే దుర్భరం అయిపోతోంది చాలా ప్రాంతాల్లో జీవనం. దేశంలో చాలారాష్ట్రాలు ఇంకా కళ్లు తెరవకముందే, 1979లోనే మహారాష్ట్ర... మురికివాడలు, కాలుష్యంలేని ముంబై కోసం ఆదేశాలిచ్చింది. ఇప్పటి వరకూ ప్రయత్నాలు... రీప్లేస్ మెంట్లూ జరుగుతున్నాయి తప్ప కాలుష్యం తగ్గింది లేదు. వలసలూ అగడం లేదు. యాభై ఏళ్లనాడైనా వందేళ్ల నాడైనా వ్యూహంతో... ముందుచూపుతో... నిర్మాణం జరగకపోతే ఆ తర్వాత మనుగడ కష్టనష్టాలవుతుంది అనేందుకు ఇవన్నీ ఉదాహరణలు.

పదిహేనేళ్ల నాడే కొత్త రాష్ట్రంగా ఏర్పడిన చత్తీస్‌గఢ్ ఇప్పుడిప్పుడే రాజధాని రాయ్‌పూర్‌లో తొలి విడత పూర్తిచేసింది. రాయ్‌పూర్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో నిర్మాణమవుతోందే తప్ప అంతకు మించి అడుగుముందుకు వేయలేకపోతోంది. 25 వేల ఎకరాల్లో మూడు దశల ప్లానింగ్ ఉంది. గ్రీన్‌జోన్ అందుబాటులోకి వచ్చింది. కానీ మౌలిక సదుపాయాల్లో భారీతనం... ఆర్థికకోణం... పోటీ తత్వం లాంటివి తక్కువున్నట్టు కనిపిస్తాయ్. పూర్తిగా పరిపాలనా కోణంలో రూపుదిద్దుకున్న రాజధాని ఇది. అందుకే... వైశాల్యాన్ని బట్టీ చూసినా ప్లానింగ్ లెక్కతేల్చినా ఇండియాలో మహా నగర నిర్మాణానికి పునాది వేస్తున్నది

అమరావతే ! ఉన్నంతలో సర్దుకుపోవాలన్నది వందేళ్లనాటి ఆలోచన. అవసరాలకి తగ్గట్టుగా అంచనాలు పెంచుకోవాలన్నది ఇప్పటి జీవన విధానం. సామర్థ్యం పెంచుకోవడం ఎలా అనే ఆలోచన నుంచి ఆల్టర్‌నేటివ్ ఐడియా పుడుతుంది. ఆచరణలో సవాళ్లను ఎదుర్కోవడం అలవడుతుంది. ప్రొడెక్టివిటీ పెరుగుతుంది. మనకంటే ముందున్న దేశాలతో, వ్యవస్థలతో పోటీ పడాలంటే ఇది తప్పనిసరి. నగర నిర్మాణం కూడా ఆర్థిక వ్యవస్థలో భాగమే ! మరి మనం నేటిమార్పులను తట్టుకుంటూ రేపటి కూర్పును ఎలా సాధించాలో చూపించబోతోంది అమరావతి.

ఫస్ట్ వరల్డ్ క్లాస్ ఇండియన్ సిటీ... అమరావతి

ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు లాంటి ప్రస్తుత నగరాలు ఎదుర్కొంటున్న దుర్భర సవాళ్లేవీ అమరావతి డిక్షనరీలో ఉండబోవు. జనావాసాలు ఎంత వరకూ ఉండాలో ఇక్కడ నిర్దిష్టంగా నిర్ణయించేశారు. పారిశ్రామిక వాడల్ని కూడా ఇముడ్చుకున్న ప్లానింగ్ అమరావతిది. ఇప్పుడు కాదు మరో 35 ఏళ్ల తర్వాత ఎదురయ్యే అవసరాల్ని కూడా అందుకునేందుకు విజన్ 2050తో నిర్మిస్తున్న నగరం కాబట్టి వలసల్ని తట్టుకోవడం ఎలాగో ఆంధ్రా రాజధానికి తెలుసు. ఇప్పుడు పన్నెండులక్షలున్న జనాభా కోటీ 30 లక్షలకి పెరిగినా ఢోకాలేని విధంగా నిర్మాణం జరుగుతోందిప్పుడు. అమెరికా, ఐరోపా నగర నిర్మాణంలో మాత్రమే ఇంత ప్లానింగ్ ఉంది ఇప్పటి వరకూ ! ఓ నగర జనాభా వలసలతో వేగంగా పెరుగుతుంటే... వెంటనే కౌంటర్ పాలసీ ఉంటుందక్కడ. అనుబంధంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అవకాశాలు సృష్టించి అభివృద్ధి చేయడం.. బ్యాలెన్సింగ్ యాక్ట్ ఉండేలా చూడ్డం వ్యూహంలో భాగం. ఇవన్నీ డెవలప్డ్ నేషన్స్‌లో మాత్రం ఉంటాయ్... అనే అభిప్రాయాన్ని మార్చబోతున్న తొలి భారతీయ నగరం అమరావతి. ఎందుకంటే.. భవిష్యత్ అవసరాలు, ఎదురుకాబోయే సవాళ్లే మన రాజధానికి పునాదులు.

తొలి రాయి నుంచి కాదు ఆలోచనల స్థాయి నుంచే అమరావతి వరల్డ్ క్లాస్ మోడల్. అందంగా కనిపించే ఏ లండనో పారిస్సో మన మోడల్ అనలేదు. సింగపూర్ అన్నాం ! అందులోనే ఉంది లాజిక్. యూరోపియన్ నగరాలు వందల ఏళ్లనాటికి పాత ఆర్కిటెక్చర్. పారిశ్రామిక విప్లవ ఒరవడిలో పుట్టి పెరిగిపోయాయ్. జనాభా తక్కువ కాబట్టి ఇప్పటికీ పెద్ద సమస్యలు రావడం లేదు. మనకి అలా కాదు మరి ! అవసరాలెక్కువ. జనాభా విపరీతం. వచ్చిపడే వలసలు దుంపతెంచేస్తాయ్. దానికితోడు అభివృద్ధి విసిరే సవాళ్లు తట్టుకుంటూ అవసరాల్ని కలుపుకొంటూ రావాలి. అంటే మోడ్రన్ థింకింగ్ ఆవసరం. సింగపూర్ గత యాభై ఏళ్లలో పుట్టిపెరిగిన నగరం. యవ్వనం తొణికిసలాడే సిటీ. ప్రపంచీకరణ తెలుసు. అవసరాలను అలవోకగా అందుకోవడమూ వాళ్లకి అలవాటే ! అందుకే బెస్ట్ సూటెడ్ మోడల్ మన రాజధానికి ! అందుకే మనం మొదలవుతున్నదే 2050 దగ్గర. అప్పటి అవసరాలు... సవాళ్లు... జీవన విధానం అన్నీ ఇందులో ఉన్నాయ్ చూడండి కాస్త జాగ్రత్తగా ! తొమ్మిది సిటీల ప్లానే తీసుకోండి. సపోజ్ జస్టిస్ సిటీ. హైకోర్ట్ అక్కడే. మిగతా కోర్టులూ చుట్టుపక్కలే. పరిసరాల్లోనే లా వర్సిటీ. అడ్వొకేట్ జనరల్ ఆఫీసూ అందిపుచ్చుకునేంత దూరంలోనే ఉంటుంది. ట్రాఫిక్ గోల లేదు. కాలుష్యం తగ్గుతుంది. టైమ్ సేవ్ అవుతుంది. అన్ని అవసరాలు ఒకేచోట తీరే సౌకర్యం ఉంటుంది. ఇండియాలో ఇప్పటి వరకూ ఇలాంటి మోడల్ లేదు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య లేకుండా సౌకర్యవంతంగా ఉండాలన్న ఆలోచనే చెబుతుంది అమరావతి ఎంత ప్రణాళికా బద్ధంగా ప్రాణం పోసుకుంటోందో !

అర్థం చేసుకున్నామా అమరావతిని !

బతుకుదెరువు కోసం పక్క ప్రాంతాలకి వెళ్లడమో పక్క రాష్ట్రాలపై ఆధారపడమో... రెక్కలుకట్టుకొని లెక్కలు తలకిందులు చేస్తూ విదేశాల్లో వాలిపోవడమో మాత్రమే తెలుసు ఇప్పటి వరకూ మనకి. ఆ అవసరం లేకుండా మన ముందు తరాలకి వర్క్‌ప్లేస్‌గా మారి భవిష్యత్ ఇస్తోంది అమరావతి. రాజధాని అంటే పాలనే కాదు ఆలన కూడా ఉంటుందని నిరూపించబోతున్న మోడల్ మన కేపిటల్. ఓ నగరాన్ని విస్తరించడం ఎలాగో హైద్రాబాద్ లో పదిహేనేళ్లనాడు చేసి చూపించింది ఇదే నాయకత్వం. జూబ్లీహిల్స్ గుట్టల వరకే పరిమితమైన సిటీని మాదాపూర్ గచ్చిబౌలి దాకా తీసుకెళ్లింది ఇలాంటి ప్లానింగే. 450 ఏళ్లుగా చరిత్రకి సాక్ష్యంగా మాత్రమే కనిపించిన నగరం ఆర్థిక వ్యవహారాలకి ఆటపట్టుగా మారింది ఇలాంటి మార్పుతోనే ! సైబరాబాద్ పుట్టుకొచ్చాకే ! జంట నగరాలంటూ అప్పటిదాకా చెప్పుకున్న హైద్రాబాద్, సికింద్రాబాద్ సైబరాబాద్ చేరికతో కొత్త ఫేజ్ కోసం వెదుకుతున్నాయిప్పుడు. ఆర్థిక సామర్థ్యం అమాంతం పెరిగింది. ఐటీ ఎగుమతుల్లో దేశంలో రెండోస్థానం చెక్కుచెదరకుండా ఉంది అప్పటి నుంచి. ఇదంతా పునాదిలో పదును. అమరావతిలో ఇలాంటి వ్యూహం తొలి ఇటుక నుంచే ఉంది. అందుకే అమరావతి అపూర్వం.

మనీస్పిన్నింగ్ మోడల్‌ని మన రాజధాని ఓన్ చేసుకుంది. అందుకే నిర్మాణ రూపురేఖలు కాస్త తేటపడడం ఆలస్యం... ఇక ఆర్థిక కార్యకాలాపాలు చేతికొస్తాయ్. కంపెనీలు అంతర్జాతీయ సంస్థల్ని తీసుకొస్తాయ్. ఆదాయాన్నీ తెచ్చిపెడతాయ్. నిర్మాణ దశ నుంచే... ఇలా ఆర్థిక కార్యకలాపాల్నీ, అడ్మినిస్ట్రేటివ్ యాక్టివిటీనీ.. లైఫ్లీహుడ్‌ని ఇంకా టూరిజం లాంటి మరో ఆరు హంగుల్ని ఏకం చేసిన నగరం అమరావతి. దేశంలోనే మొదటిది. ఇదంతా దశలవారీగా జరగబోతున్న అమరావతైజేషన్. పిల్లర్లు వేసి భవంతి నిర్మించినట్టు... తొమ్మిది నమూనాలే మూలాలుగా అమరావతి రూపుదిద్దుకోబోతోంది. ఐదారేళ్లలో తొలివిడత సిద్ధమైయ్యాక రెండోదశ పట్టాలెక్కుతుంది. ఇక మూడో లేయర్ వచ్చేసరికి అమరావతి కాదు ఏపీ స్వరూప స్వభావాలే మారిపోతాయ్. మాకూ అమరావతి ఉందని ఆంధ్రుడు కాదు ఇండియా సగర్వంగా చెప్పుకునేస్థాయి అందుకోడానికి కొంత సమయం పడుతుంది.

అమరావతికి ఆంధ్రుల హారతి

కాంక్రీట్ కట్టడాలు... పునాదుల్లో మన మట్టి.. మన నీరే కాదు అమరావతి అంటే ! కడుతున్నది నగరం మాత్రమే కాదు. జరగబోయేది బిల్డింగ్స్ నిర్మాణమొక్కటే కాదు. జాతి నిర్మాణం. సాంస్కృతిక పునరుజ్జీవం. ఆంధ్రప్రదేశ్‌కీ ప్రపంచానికి మధ్య వారధి. ఇండియాలో వేళ్లూనుకోబోతున్న నవీన నగర సంస్కృతికి నమూనా ! ఏపీ వైభవాన్ని తెలిపే కిరీటంలా వెలుగొందడమే కాదు..సామర్థ్యానికి ప్రతిబింబే స్థాయి...అవునా అనిపించే ఆకర్షణ... అన్నీ ఉంటాయ్ అమరావతిలో! సింగపూర్‌లో అయితే ఇలా ఉంటుంది... మొన్న స్పెయిన్ లో చూశా... అంటూ చెప్పుకునే అవసరం లేకుండా అంతటి అంతర్జాతీయ హంగులు కూడా అద్దుకుంటుంది. అక్కున చేర్చుకుంటుంది. సీడ్ కేపిటల్ స్థాయి నుంచి విశ్వరూపం చూపించే విస్తరణ దాకా ఇవన్నీ అమరావతి తనలో ఇముడ్చుకోబోతున్న ప్రత్యేకతలు.

మరో మాట. అమరావతి ఏపీకి ప్రాణవాయువు. ఆయువు. సింగపూర్‌కి కూడా అంతకు ఏ మాత్రం తక్కువ కాదు. ఎందుకంటే... సింగపూర్ వెలుపల ఆ దేశం చేపడుతున్న అతి పెద్ద ప్రాజెక్ట్ అమరావతి నిర్మాణమే ! ఇంతకు ముందు భవంతులు కట్టి ఉండొచ్చు. ప్లాన్లు వేసి ఉండొచ్చు. కన్‌స్ట్రక్షన్ నమూలు ఇచ్చి ఉండొచ్చు గాక! ఇపుడు ఏకంగా అంతర్జాతీయ నగర నిర్మాణం. ఇది సింగపూర్ నగిషీకే పరీక్ష. సామర్థ్యానికి సవాలు. ఇదోకోణం. మరో రకంగా చూస్తే..ఇది సింగపూర్ కి ఎలివేషన్ కూడా ! నది ఒడ్డున...సముద్రానికి... దగ్గరలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రపంచమంతా కళ్లు విప్పార్చి చూస్తుండగా ఓ నగరాన్ని నిర్మిస్తే... అది ప్రపంచస్థాయి నగారా అయిపోవడం ఖాయం. ఓ మాన్యుమెంట్‌లా... ఆధునిక లివింగ్‌కే జ్యూవెల్‌లా ధగద్ధగలాడిపోతుంది. అమరావతి ఖ్యాతితోపాటు సింగపూర్ ప్రఖ్యాతి కూడా దశదిశలా విస్తరిస్తుంది. అందుకే సొంతపనిలా చేయక తప్పదు. ముందునుంచి కమిట్‌మెంట్‌కి కేరాఫ్‌లా ఉండే సింగపూర్‌కి ఇది అదనం. అందుకే అమరావతి నిర్మాణంపై నిశ్చింతగా ఉండొచ్చు. నిర్మాణ కౌశలాన్ని కాన్ఫిడెన్స్‌ని కళ్లారా చూడొచ్చు.

– కామేశ్ గూటాల

‘రిజిస్ట్రేషన్ల’ అక్రమాలపై ప్రభుత్వం ఉక్కుపాదం

- బోగస్ పత్రాలతో దగా చేస్తే ప్రాసిక్యూషన్
- 60 ‘అక్రమ’ కేసులు నమోదు – విచారణ
- 10 కేసుల్లో అక్రమార్కులపై ప్రాసిక్యూషన్



రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ ప్రభుత్వశాఖల నుంచి ఏటా సమకూరుతున్న ఆదాయంలో కీలకపాత్ర వహిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖను మరింత పటిష్టం చేయడానికి పాలనా పరంగా ప్రభుత్వం అనేక వినూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వారికి మెరుగైన సేవలందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచైనా తమ ఆస్తుల క్రయ, విక్రయాలకు చెందిన రిజిస్ట్రేషన్లు జరుపుకునేందుకు వీలు కల్పిస్తూ ‘ఎనీవేర్ రిజిస్ట్రేషన్’ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టింది. ఒక పక్క ప్రజలకు మెరుగైన సేవలందిస్తూనే, మరోపక్క ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ మేరకు ఆస్తుల కొనుగోలు సందర్భంలో ప్రజలు అక్రమార్కుల నుంచి దగా పడకుండా 'రిజిస్ట్రేషన్ల' ప్రక్రియలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడానికి చర్యలు చేపట్టింది. స్థిరాస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కొందరు అక్రమార్కుల ప్రమేయంతో యథేచ్ఛగా జరుగుతున్న బోగస్ రిజిస్ట్రేషన్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది.

ఇందుకోసం బోగస్ ధ్రువీకరణ పత్రాలు, వాంగ్మూలాలతో నమ్మబలికి, ఆస్తి కొనుగోలు దారులను తెలివిగా, ఉద్దేశపూర్వకంగా మోసం చేసేవారిపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని 82, 83వ సెక్షన్ల ప్రకారం ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కొత్తగా నిర్ణయించింది.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో భూములు, ఇళ్లు, భవనాలు ఇతర స్థిరాస్తుల విక్రయం పేరుతో కొందరు అక్రమార్కులు ఒక మాఫియాలా తయారై నకిలీ లింకు డాక్యుమెంట్లు, టైటిల్, సేల్‌డీడ్ తదితర ధ్రువీకరణ పత్రాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించి, అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించి, కొనుగోలుదారులను నిండా ముంచేస్తున్నారు. ఒక ఆస్తిని ఇద్దరు ముగ్గురు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు తమ ఉమ్మడి ఆస్తిని (ఒకరికి తెలియకుండా ఇంకొకరు) చెరొకరికి విక్రయిస్తూ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆ ఆస్తిలో ఆ అన్నదమ్ములంతా వాటాదారులు (హక్కుదారులు) అయినప్పటికీ ఒకే ఆస్తిని ఎవరికి తోచిన విధంగా వారు వేర్వేరు వ్యక్తులకి అమ్మి, పలు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఎంతో నమ్మకంతో కొనుగోలు చేసిన వారంతా కొనుగోలు చేసుకున్న తమ తమ ఆస్తులను స్వాధీనం చేసుకోడానికి క్షేత్రస్థాయికి వెళ్లాక... జరిగిన మోసాన్ని (కొనుగోలు చేసిన ఆస్తి విక్రయదారునిది కాదని) తెలుసుకుని లబోదిబో మంటున్నారు. మరికొందరైతే తాము కొనుగోలు చేసిన ఆస్తులపై బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోడానికి ప్రయత్నించిన సందర్భంలో బోగస్ ఆస్తి రిజిస్ట్రేషన్ బాగోతం బట్టబయలవుతోంది.

విక్రయిస్తున్న ఆస్తి తనది కానప్పటికీ, అది తనదేనన్నట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, కొనుగోలు దారులకు టోపీ పెడుతున్నారు. అక్కడితో ఆగకుండా ఆస్తి యజమానులు లేదా హక్కుదారుల పేర్లతో వేరే వ్యక్తులు... తమ ఫోటోలను పెట్టి రిజిస్ట్రేషన్ అధికారులను కూడ బురిడీ కొట్టిస్తున్నారు. అలాంటి సందర్భంలో నిజమైన ఆస్తి యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వెబ్ కెమేరా విధానం ఉన్నప్పటికీ నకిలీ వ్యక్తులు ఫోటోలు దిగుతూ... తప్పుడు మ్యాప్‌లు, ప్లాన్‌లను సమర్పిస్తూ అటు అధికారులు, ఇటు కొనుగోలు దారులను దగా చేస్తున్నారు.

ఈ విధంగా దగాపడిన కొనుగోలుదారులు చేతులు కాల్చుకుని గగ్గోలు పెడుతూ న్యాయస్థానాల చుట్టూ ఏళ్లతరబడి ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. ఈ కేసులన్నీ సివిల్ వివాదం కావడంతో ఇవి పరిష్కారం అయ్యేసరికి ఆయా ఆస్తులు ఇతరత్రా చేతులు మారుతున్నాయి.

ఇదిలావుంటే, ఒకపక్క తమ జీవితాంతం కష్టపడి కూడబెట్టుకున్న లక్షలాది రూపాయల డబ్బు కోల్పోయి, మరోపక్క రిజిస్ట్రేషన్ అయిన ఆస్తి స్వాధీనం కాక అనేక చిక్కులతో తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్న కొనుగోలుదారులకు అండగా వుండి వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

ఇలాంటి అక్రమాలను పూర్తిగా నియంత్రించేందుకు పొరుగు రాష్ట్రాలు ఏ విధానాలు అనుసరిస్తున్నాయో తెలుసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో రాష్ట్ర అధికారులు తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలు పర్యటించి, అక్కడ అమలయ్యే ఆస్తి రిజిస్ట్రేషన్ల విధానాలను అధ్యయనం చేశారు. తమిళనాడులో కట్టుదిట్టంగా అమలవుతున్న కొన్ని విధానాలను మన ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకోవాలని నిర్ణయించింది. తమిళనాడులో బోగస్ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగినట్టు రుజువైతే దాన్ని రద్దు చేయాలని కూడా నిర్ణయించింది. అయితే దీనిపై కొందరు అక్కడ హైకోర్టును ఆశ్రయించి 'స్టే' ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ కారణంగా కోర్టు తుది తీర్పు వెలువడే వరకు రిజిస్ట్రేషన్లను రద్దు చేసే విషయంలో వేచి చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'తప్పుడు' రిజిస్ట్రేషన్లపై 60 కేసులు

ఆస్తి తమది కాకపోయినా తమదేనంటూ నకిలీ పత్రాలు సృష్టించడం, ఒకే ఆస్తిని ఇద్దరు ముగ్గురికి విక్రయించడం, నకిలీ లింకు డాక్యుమెంట్లు సమర్పించడం, తప్పుడు మ్యాప్‌లు, ప్లానులు సమర్పించడం వంటి అక్రమాలతో ఆస్తి రిజిస్ట్రేషన్లు చేయించిన దగాకోరులపై ఇప్పటివరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 60 ఫిర్యాదులు అధికారులకు అందాయి. వీటిపై సెక్షన్ 82 ప్రకారం ఆయా జిల్లా రిజిస్ట్రార్లు విచారణకు స్వీకరించారు. వీటిలో పది ఫిర్యాదులపై విచారణ దాదాపు పూర్తయింది.

ఈ కేసుల్లో అక్రమార్కులను సెక్షన్ 83 ప్రకారం ప్రాసిక్యూషన్ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. వీటిలో అనంతపురం జిల్లాలో 5, విశాఖపట్నంలో ఒకటి, గుంటూరులో 2, ఇతర ప్రాంతాలలో రెండు కేసులు ఉన్నాయి.

1908 రిజిస్ట్రేషన్ల చట్టం నియమనిబంధనలకు లోబడి 26 (కె) సెక్షన్ ప్రకారం తమ ఆస్తిని కొందరు నకిలీ పత్రాలతో విక్రయించారంటూ నిజమైన ఆస్తి యజమానులు స్వయంగా తమ ఒరిజినల్ టైటిల్, సంబంధిత డాక్యుమెంట్లతో సహా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయమని కోరే అవకాశం ఉంది. దీని ప్రకారం నిజమైన ఆస్తి యజమానులు సమర్పించిన పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్టు ఆ రిజిస్ట్రార్ నమ్మగలిగితే, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అవకాశం ఉన్నది.

'ఆధార్'తో అనుసంధానం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియతో 'ఆధార్' కార్డు సమాచారాన్ని త్వరలో అనుసంధానం చేయడానికి చర్యలు తీసుకోబోతున్నామని ఏపి స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ గొల్ల సుబ్బారాయుడు వెల్లడించారు. ఇందుకోసం ఒప్పందం జరిగిందన్నారు. ఆధార్ కార్డు సమాచారాన్ని అనుసంధానం చేయడంవల్ల నకిలీ ఫోటోలు, సమాచారాన్ని తారుమారు చేయడానికి వీలుపడదన్నారు. తప్పుడు వాంగ్మూలాలు ఇవ్వడానికి అవకాశం ఉండదన్నారు. తప్పుడు ఫోటోలు, పత్రాలతో అధికారులను, కొనుగోలుదారులను దగా చేసినట్టు రుజువైతే, అలాంటి అక్రమార్కులను ప్రాసిక్యూట్ చేయడానికి వెనుకాడబోమన్నారు. ఆస్తులను కొనుగోలు చేయడానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే ముందు కొనుగోలుదారులు చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని, తమ శాఖ వెబ్‌సైట్‌లో ఆయా ఆస్తుల వివరాలన్నీ స్వయంగా పరిశీలించుకోవచ్చని అమ్మకందారుడు ఇచ్చిన సమాచారంతో తమ శాఖ వెబ్‌సైట్ సమాచారం ధ్రువపడితే తప్ప, ఆ ఆస్తులు కొనుగోలు చేయడానికి తొందరపడొద్దని సుబ్బారాయుడు కొనుగోలు దారులను కోరారు.

❖

> తమ ఆస్తిని కొందరు నకిలీ పత్రాలతో విక్రయించారంటూ నిజమైన ఆస్తి యజమానులు స్వయంగా తమ ఒరిజినల్ టైటిల్, సంబంధిత డాక్యుమెంట్లతో సహా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించే అవకాశం ఉంది.

'రిజిస్ట్రేషన్ల' రాబడిలో 38.28 శాతం వృద్ధి

- రూ. 1829.12 కోట్లకు చేరిన అర్ధవార్షిక రాబడి
- వృద్ధిరేటు పెరుగుదలలో విజయనగరం, శ్రీకాకుళం,అనంత ముందంజ

నవ్యాంధ్రప్రదేశ్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ద్వారా 13 జిల్లాల ద్వారా ప్రభుత్వానికి ఈ అర్ధవార్షిక మాసానికి రూ. 1829.12 కోట్ల రాబడి సమకూరింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ. 3500 కోట్ల మేరకు రాబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, గత ఏప్రిల్ నుంచి నేటి వరకు ఈ ఆర్నెల్ల కాలంలో 38.28శాతం వృద్ధిని సాధించగలిగారు. ప్రభుత్వానికి సమకూరే ఈ రాబడిలో వెనుకబడిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకోగా, అనంతపురం తృతీయ స్థానంలో ఉన్నది. కాగా కృష్ణా జిల్లా రాబడి వృద్ధిలో 4.70 మైనస్‌లో ఉన్నది. జిల్లాల వారీగా ప్రభుత్వ లక్ష్యాలు, రాబడుల్లో సాధించిన పురోగతి వివరాలను పక్కన పట్టికలో చూడవచ్చు.

లక్ష్యాలను అధిగమిస్తాం - జయరామిరెడ్డి

2015-16 ఆర్థిక సంవత్సరంలో తమ ప్రభుత్వం నిర్దేశించిన రాబడుల లక్ష్యాన్ని వచ్చే మార్చి నెలాఖరు నాటికి తప్పకుండా అధిగమిస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అదనపు ఐజి కె జయరామిరెడ్డి వెల్లడించారు. రాబడుల లక్ష్యాలను సాధించేందుకు తమ శాఖ అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నామని, ఆడిట్, తనిఖీలు నిరంతరం చేపడుతున్నామన్నారు. 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' పేరుతో ఈ ఏడాది జూన్ 27నుంచి నూతన విధానాన్ని అమలు చేయడంవల్ల ఆస్తుల క్రయ, విక్రయాలు రాష్ట్రంలోని ఎక్కడ నుంచైనా జరుపుకోవచ్చన్నారు. ఈ విధానాన్ని వినియోగదారులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఈ నూతన విధానం మన దేశంలో తొలిసారిగా అమలు చేస్తున్న రాష్ట్రం ఏపి ప్రభుత్వమేనని జయరామిరెడ్డి చెప్పారు. 2009 నుంచి 2015 మార్చి వరకు తమ శాఖ ఆధ్వర్యంలో రాబడుల వృద్ధిలో సగటున 14.41శాతం పురోగతి ఉన్నట్లు తెలిపారు.

జిల్లా పేరు	రాబడి లక్ష్యం (రూ.కోట్లలో)	లక్ష్యసాధన (రూ.కోట్లలో)	వృద్ధి రేటు (శాతంలో)
శ్రీకాకుళం	56.00	45.38	97.22
విజయనగరం	123.00	93.58	122.39
విశాఖపట్నం	523.00	284,23	43.74
తూర్పుగోదావరి	441.00	221.34	54.74
పశ్చిమగోదావరి	303.00	156.85	50.33
కృష్ణా	619.00	252.87	-4.70
గుంటూరు	562.00	251.58	22.36
ప్రకాశం	151.00	78.60	36.67
నెల్లూరు	167.00	91.13	45.02
చిత్తూరు	190.00	101.60	37.17
కడప	89.00	51.73	44.86
అనంతపురం	146.00	84.60	60.41
కర్నూలు	130.00	95.96	85.11

ప్రతిభకు పెద్దపీట

నవంబర్ 14న 6,550 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

విద్యార్థులు భవిష్యత్తులో తమ లక్ష్యాలను సాధించడానికి తోడ్పడేలా, వారిలో స్ఫూర్తి నింపేలా ఈ ఏడాది ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున జరిగే ఈ కార్యక్రమంలో మొత్తం 6,550 మంది ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అవార్డులు అందిస్తున్నామన్నారు. ఇందులో పాఠశాల విద్యకు సంబంధించి 4,026 మందికి, ఇంటర్ విద్యలో 574 మందికి, కళాశాల విద్యలో 325 మందికి, సాంకేతిక విద్య లో 425, యూనివర్శిటీ స్థాయిలో 1200 మందికి అవార్డులు ఇస్తామని తెలిపారు. అవార్డు పొందిన ప్రతి ఒక్కరికి మెడల్, సర్టిఫికేట్, 20 వేల రూపాయల నగదు బహుమతి అందిస్తామన్నారు. ఇందుకోసం నగదు ప్రోత్సాహకం రూపంలో 13 కోట్లు, మొత్తం 15 కోట్లకుపైగా ఖర్చువుతోందని, అయినా ప్రభుత్వం వెనుకంజ వేయట్లేదని తెలిపారు. విద్యార్థుల సమాగ్రాభివృద్ధి కోసం, వారిని వెన్నుతట్టు ప్రోత్సహించేలా, రాష్ట్రంలోని విద్యార్థులందరికీ స్ఫూర్తి నిచ్చేందుకే ఇంత ఖర్చు పెడుతున్నామన్నారు. దేశంలోనే ఇలాంటి కార్యక్రమం ఎక్కడా నిర్వహించడంలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే ఇలాంటి వినూత్న కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వారు ఎంచుకొన్న రంగంలో రాణించేందుకు ప్రతిభా పురస్కారాలు చాలా దోహదం చేస్తాయని తెలిపారు.

ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయని, సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. గత సంవత్సరం తిరుపతిలో జరిగిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం కంటే ఈ సారి ఇంకా ఘనంగా నిర్వహిస్తామన్నారు. గతంలో 4,500 మందికి పురస్కారాలను అందజేస్తే, ఈ సారి 6,500 అందజేస్తున్నామని, దీన్ని బట్టే ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి ఎంత కట్టుబడి ఉందో అర్థమవుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని, నిధుల విషయంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని అన్నారు. రాష్ట్రాన్ని విద్యారంగంలో లీడింగ్ స్టేట్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

❖

హార్డ్‌వేర్ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ - చంద్రబాబు

ఆంధ్రాలో తయారుకానున్న జియోనీ, వన్‌ప్లస్ మొబైళ్లు



దేశీయ సెల్ ఫోన్ జియోనీ ఎఫ్ 103 ను విశాఖపట్నం గేట్‌వే

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నిరంతర కృషి ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ చాలా తక్కువ సమయంలోనే హార్డ్‌వేర్ కేంద్రంగా తయారవుతోంది. ఇప్పటికే ఎలక్ట్రానిక్ దిగ్గజంగా పేరొందిన చైనా కంపెనీ షౌమి చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో తమ బ్రాండ్ ఫోన్ల తయారీకి శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత దేశీయ సెల్‌ఫోన్ కంపెనీలు సెల్‌కాన్, కార్బన్, మైక్రోమాక్స్ కూడా శ్రీసిటీలో తమ తయారీ కేంద్రాలు నెలకొల్పాయి. ఇప్పుడు, చైనాకు చెందిన మరో ప్రపంచస్థాయి మొబైల్ తయారీ కంపెనీ జియోనీ కూడా మేక్ ఇన్ ఆంధ్రాకు సిద్ధమైంది. మరో ప్రముఖ స్టార్టప్ కంపెనీ వన్‌ప్లస్ కూడా ఏపికి వస్తున్నట్టు తెలిపింది. శ్రీసిటీలో ఇప్పటికే తన కార్యకలాపాలు మొదలుపెట్టిన కాంట్రాక్ట్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ వసతిలోనే ఈ ఫోన్లన్నీ తయారవుతున్నాయి.

జియోనీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేసిన తొలి దేశీయ సెల్ ఫోన్ జియోనీ ఎఫ్ 103 ను విశాఖపట్నం గేట్‌వే హోటల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్టోబరు 12న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ మేక్ ఇన్ ఇండియా పిలుపును పురస్కరించుకొని మేక్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను హార్డ్‌వేర్ తయారీ పరిశ్రమలకు గమ్యస్థానంగా మారుస్తామని, ఈ రంగానికి చెందిన పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

శ్రీసిటీలోనే జియోనీ సొంత ప్లాంటు

మొబైల్స్ తయారీ సంస్థ జియోనీ సొంత ప్లాంటు శ్రీసిటీలోనే ఏర్పాటవుతుంది. కొద్ది రోజుల్లో ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఫీచర్ ఫోన్లతో పాటు అన్ని స్మార్ట్‌ఫోన్లను ఈ ప్లాంటులో రూపొందించనున్నారు. జియోనీ మొబైల్స్ తయారీని శ్రీసిటీలోని ఫాక్స్‌కాన్ చేపట్టనుంది. భారత్‌లో జియోనీ అవసరాలను సొంత ప్లాంటు తీర్చనుంది. దేశీయంగా 2014లో కంపెనీ 40 లక్షల ఫోన్లను విక్రయించింది. 2015లో 60 లక్షల యూనిట్లను అమ్మాలని లక్ష్యంగా చేసుకుంది. ఇక చైనా వెలుపల భారత్‌ని తయారీ హబ్‌గా చేయాలన్నది జియోనీ లక్ష్యం. ఇక్కడి నుంచి ఆఫ్రికా, సార్క్ దేశాలకు ఫోన్లను ఎగుమతి చేస్తారు. విడిభాగాలను సరఫరా చేసే కంపెనీలను ఆ సంస్థ భారత్‌కు ఆహ్వానిస్తోంది. వచ్చే మూడేళ్ళలో తయారీకిగాను రూ.300 కోట్లకు పైగా జియోనీఇండియా వెచ్చించనుంది.

శ్రీసిటీలో వన్ ప్లస్ మొబైల్స్ తయారీ

మరో అంతర్జాతీయ స్థాయి మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ కూడా మన రాష్ట్రానికే తరలివస్తున్నట్టు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ల విక్రయంలో ఉన్న చైనా స్టార్టప్ కంపెనీ వన్‌ప్లస్... మేక్ ఇన్ ఇండియా ప్రణాళికను ప్రకటించింది. కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్ ప్లాంటులో వన్‌ప్లస్ చేతులు కలిపింది. శ్రీసిటిలోని ఫాక్స్‌కాన్ ప్లాంటులో వన్ ప్లస్ మోడళ్లు అసెంబుల్ కానున్నాయి. నెలకు 5 లక్షల యూనిట్లు తయారు చేస్తారు. డిమాండ్‌ను బట్టి ఈ సామర్థ్యాన్ని పెంచుతారు. ఈ ప్లాంటులో ప్రత్యక్షంగా 1,000 మందికి పైగా ఉపాధి లభించనుంది. తొలి బ్యాచ్ ఫోన్లు ఈ ఏడాది చివరికల్లా మార్కెట్లోకి రానున్నాయి. భారత్‌లో తయారీ ప్రారంభించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయమని వన్‌ప్లస్ ఫౌండర్ పీట్ లూ వెల్లడించారు. అతిపెద్ద మార్కెట్‌లో ఒకటైన భారత్‌లో కంపెనీ స్థానం మరింత పటిష్టం అవడంతో పాటు వృద్ధికి బాటలు పరుస్తుందని అన్నారు. భారత్‌లో అన్ని మోడళ్లు కలిపి 2015 లో 10 లక్షల యూనిట్లను విక్రయించాలన్నది సంస్థ లక్ష్యం. ఇదే జరిగితే కంపెనీకి ప్రపంచంలో టాప్-1 మార్కెట్‌గా భారత్ నిలవనుంది.

వేగంగా చేరేందుకు...

దేశీయంగా తయారీ చేపట్టడం వల్ల మోడళ్లను గతంలో కంటే త్వరితంగా కస్టమర్లకు చేర్చే అవకాశముందని వన్‌ప్లస్ ఇండియా జీఎం వికాస్ అగర్వాల్ తెలిపారు. "వన్‌ప్లస్-2 కోసం ప్రపంచవ్యాప్తంగా 50 లక్షలపైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా చేయలేకపోయాం. భారత్ ప్లాంటు రాకతో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. వ్యయాలు, మూలధన అవసరాల విషయంలో మరింత మెరుగ్గా కంపెనీని నిర్వహించేందుకు వీలవుతుంది"అని చెప్పారు. భారత్‌లో కంపెనీ ఇప్పటి వరకు 2.5 లక్షలకు పైగా వన్‌ప్లస్ మోడళ్ళు విక్రయించింది. మొదటి ఓపెన్‌సేల్‌లో అమెజాన్ ద్వారా 15,000 యూనిట్ల వన్‌ప్లస్-2 ఫోన్లను అమ్మింది.

❖

చరిత్ర ఎరుగని రైతు రుణమాఫీ



ఇప్పటి వరకూ రూ. 7,433 కోట్లు రుణ ఉపశమనం కింద ఇచ్చి రైతుల రుణం తీర్చుకున్న చంద్రబాబు ప్రభుత్వం, తాజాగా జనవరి నెలలో మరో 5 వేల కోట్ల రూపాయలు విడుదల సంకల్పిస్తోంది. రుణ ఉపశమనం వల్ల రాష్ట్రంలో ప్రతి గ్రామానికీ రూ 2 కోట్ల వరకూ లబ్ధి కలగడం విశేషం.

అన్నపూర్ణగా, ధాన్యాగారంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో దేశ చరిత్రలో ఎన్నడూ, ఎక్కడా జరగని విధంగా వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడింది. వ్యవసాయంపై విసుగు చెందిన రైతులు సాగు విరామం ప్రకటించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ సమయంలో వ్యవసాయాన్ని, రైతులను కాపాడుకోవాలంటే రైతులకు రుణ మాఫీ తప్ప మరో మార్గం లేదని గ్రహించిన చంద్రబాబునాయుడు, తన సుదీర్ఘ పాద యాత్రలో అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తన పాద యాత్రలో రైతుల స్థితిగతులు స్వయంగా పరిశీలించిన ఆయన, వారి కష్టాలు, ఆవేదనను అర్థం చేసుకొని, రైతులను రుణ విముక్తులను చేసి వెన్ను విరిచిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మారుస్తామంటూ హామీ ఇచ్చారు. అన్నమాట ప్రకారం అధికారంలోకి రాగానే అన్నదాతల రుణ విముక్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా, రైతు రుణ ఉపశమనానికి శ్రీకారం చుట్టారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్న రుణం మాఫీ చేయటం ప్రభుత్వానికి ఆర్థిక భారం కాదని, రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వడమేనని భావించి రైతు రుణమాఫీ బాధ్యతను తన భుజంపై ఎత్తుకున్నారాయన. గతంలో ఇంతటి ధైర్యం ఏ ప్రభుత్వం చెయ్యలేదు. ఇందుకు కారణం చిత్తశుద్ధి లేకపోవడం మాత్రమే కాదు. ఈ స్థాయిలో రుణ ఉపశమనం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మీద పెనుభారం అవుతుందని ప్రభుత్వం భయపడినట్లు పరిశీలకులు భావించారు.

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిస్థితి మరీ ఘోరం. అయినా, ముఖ్యమంత్రి వెనకడుగు

జిల్లాలు		ఖాతాల సంఖ్య	రైతుల సంఖ్య	మొత్తం (కోట్లలో)
1	శ్రీకాకుళం	277674	184108	387.03
2	విజయనగరం	208172	150844	308.58
3	విశాఖపట్నం	219155	164397	326.35
4	తూర్పు గోదావరి	441964	295334	605.09
5	పశ్చిమ గోదావరి	483483	313033	627.29
	ఖమ్మం జిల్లాలో కలిసిన మండలాలు	4872	3383	7.57
6	కృష్ణా	436945	276836	568.20
7	గుంటూరు	661693	394130	917.84
8	ప్రకాశం	448459	266741	588.06
9	నెల్లూరు	279681	179581	394.26
10	కర్నూల్	427131	314928	679.89
11	కడప	346860	219324	457.47
12	అనంతపురం	802351	521879	1054.87
13	చిత్తూరు	367117	230839	510.89
	మొత్తం	**5405557**	**3515357**	**7433.39**

తొలి విడత రుణ ఉపశమనంలో అనంతపురం జిల్లాకు 1054 కోట్ల రూపాయలు మాఫీ కాగా, గుంటూరు జిల్లాకు 917 కోట్లు, కర్నూలు జిల్లాకు 670 కోట్లు మాఫీ అయ్యాయి. ఖమ్మం జిల్లా నుంచి ఏపిలో కలిసిన 7 మండలాల్లో రైతులకు 7.57 కోట్ల రూపాయలు మాఫీ అయింది.

వేయలేదు. అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా, దాదాపు రూ. 24 వేల కోట్ల రుణమాఫీ భారాన్ని తన భుజాలపై వేసుకున్నారు చంద్రబాబు.

కోటయ్య కమిటీ రూ.లక్ష వరకే మాఫీ చేయాలని సిఫార్సు చేసినా, మానవతా దృక్పధంతో ఆలోచించి, రూ లక్షా 50 వేల వరకూ రుణ ఉపశమనం కలిగించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిది.

అన్ని వైపులా సహాయ నిరాకరణ

అటు కేంద్రం గానీ, ఇటు రిజర్వు బ్యాంకు గానీ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చేదోడువాదోడుగా నిలవలేదు. రుణ ఉపశమనం విషయంలో మద్దతు కోసం చంద్రబాబు నాయుడి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అయినా, ఆంధ్రప్రదేశ్‌లో రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేయలేమని ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్ చేతులెత్తేశారు. రుణమాఫీ, రీ షెడ్యూల్‌కు తాము వ్యతిరేకం అని కరాఖండీగా చెప్పారు. రాష్ట్రాల కోసం నిబంధనలు ఉల్లంఘిస్తే అన్ని రాష్ట్రాలు రుణమాఫీ, రీ షెడ్యూల్ చేయమని అడుగుతాయని, దాంతో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుందని రాజన్ తేల్చి చెప్పారు. ఆయా ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలంటూ రైతు రుణమాఫీ ఆశలపై రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ నీళ్ళు చల్లారు. దీని వల్ల బ్యాంకింగ్ రంగం కుదేలు అవుతుందని, ఇటువంటి హామీల వల్ల రుణాలు చెల్లించే సంస్కృతి దెబ్బ తింటుందని రిజర్వ్ బ్యాంక్ నిర్మొహమాటంగా చెప్పింది.

ఇన్ని రకాలుగా అవరోధాలు ఎదురైనా, ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సంకల్పించారు. రాష్ట్రం ఎదుర్కుంటున్న ఆర్థిక ఇబ్బందుల పేరు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చెయ్యలేదు.

గతంలో 23 జిల్లాలకు 10 వేల కోట్లే..

గతంలో జరిగిన రెండు రైతు రుణమాఫీల భారం కేంద్ర ప్రభుత్వం భరించింది. రాష్ట్ర ప్రభుత్వాలపై పడలేదు. ఇప్పుడు కేంద్రం, రిజర్వ్ బ్యాంక్ సహకరించకపోయినా ప్రతి రైతు కుటుంబానికి లక్షన్నర వరకు రుణమాఫీ ప్రకటించి తనను నమ్ముకున్న రైతుల రుణం తీర్చుకున్నారు సిఎం చంద్రబాబు.


మొట్ట మొదటిసారి ఎన్‌టి రామారావు నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా వున్నప్పుడు దేవీలాల్ ఉప ప్రధానిగా వున్నారు . అప్పుడు ఎన్‌టిఆర్ ఒత్తిడి మేరకు 1990లో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ.10 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తరువాత 2008లో యూపీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేసిన రైతు రుణమాఫీ రూ. 52,419 కోట్లు మాత్రమే. అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 23 జిల్లాలలో రైతులకు మాఫీ అయింది కేవలం రూ.10 వేల కోట్లు.

13 జిల్లాలకే 24 వేల కోట్లు

కానీ ఇప్పుడు 13 జిల్లాలకే రూ.24 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ అవుతున్నాయి. అంతేగాకుండా రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ వున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లక్ష వరకే రుణమాఫీ చేస్తే, రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి లక్షన్నర వరకు రుణమాఫీ చేసి రైతుల పట్ల తన ఉదారతను చాటుకున్నది.

రూ. 50 వేలు అంతకు లోపు వ్యవసాయ రుణాలను తీసుకున్న కుటుంబాలకు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించి ప్రభుత్వం రుణ

జనవరిలో మరో రూ.5 వేల కోట్లు రుణ మాఫీ



ఏపి ప్రభుత్వం జనవరి నెలలో రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ కింద మరో రూ.5 వేల కోట్ల రూపాయలు జమ చెయ్యటానికి సన్నాహాలు చేస్తోంది. రెండో విడత మొత్తాన్ని రైతులకు విడుదల చేయాల్సి ఉంది. దీనికి సుమారుగా రూ.3,900 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. పండ్ల తోటల రైతులకు వారి రుణంతో సంబంధం లేకుండా ఎకరానికి రూ.10,000 చొప్పున మాఫీ చేయాలని నిర్ణయించారు. ఐదెకరాలు సీలింగ్‌గా పెట్టారు. కొందరికి ఎక్కువ, మరి కొందరికి తక్కువ భూమి ఉండొచ్చు కాబట్టి సరాసరిన ఒకో రైతుకు 30 వేల వంతున చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వ వర్గాల అంచనా. పండ్ల తోటల రైతులు సూమారు 4 లక్షల మంది ఉన్నారని అంచనా. ఈ లెక్కన వీరికి రూ.1200 కోట్లు చెల్లించాల్సి వస్తుందని అంచనా వేశారు. వీరికి ఒకేసారి చెల్లింపులు పూర్తి చేయాలని అనుకొంటున్నారు. ప్రస్తుతం వీరి వివరాల నమోదు చురుగ్గా జరుగుతోంది. నవంబర్ నెలలో ఏదో ఒక సమయంలో వీరి చెల్లింపులు జరిగే అవకాశం ఉంది. ఇవి కాక చంద్రన్న రైతు యాత్రలో ప్రభుత్వానికి రుణ మాఫికి సంబంధించి రైతుల నుంచి 15 వేల దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం వీటి పరిశీలన జరుగుతోంది. అలాగే చనిపోయిన 20 వేల మంది రైతులకు సంబంధించిన మాఫి వ్యవహారం కూడా పరిష్కరించాల్సి ఉంది. ఈ 35 వేల మంది రైతులకు కలిపి సుమారుగా రూ.140 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. సెల్ఫ్ డిక్లరేషన్ కింద బంగారం రుణాల పొందిన వారికి మాఫి అర్హత లేదని ప్రభుత్వం గతంలోనే చెప్పేసింది. అవి పోను మిగిలిన దరఖాస్తులను మాఫీ వర్తింపచేయడం పై పరిశీలన చేస్తున్నారు. గతంలో మాఫీ పొందిన వారి పేర్లతో ఈ దరఖాస్తులు సరిపోల్చుతూ నిర్ణయం తీసుకుంటారు. గతంలో మాఫీ పొందిన రుణ ఖాతాలు 55 లక్షలు ఉన్నయి. మాఫీ కోసం మూడో విడత వచ్చిన దరఖాస్తుల్లో 4.77లక్షల మందికి మాఫీ వర్తింప చేసినట్లు ఆవర్గాలు వివరించాయి. ఆవిడతలో మొత్తం 5.11 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

విముక్తి కల్పించింది. రూ. 50 వేల లోపు రుణాలు తీసుకున్నవారికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వర్తింపజేయకుండా రుణమాఫీ చేయడం జరిగింది. రూ. 50 వేలకు మించి రుణాలు తీసుకున్న రైతులకు ముందుగా 20 శాతం రుణం రద్దు చేశారు. మిగిలిన 80 శాతం రుణాన్ని బాండ్ల రూపంలో చెల్లించాలని 10 శాతం వడ్డీతో 4 ఏళ్లలో చెల్లించాలని, హామీ ఇవ్వకపోయినా పండ్ల తోటల రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్రంలో మొత్తం 35.15 లక్షల రైతు కుటుంబాలు వున్నాయి. అందులో 13 జిల్లాలలో 54.06 లక్షల అకౌంట్లను రైతు ఖాతాలుగా బ్యాంకులు గుర్తించాయి. మొదటిదశలో రుణమాఫీ కింద రూ. 4,689 కోట్లు ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. రెండోదశ రుణమాఫీ కింద రూ. 2,744 కోట్లు, మూడోదశ రుణమాఫీ కింద రూ. 367 కోట్లు బ్యాంకుల్లో జమచేశారు. మూడు విడతల్లో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ మొత్తం ఇప్పటివరకు రూ. 7,433 కోట్లు.

వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రుణమాఫీ అయిన రైతు ఖాతాలు: 22.42 లక్షలు.

రూ. లక్షా 50 వేల రుణమాఫీకి అర్హత పొందిన రైతు కుటుంబాల సంఖ్య:4.17 లక్షలు.

రుణమాఫీ అయిన చిన్నకారు, మధ్యతరగతి రైతుల ఖాతాల సంఖ్య: 46.24 లక్షలు.

రుణమాఫీ అయిన ఎస్సీ, ఎస్టీ రైతుల ఖాతాలు: 4.80 లక్షలు.

ప్రభుత్వంపై పడిన ఆర్థికభారం వడ్డీతో సహ రూ. 24,000 కోట్లు.

రుణం తీసుకున్న రైతులకు సంబంధించి బ్యాంకుల తప్పులు, డేటా ఎంట్రీ లోపాలను సరి చెయ్యటానికి కూడా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు ఇచ్చేందుకు హైదరాబాద్ వరకూ రాకుండా, 13 జిల్లాలలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతుల సేకరణకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ 4.15 లక్షల ఫిర్యాదులు స్వీకరించి, అందులో 3.3 లక్షలు ఫిర్యాదులు పరిశీలించి, 2.5 లక్షల మందిని అర్హత వున్న రైతులుగా ప్రభుత్వం గుర్తించింది.

రెండున్నర లక్షల మంది కౌలు రైతుల రుణ విముక్తికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రుణ ఉపశమనం వల్ల రాష్ట్రంలో ప్రతి గ్రామానికీ రూ.2 కోట్ల వరకూ లబ్ధి కలగడం విశేషం.

వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించి రెండంకెల అభివృద్ధి సాధించేందుకు రైతు సాధికార సంస్థను ఏర్పాటు చెయ్యడంతో పాటు, రుణ విముక్తి ద్వారా రైతులలో నూతన శక్తిని పెంచి వారి ఇళ్ళల్లో వెలుగులు నింపి భవిష్యత్తుపై విశ్వాసం పెంచింది ప్రభుత్వం. ఒకవైపు రుణ మాఫీ పథకం, మరో వైపు పొలం పిలుస్తోంది, ప్రైమరీ సెక్టార్ మిషన్ ఏర్పాటు, ఫార్మర్ ఎంపవర్మెంట్ కమిషన్ ఏర్పాటు, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ, ఇక్రీశాట్‌తో ఒప్పందం, విపత్తు సాయం పెంపు వంటి అనేక చర్యలు తీసుకొని వ్యవసాయాభివృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోతోంది.

– నీరుకొండ ప్రసాద్

కేంద్ర హోంశాఖ మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

స్థానికతకు సహకరించండి


విభజన తేదీ నుంచి మూడేళ్లలోపు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ కు తరలివచ్చేవారికి, స్థానికత కల్పించాలని కోరుతూ, కేంద్ర హెూం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి లేఖ రాశారు. విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలివచ్చే ప్రజల ప్రయోజనాలను విద్యా, ఉపాధి రంగాలలో పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందని ఈ లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

రాజధానికి తరలివచ్చే ఉద్యోగులు,ఇతర వర్గాల వారి పిల్లలకు స్థానికత అంశంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాశారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందినవారికి విద్య, ఉపాధి రంగాలలో సమాన అవకాశాలు కల్పించేందుకు 32 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371ఆ,371ఇ లను రాజ్యాంగంలో చేర్చారు.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ ఆర్టికల్ 371డి ప్రకారం, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలవారికి సమాన అవకాశాలను కల్పించేందుకు, విద్యాపరంగా 'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్స్) ఆర్డర్ 1974' ను, ఉపాధి పరంగా 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ ఎంప్లాయిమెంట్) ఆర్డర్ 1975' ను జారీచేశారు.

దీని ప్రకారం సదరు విద్యార్థి క్వాలిఫికేషన్ ఎగ్జామినేషన్ నాటికి వరుసగా నాలుగేళ్లు ఏ ప్రాంతంలో చదువుకుంటే ఆ ప్రాంతానికి స్థానికునిగా నిర్ణయిస్తారు. మధ్యలో అవాంతరం వస్తే వరుసగా



NARA CHANDRABABU NAIDU

CHIEF MINISTER
ANDHRA PRADESH

HYDERABAD

D.O. Letter No.4136/SPF&MC/2015, Dt. 09- 10-2015

Dear Sri Rajnath Singh ji,

Sub: Issue of suitable amendments to the Presidential Orders - For considering the extension of benefit of local status to the children of Andhra Pradesh Govt., Employees and others who does not fulfil the criteria as laid down and become non locals in terms of existing definition of Presidential Order meant for both education and employment on shifting from common capital of Hyderabad to that of Amaravathi the new capital of A.P. – Reg.

Ref: 1) Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions) Order republished vide G.O.Ms.No.453, G.A.(SPF.B) Department, dt:3.7.1974.

2) Andhra Pradesh Public Employment (Organisation of Local Cadres & Regulation of Direct Recruitment) Order republished vide G.O.Ms.No.674, G.A.(SPF) Dept., dt:20.10.1975.

3) Act 6 of 2014, A.P. Reorganisation Act, dt: 1.3.2014.

&&&

It is to bring to your kind notice that the issue of providing equitable opportunities to different areas of Combined State in matters of education and employment, Article 371D and 371 E were inserted in the Constitution of India by 32nd Amendment. Accordingly, as per clause 1, Article 371D, Presidential Orders were issued vide The Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions) Order 1974 with regard to education and presidential Orders were issued vide Andhra Pradesh Public Employment (Organisation of Local Cadres and Regulation of Direct Recruitment) Order, 1975 with regard to employment, for providing equitable opportunities and facilities for the people belonging to different parts of the State in the matter of education, public employment and career prospects in public service.

Local candidate for the purpose of education was interpreted in para 4(1) and (2) of the Presidential Order in the Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions) Order, 1974 as "4.Local candidate: (1) A candidate for admission to any course of study shall be regarded as a local candidate in relation to a local area -

Contd. Page..2

నాలుగేళ్లు ఆ ప్రాంతంలో నివాసం ఉన్నట్లుగా చూపినా అక్కడ స్థానికత వర్తిస్తుంది.

అయితే విభజన తరువాత కొత్త రాజధానికి తరలివచ్చే ఉద్యోగులకు, ఇతర వర్గాలవారి పిల్లలకు స్థానికత పొందేందుకు ఈ నిబంధన ప్రతిబంధకం అయ్యింది. తమ పిల్లలు విద్యా, ఉపాధి అవకాశాలను కోల్పేయే ప్రమాదం ఉందని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర వర్గాలవారు ఆందోళన చెందుతున్నారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను ' ది ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (రెగ్యులేషన్ ఆఫ్ అడ్మిషన్స్) ఆర్డర్ 1974 లోని పేరా నెం.4లో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ ఎంప్లాయిమెంట్) ఆర్డర్ 1975'లోని పేరా నెం.7 లో ఈ క్రింది అంశాన్ని చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంశాఖ మంత్రికి రాసిన లేఖలో కోరారు.

> 'రాష్ట్ర విభజన దరిమిలా విభజన తేదీ నుంచి మూడేళ్లలోపు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చేవారికి, వారు నివసించేందుకు ఎంపిక చేసుకున్న ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానికతను కల్పిస్తారు.'

విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలివచ్చే ప్రజల ప్రయోజనాలను విద్యా, ఉపాధి రంగాలలో పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. కొత్త రాజధాని నగరానికి తరలివచ్చే ఉద్యోగులు, ఇతర వర్గాల పిల్లల స్థానికత అంశం కూడా ఇందులో ఉంది. ఈ నేపథ్యంలో వారు కోరుకున్న విధంగా స్థానికత పొందేందుకు ప్రెసిడెన్షియల్ ఆర్డర్ లో ఇచ్చిన ఆదేశాలకు సవరణ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.

❖

సిఏస్‌కి అరుదైన గౌరవం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుకి అరుదైన గౌరవం దక్కింది. ప్రభుత్వ ఉద్యోగి విభాగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇండో–యూరోపియన్ బిజినెస్ ఫోరం కృష్ణారావుని సత్కరించింది. ఆయన అక్టోబర్ 4 నుండి 6వ తేదీ వరకు యూకే పర్యటనకు వెళ్లారు. ఇండో–యూరోపియన్ బిజినెస్ ఫోరం వారు నిర్వహించిన 'మేక్ ఇన్ ఇండియా' సెమినార్లో కృష్ణారావు పాల్గొన్నారు.

సీనియర్, జూనియర్ వ్యాపార వేత్తలను, సామాజిక రంగంలో విశిష్ట సేవలందించిన వారిని, బ్యూరోక్రాట్స్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. అక్టోబర్ 5వ తేదీ లండన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో యూకేకి చెందిన ఎనర్జీ శాఖ జూనియర్ మంత్రి బరొనెస్ సందీప్ వర్మ, యూకే ప్రభుత్వంలో జూనియర్ మంత్రిగా ఉన్న వీరేంద్ర శర్మ, చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారావుకు బ్యూరోక్రాట్ కేటగిరి క్రింద సన్మానం జరిగింది.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'మేక్ ఇన్ ఇండియా' సెమినార్లో చర్చ జరిగిందని కృష్ణారావు తెలియజేశారు. ప్రముఖ క్రికెటర్ కపిల్ దేవ్, చార్టెర్డ్ అకౌంటెంట్ సునీల్ గుప్తా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

❖



సంపూర్ణ మహిళా సాధికారత

‘డ్వాక్రా’తో చంద్రన్న చేయూత!

ఆకాశంలో సగం... అవనిలో సగం.... జగానికే సర్వం... విజయానికి వాసం- మహిళ! ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొన్న అధినేత ఎవరైనా ఉన్నారంటే ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అనడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. మహిళ, ముఖ్యంగా గ్రామీణ మహిళాసాధికారత ద్వారా స్త్రీలు, సమాజం అభివృద్ధి చెందుతాయన్న దూరాలోచన ఆయనది. ఆ దూరదృష్టి ఫలితమే పలు పథకాల రూపకల్పన, ఆపై ఓ ఉద్యమంగా సాగుతున్న ఆ పథకాల అమలు. చంద్రబాబు హయాంలో ఆనాడు రూపుదిద్దుకొని, ఈనాడు సాధికారత దిశగా మరింత బలోపేతమైన డ్వాక్రా మహిళ!

ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా అక్టోబరు 15న అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న చేయూత మహిళా దినోత్సవ స్ఫూర్తికి నిలువుటద్దం.

రాష్ట్ర గ్రామీణ మహిళల అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న పథకాలకు రూపకల్పన చేసి అమలు చేయడానికి ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రంలోని గ్రామీణ మహిళల్లో సంపూర్ణ అక్షరాస్యత ఆవశ్యకతపై, పొదుపు ఉద్యమంపై విస్తృత ప్రచారం కల్పించి అందుకనుగుణంగా వారిని చైతన్యం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో గ్రామీణ పేద మహిళల ఆర్థిక పరిపుష్టికిగాను అనేక పథకాలు ప్రవేశపెట్టి సఫలీకృతులయ్యారు. స్వయం సహాయ సంఘాల (డ్వాక్రా సంఘాల) పేరిట ప్రతి పల్లె, ప్రతి కుటుంబం అభివృద్ధి సాధించేలా కృషి చేశారు. పేదరిక నిర్మూలన, ఆదాయ వృద్ధి పర్చుకోవడం, విద్య, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాల్లో గ్రామీణ మహిళల్లో సాంఘిక, ఆర్థిక సాధికారత కోసం కేంద్రీకృత విధానం అమలుకు ప్రాధాన్యం ఇచ్చారు. డ్వాక్రా సంఘ మహిళలు పొదుపు చేసుకున్న మొత్తానికి సమానంగా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేసే పథకాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్ల ఇవ్వడం ద్వారా విస్తృత ప్రాచుర్యం పొందిన ‘దీపం’ పథకం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి

రాష్ట్రంలోని 6,80,765 స్వయం సహాయ సంఘాలలోని 69,46,180 సభ్యులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు రూపకల్పన చేసి తోడ్పాటునందిస్తోంది. ఆర్థిక సంస్థల నుంచి ప్రతి ఏటా సేకరించిన ఐదారు వేల కోట్ల రూపాయల మొత్తాన్ని పొదుపు ఖాతాలకు అనుసంధానించి, ఈ నిధులతో డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలిచ్చి ఆ మహిళలు ఆదాయ వనరుల పెంచుకునేలా ఏర్పాటు చేసింది.

పథకాల రూపకర్తల దృష్టిని ఆకర్షించింది. సమాచార సాంకేతిక అభివృద్ధిని దేశంలోనే ప్రప్రథమంగా డ్వాక్రా సంఘాల మహిళలకు పరిచయం చేసి విప్లవాత్మక మార్పులకు నాందిపలికిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుంది.

గత పదేళ్ళ కాలంలో నిర్వీర్యమైన డ్వాక్రా సంఘాలను మళ్ళీ బలోపేతం చేయాలని 2014 జూన్‌లో అధికారంలోకి వచ్చిన తక్షణమే నిర్ణయం తీసుకోవడమే కాకుండా అందుకు అనుగుణంగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గ్రామం, మండల, జిల్లాస్థాయిల్లో డ్వాక్రా సంఘాల స్వావలంబన సాధించే రీతిలో మహిళల అక్షరాస్యత పెంపునకు, డిజిటల్ పరిజ్ఞానంలో మెళకువలు సాధించడానికి, సామర్థ్య నిర్మాణ కార్యక్రమం అమలుకు ప్రభుత్వం చొరవ చూపుతోంది.

నూతనంగా ప్రవేశపెట్టిన పథకాలివి

రాష్ట్రంలో 13 జిల్లాస్థాయి సమాఖ్యలు, 644 మండలస్థాయి సమాఖ్యలు, 16,139 గ్రామీణ స్థాయి సంస్థలు ఉన్నాయి. రాష్ట్రంలోని 6,80,765 స్వయం సహాయ సంఘాలలోని 69,46,180 సభ్యులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు రూపకల్పన చేసి తోడ్పాటునందిస్తోంది. ఆర్థిక సంస్థల నుంచి ప్రతి ఏటా సేకరించిన ఐదారు వేల కోట్ల రూపాయల మొత్తాన్ని పొదుపు ఖాతాలకు అనుసంధానించి, ఈ నిధులతో డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలిచ్చి ఆ మహిళలు ఆదాయ వనరుల పెంచుకునేలా ఏర్పాటు చేసింది. డ్వాక్రా మహిళలు చెల్లించాల్సిన వడ్డీని ప్రభుత్వమే కడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 లక్షల స్వయం సహాయ సంఘాల సభ్యులు వివిధ ఆదాయ ఉత్పాదన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. వీరిలో వ్యవసాయ ఆధారిత రంగంలో సుమారు 28.6 శాతం, పాడి పరిశ్రమపై 27.8 శాతం మంది ఉపాధిని పొందుతూ ఆయా కుటుంబాలను పేదరికపు స్థితి నుంచి బయట పడేయగలుగుతున్నారు. 10–15 శాతం మంది ఆహార పదార్థాలు, బేకరీ ఉత్పత్తులు, సంప్రదాయ పిండి వంటలు, ఫలహారాలు, పాల ఉత్పత్తులు వంటి తయారీ కార్యక్రమాల మూలంగా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. 3–5% మంది నేత, రెడీమేడ్ దుస్తుల తయారీ రంగంలో ఉపాధి పొందుతున్నారు. మొత్తం రుణంలో 2.8 శాతం డ్వాక్రా మహిళ కుటుంబంలోని పిల్లల విద్యకోసం వెచ్చిస్తున్నారు.

పెట్టుబడి నిధి

ఎన్నికల హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 6,80,765 మంది స్వయం సహాయ సంఘాలలోని ప్రతి మహిళకు రూ.10,000 చొప్పున పెట్టుబడి నిధిని సమకూర్చారు. ఇందులో మొదటి విడతగా, ప్రతి సభ్యురాలికి రూ. 3,000 చొప్పున రూ.1,954 కోట్ల రూపాయలు విడుదల చేసింది. అంతేకాకుండా, 2014–15 లో వినియోగించుకున్న రుణాల మీద వడ్డీ కింద మరో రూ.1,136 కోట్లను కూడా ప్రభుత్వమే భరించింది.

ఇది కాకుండా, డ్వాక్రా సభ్య కుటుంబాలకు వారి ఏడాది పొదుపునకు సమానమైన రూ.30,000 ను పెట్టుబడి కింద ప్రభుత్వం సమకూరుస్తోంది. దీనికింద, డ్వాక్రా సభ్యుల గుర్తింపు ప్రక్రియ కోసం పెట్టుబడి నిధి పథకాన్ని ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. ఫలితంగా గ్రామీణ డ్వాక్రా మహిళలకు పథకాల లబ్ధిని చేకూర్చడంలో పారదర్శకతను కల్పించారు.

డ్వాక్రా మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు, ఆదాయ కల్పన అవకాశాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ధాన్యం, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాల సేకరణ బాధ్యతను డ్వాక్రా మహిళా సంఘాలకు అప్పగించారు. ధాన్యం సేకరణలో క్వింటాలుకు రూ.20, మొక్కజొన్న అమ్మకాలపై 1 శాతం చొప్పున ఆయా కార్యకలాపాల్లో పాల్గొన్న డ్వాక్రా మహిళలకు ఆదాయం సమకూరుతోంది. 2014–15లో స్వయం సహాయ సంఘాల సమాఖ్యలకు ఆహార ధాన్యాల సేకరణ ద్వారా రూ.68 కోట్ల ఆదాయం చేకూరింది.

ఇసుక నిర్వహణ అప్పగింత

నూతన ఇసుక విధానం అమలు చేసి ఇసుక క్వారీల నిర్వహణ, అమ్మకాల బాధ్యతలను డ్వాక్రా సంఘాల మహిళలకు అప్పగించారు. ఇసుక తవ్వకాలు, విక్రయాలు డ్వాక్రా మహిళాసంఘాలకు అప్పగించడం ఒక విప్లవంగా ప్రభుత్వం భావిస్తోంది. ఇసుక మాఫియాను నిరోధించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోనున్నారు. అధికారుల క్వారీల పర్యవేక్షణ సందర్భంగా అవసరమైన పక్షంలో పోలీసు రక్షణ తీసుకోనున్నారు. ఒక సమర్థమైన సమాచార వ్యవస్థ సాయంలో ఇసుక క్వారీలలో అక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చని ప్రభుత్వ వర్గాలు చర్యలు స్పష్టం చేస్తున్నాయి. డ్వాక్రా మహిళలు చక్కగానే నిర్వహిస్తున్నా, అక్కడక్కడా మాఫియా ఆగడాలు ప్రభుత్వం దృష్టికి రావడంతో ఒక వ్యూహంతో ఆ ఆగడాలను నిరోధించడంపై దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 320 ఇసుక క్వారీల నిర్వహణ బాధ్యతను 5000 మంది డ్వాక్రా మహిళలకు కేటాయించారు. రోజూ వేతనంగా ప్రతి మహిళకు రూ.300–350 ఇస్తూ, మరోపక్క క్యూబిక్ మీటరు ఇసుక అమ్మకంపై రూ.5 చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారు. డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో 2014 అక్టోబరు నుంచి 2015 సెప్టెంబరు వరకూ 1.75 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక అమ్మకాలు సాగాయి.

డ్వాక్రా మహిళలకు మందుల షాపులు

రాష్ట్రంలో 'అన్న సంజీవని జెనరిక్ మెడికల్ స్టోర్స్' పేరిట నెలకొల్పిన 250 జనరిక్ మందుల దుకాణాల నిర్వహణ బాధ్యతను డ్వాక్రా మహిళలకు అప్పగించారు. వీటిల్లో అమ్మే మందుల ధరలు బహిరంగ మార్కెట్లో అమ్ముతున్న అవేరకం మందుల ధరలకంటే 30–40% తక్కువకు లభ్యమవుతున్నాయి.

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతంలోని కరవు, వెనుకబడిన జిల్లాల్లో గొర్రె పిల్లలు, ఆవుదూడల పెంపకం ద్వారా డ్వాక్రా మహిళల కుటుంబ ఆదాయాన్ని పెంచే విధంగా ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. సమాఖ్యల యాజమాన్యంలో సుస్థిర వ్యవసాయం (సీఎమ్ ఎస్ఎ) పథకం కింద చీడపీడల నిర్వహణ, పోషక నిర్వహణతోపాటు వ్యవసాయాధారిత ఉత్పత్తుల వాణిజ్య కార్యకలాపాలు డ్వాక్రా సంఘాల మహిళలు నిర్వహించేలా చూస్తున్నారు. ముఖ్యంగా ధాన్యం నిల్వ గోదాములు, ఎరువులు, క్రిమిసంహారక మందుల అమ్మక కేంద్రాలు నిర్వహణ బాధ్యతను సైతం డ్వాక్రా

మహిళలకే అప్పగించారు.

పాల శీతలీకరణలో భాగస్వామ్యం

చిత్తూరు జిల్లాలో 150 భారీ పాల శీతలీకరణ కేంద్రాలను గ్రామీణ డ్వాక్రా సంఘాల మహిళల నిర్వహణలో ప్రారంభించారు. గ్రామంలో పాలు కొని ప్రాసెస్ అనంతరం పాల కేంద్రాలకు ఇవ్వడం ద్వారా డ్వాక్రా సంఘాలకు లీటరుకు 85 పైసలు మిగులుతుంది. ఈ ఒక్క పాల సేకరణ, అమ్మకం ప్రారంభించిన తర్వాత జిల్లా డ్వాక్రా మహిళాసంఘాలకు మూడునాలుగేళ్ళలో రూ.8 కోట్లు ఆదాయం సమకూరింది. 45,000 మంది గ్రామీణ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థ 'శ్రీజ' నెలకొనడం చిత్తూరు జిల్లాకే ప్రత్యేకం. పాలు, పాలు ఆధారిత, చిరు ధాన్యాల ఉత్పత్తులు, ఓషధి, ఆరోగ్య పానీయాలు, కూరగాయలు, పళ్ళ సలాడ్లు మొదలైన పౌష్టికాహార ఉత్పత్తుల అమ్మకం కేంద్రాల నిర్వహణ కూడా డ్వాక్రా మహిళా సంఘాలతో ప్రభుత్వం నిర్వహింపజేస్తోంది. తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులకు ఈ ఆరోగ్య ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారు.

డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకం

మన్నికైన చేనేత వస్త్రాలు, హస్తకళావస్తువులు, ఆహార పదార్థాల అమ్మకాల కోసం రాష్ట్రంలో 82 ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లలో డ్వాక్రా బజార్లను నిర్వహిస్తూ ఆయా ఉత్పత్తిదార్లను ప్రోత్సహిస్తున్నారు.

దుస్తులు కుట్టడం, ఫ్యాషన్ డిజైనింగ్‌ల్లో గ్రామీణ ప్రాంత మహిళల నైపుణ్యాన్ని పెంచడానికి రాష్ట్ర వ్యాప్తంగా 87 కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఒక్కో కేంద్రంలో 20–25 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి శాసనసభా నియోజకవర్గంలోనూ ఒక్కో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన తర్వాత ఆయా మహిళలు సర్వశిక్ష అభియాన్ కింద పాఠశాల విద్యార్థుల యూనిఫాంలను కుట్టడం, ఇతర ప్రభుత్వ పథకాల సద్వినియోగం చేసుకుని కుట్టిన దుస్తులను బహిరంగ మార్కెట్ లో అమ్ముకునేలా ప్రభుత్వం సాయం అందిస్తోంది. సాంఘిక భద్రతలో భాగంగా ఎన్టీఆర్ భరోసా కింద ఇస్తున్న రూ.1000 పింఛనును అర్హులైన వృద్ధులు, వితంతులకు

> ప్రతి మహిళ నెలసరి ఆదాయం రాబోయే నాలుగేళ్లలో రూ.10 వేలకు పెరగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామస్థాయిలో డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చి బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా వారు వ్యవహరించేందుకు తోడ్పాటునందించే ప్రయత్నాలకు పదును పెడుతున్నారు.

లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి స్వయంగా పంపిణీ చేసేలా రాష్ట్ర వ్యాప్తంగా 28,78,110 మంది గ్రామీణ డ్వాక్రా మహిళలను వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్వాక్రా మహిళలకు సైతం బీమా తరహా పింఛను నిధిని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా ఏడాదిలో డ్వాక్రా మహిళలు చెల్లించిన రూ.365కు సమానంగా ప్రభుత్వం అంతే మొత్తాన్ని చెల్లిస్తుంది. రాష్ట్రంలో మొత్తం 2.9 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఈ పింఛను పథకంలో పాలుపంచుకుంటున్నారు. ఈ పథకంలో భాగస్వాములైన 60–65 ఏళ్ళ మధ్యవయస్కులైన గ్రామీణ మహిళలకు నెలకు రూ. 500 చొప్పున పింఛను అందిస్తారు.

మహిళా సాధికార యాత్రతో చైతన్యం

రాష్ట్రంలో మహిళల జీవనోపాధి మెరుగుపర్చడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రతి మహిళ నెలసరి ఆదాయం రాబోయే నాలుగేళ్లలో రూ.10 వేలకు పెరగాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామస్థాయిలో డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చి బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా వారు వ్యవహరించేందుకు తోడ్పాటునందించే ప్రయత్నాలకు పదును పెడుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల అంశంలో గ్రామ స్థాయిలో ఎస్ హెచ్ జీలు నిల్వకేంద్రాలను నిర్వహించి, గిరాకీ ఉన్నప్పుడు పట్టణాలకు సరఫరా చేసి రాబడి పెంచుకునేలా చూడనున్నారు. కాలక్రమేణా మహిళాసంఘాలే ప్రజా పంపిణీ వ్యవస్థకు కావలసిన ధాన్యాన్ని సరఫరా చేసేలా ప్రోత్సహించాలన్న భావన ప్రభుత్వంలో వ్యక్తం అవుతోంది. పారిశుద్ధ్యానికి దోహదపడడంతోపాటు, సహజ ఎరువుగా కూడా ఉపయోగపడే వర్మి కంపోస్టు వాడకాన్ని ప్రోత్సహించదలిచారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు సబ్సిడీని కొనసాగించాలని సీఎం సూచించారు. గ్రామాలలో వ్యవసాయ యంత్రపరికరాలను అద్దెకు తిప్పి మహిళా సంఘాల సభ్యులు రాబడి పొందేలా చూడాలని తలపెడుతున్నారు. వ్యవసాయ యంత్రపరికరాల తయారీదారులు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించు కోవాలని అధికారులకు ఆదేశాలందాయి. పర్యాటకం, ఆతిథ్య రంగాలలో మహిళలకు తర్ఫీదునిచ్చి వారు ఆ రంగంలో కీలక పాత్ర పోషించేలా చూడవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ధాన్యం, మొక్కజొన్న సేకరణ ద్వారానే కాకుండా టెక్స్ టైల్స్, గొర్రెల పెంపకం, క్యాంటీన్ల నిర్వహణ ద్వారా డ్వాక్రా మహిళల ఆదాయం పెంచేందుకు దృష్టి పెట్టారు. ప్రభుత్వం ఇటీవల పశుదాణా భద్రతా విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రూ.250 కోట్లతో కార్యాచరణకు ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా డ్వాక్రా మహిళలకు పంపిణీ చేసిన 1800 పిసి ట్యాబ్లెట్ల ద్వారా పశువులకు ఎంతెంత పశుగ్రాసం అవసరమవుతుందో అంచనా వేయనుండటం విశేషం. తద్వారా డ్వాక్రా మహిళలకు సహాయపడినట్లు వుంటుందని, క్షేత్రస్థాయిలో అవగాహన వస్తుందని, గ్రాసం ఉత్పత్తిని అవసరాలకు అనుగుణంగా పెంచుకొనే దిశలో ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ట్యాబ్‌ల ద్వారా పశుగణాల గణాంకాలను కూడా అంచనా వేయనున్నారు. గ్రామంలో ఉన్న మహిళా సంఘాల ద్వారా క్లస్టర్ స్థాయిలో నర్సరీలు నిర్వహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రీన్ కవర్ పెంచాలన్న ప్రయత్నాలకు సైతం పదును పెడుతున్నారు. "2019 నాటికి డ్వాక్రా మహిళల్లో నూరు శాతం అక్షరాస్యత సాధించాలి. ప్రతి ఇంటికి ఒక మహిళ ఈ–లిటరేట్ కావాలి. అక్షరాస్యత మరింతగా పెంపొందాలి, నైపుణ్యాలు పెంచుకుని మహిళలు వ్యాపారదక్షులు కావాలి. రాష్ట్రవ్యాప్తంగా 80లక్షల సభ్యత్వం, రూ.14 వేల కోట్లు కార్పస్ నిధులున్న స్వయం సహాయక బృందాలు రాష్ట్రానికున్న గొప్ప వేదిక. డ్వాక్రా సంఘాల మహిళలను ఒక్కో రంగంలో తర్ఫీదు నిచ్చి స్వావలంబనకు దోహద పడాలి", అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష నెరవేరే రోజు మరెంతో దూరంలో లేదు.

– సి ఎస్ రామలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు

పాలసముద్రంలో పారిశ్రామిక పరవళ్లు

'డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్స్ కాంప్లెక్స్'కు శంకుస్థాపన



నవ్యాంధ్రలో మరో ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థ పురుడు పోసుకుంది. నవరత్న ప్రభుత్వరంగ సంస్థ 'బెల్' (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) అనంతపురం జిల్లాలో నెలకొల్పుతున్న భారీ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 'డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్' పేరిట గోరంట్ల మండలం పాలసముద్రం దగ్గర సుమారు రూ.500 కోట్లతో దీన్ని చేపడుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారేకర్ ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి పునాదిరాయి వేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం. వెంకయ్యనాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, వాణిజ్య, పరిశ్రమల శాఖామంత్రి నిర్మలా సీతారామన్, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి వైఎస్ చౌదరి, ఇంకా పలువురు రాష్ట్ర మంత్రులు, అధికార, అనధికార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పాలసముద్రం ప్రాంతంలో 900 ఎకరాల భూమిని ఇప్పటికే బెల్ సంస్థకు కేటాయించింది. ఈ భారీ పరిశ్రమ ద్వారా రక్షణరంగం అవసరాలు తీరడంతో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కూడా జరుగుతుంది. ఆటో మొబైల్, రవాణారంగ పరిశ్రమలు కూడా రానున్నాయని అధికారులు చెబుతున్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సముదాయంలో క్షిపణులకు సంబంధించిన వివిధరకాల విభాగాలు ఉంటాయి. 'బెల్'కు ఇంతపెద్ద విస్తీర్ణంలో విభిన్న సదుపాయాలున్న భారీ సముదాయం ఇదే అవుతుంది.

రక్షణరంగం వాణిజ్య అవకాశాల కోసం ఆధునికీకరణ, ప్రత్యేక మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం పెడుతున్న పెట్టుబడుల్లో భాగంగా దీన్ని ఇక్కడ ఏర్పాటుచేస్తున్నట్లు బెల్ సీఎండీ ఎస్ కే శర్మ తెలిపారు. నైట్ విజన్ టెక్నాలజీ, మల్టీ ఫంక్షన్ రాడార్స్ తదితర అంశాల్లో బెల్ తన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయనుంది. అతివేగ, మధ్య తరహా, సుదూర లక్ష్యాలను ఛేదించే సరికొత్త క్షిపణి ప్రయోగాలను బెల్ తలపెట్టింది. దానికోసం పరిశోధన విభాగంలో మరింత పట్టు సాధించడంపై దృష్టి సారించింది. ఈ 'డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్' ఏర్పాటు అందులోభాగమే. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి పాలసముద్రం కేవలం 100 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు జాతీయరహదారికి ఆనుకుని వున్నందున ఇక్కడ ఈ కాంప్లెక్స్ ఏర్పాటుకు బెల్ ముందుకొచ్చింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగళూరులో ఇప్పటికే ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆరంభించింది.

ఈ కాంప్లెక్స్ ఏర్పాటుతో వందలమంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి దక్కనుంది. అనంతపురం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని తలపెట్టారు.

ఈ కొత్త సముదాయంలో న్యూ జనరేషన్ ఎస్ఎఎం సిస్టమ్స్, హైఎండ్ ఇమేజ్ ఇన్టెసిఫైర్ ట్యూబ్స్, థర్మల్ ఇమేజింగ్ డిటెక్టర్లు, ఇనెర్షియల్ నేవిగేషన్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ అమ్యూనిషన్ ఫ్యూజులు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్ మెంటు రాడార్లు, ఇంటలిజెంట్ ట్రాఫిక్ మేనేజిమెంట్ సిస్టమ్స్, సోలార్ పవర్ ప్లాంట్లను బెల్ ఏర్పాటుచేయనుంది. రాడార్లు–ఆయుధాల అనుసంధానం, క్షిపణి విడిభాగాల అమరిక, స్వీయ పరీక్షా పరికరాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాల అమరిక, క్షిపణి నిల్వలు, పరీక్షల నిర్వహణకు ప్రత్యేక గదులు, అగ్నిమాపక కేంద్రం, సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కేంద్ర పరిపాలన సముదాయాల నిర్వహణ భవంతులతో అలరారనుంది.

ఈ నిర్మాణం పూర్తయితే బెల్‌కు క్షిపణి వ్యవస్థకు సంబంధించిన వ్యాపారావకాశాలు మెరుగవుతాయి. సొంత ప్రాజెక్టుల తయారీ, అనుసంధానానికి వీలవుతుంది. రానున్న కాలానికి పెద్దఎత్తున అవసరమయ్యే క్షిపణి పరికరాలు, అనుబంధ ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ, పరిశోధనలకు ఈ కాంప్లెక్స్ నిర్మాణం బెల్‌కు ఎన్నోవిధాలుగా ఉపకరించనున్నది. వస్తు సామాగ్రి రవాణాకు వీలయ్యే ఆటోమేటెడ్ వాహనాలు, ఇండస్ట్రియల్ రోబోట్స్ వంటి ప్రపంచస్థాయి సదుపాయాలతో ఈ సముదాయాన్ని నిర్మించనున్నారు. రానున్న 3,4 సంవత్సరాలలో మొత్తం నిర్మాణాన్ని పూర్తిచేస్తారు. రక్షణ సంబంధిత అవసరాల కోసం ఎలక్ట్రానిక్ పరికరాలు, విడిభాగాల తయారీలో ప్రైవేట్ రంగంలోని మధ్య, చిన్నతరహా పెట్టుబడిదారులకు ఊతమిచ్చేలా భవిష్యత్తులో దీన్ని పర్యావరణ హితంగా వుండే మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్సుగా తీర్చిదిద్దనున్నారు.

❖

సమష్టికృషి ఫలితం 'స్వచ్ఛ సుందర చల్లపల్లి'



పరిశుభ్ర పరిసరాలతో జనావాసాలు జీవకళ ఉట్టిపడేలా మన సమాజాన్ని మనమే తీర్చిదిద్దుకోవాలన్నది స్వచ్ఛ భారత్ లక్ష్యం. దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఉందని దశాబ్దాల క్రితమే మహాత్మాగాంధీ ఉద్బోధించారు. పరిసరాల అపరిశుభ్రత, నీరు నిల్వ ఉండటంతో ఆ చుట్టు పక్కల నివాసితులకు అనారోగ్యం, ముఖ్యంగా జ్వరం, మలేరియా, డెంగ్యూ వంటివే కాకుండా అంటువ్యాధులు సోకటం మనం చూస్తూనే ఉన్నాం. పాలకుల దూరదృష్టితోపాటు వదాన్యుల వితరణ, అధికారుల అప్రమత్తత, చొరవ, పౌరుల భాగస్వామ్యం సమపాళ్ళలో మేళవిస్తే స్వచ్ఛ భారత్ జాగృత జన చేతనోద్యమంగా పురోగమిస్తుంది. ఆరోగ్య సౌభాగ్యవంతమైన సమాజానికి మేలుబాటలు పరుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ కారణంగా, ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛత, పరిశుభ్రత పట్ల చైతన్యం పెరిగింది. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు, స్థానికుల క్రియాశీలత కూడా ముఖ్యం. దీనికి తాజా ఉదాహరణ చల్లపల్లి గ్రామం.

తమ గ్రామాన్ని బాగుచేసుకోవడం తమ చేతుల్లోనే ఉందని కృష్ణాజిల్లాలోని చల్లపల్లి గ్రామ వాసులు నిరూపిస్తున్నారు. కొన్నాళ్ళ క్రితం వరకూ పరిశుభ్రత లోపించిన ఇళ్ళు, జంతు కళేబర వ్యర్థాలతో నిండిన రోడ్లు, అన్నిరకాల చెత్తలతో పూడిపోయిన మురుగు కాల్వలు, ఊరుమ్మడిగా పెరిగిపోతున్న పారిశుద్ధ్యంతోపాటు ఈగలు, దోమలు, దుర్గంధం, నానాటికి లోపిస్తున్న ప్రజల ఆరోగ్య స్పృహ, పర్యావరణానికి ముంచుకొస్తున్న పెనుముప్పు...వీటన్నిటితో చల్లపల్లి నివాసితులు ఉక్కిరిబిక్కిరై పోతుండేవారు. ఈ దుస్థితి నుంచి గ్రామ వాసులను చైతన్యపరిచి సుందర చల్లపల్లి వైపు దృష్టి సారించేలా స్థానిక ప్రముఖులు డాక్టర్ డీఆర్కె ప్రసాద్ పదినెలల క్రితం తలపెట్టిన స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్విఘ్నయజ్ఞంలా సాగిపోతోంది. ఆదిలో కాపలా కాయడం, కరపత్రాలతో, బహిరంగ సభలతో సాధ్యమైనంత మేరకు ప్రజల ఆలోచనలలో మార్పు కోసం ప్రయత్నిస్తూ వచ్చారాయన. ఎన్నో ఊహలు, ప్రణాళికలు విఫలమైనా పట్టు విడవక కొనసాగించిన ప్రయత్నాలు ఫలించాయి. సమాజ సేవకునిగా, పాముకాటు వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించిన డాక్టర్ ప్రసాద్ వినూత్న ఆలోచనలతో సమాజ హితాన్ని కోరి స్వచ్ఛ చల్లపల్లికి నడుం బిగించడాన్ని స్థానిక ప్రజలు స్వాగతించి ఆయన అడుగులో అడుగు వేస్తున్నారు. సుమారు 15 ఏళ్ళ నుంచి చల్లపల్లి వాసులుగంటున్న "పరిశుభ్ర - ఆరోగ్య చల్లపల్లి" స్వప్నం వైపు దూసుకెళుతున్నారు. తొలిదశలో పట్టుమని పది మంది కూడా లేకపోయినా స్వచ్ఛ చల్లపల్లికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మాత్రం వంద మందికిపైగా నిత్యం స్వచ్ఛ చల్లపల్లి సేవల్లో పాల్గొనడం ఆ గ్రామంలో వికసించిన అభ్యుదయం నేడు కనిపిస్తున్న పరిణామం. స్వచ్ఛ చల్లపల్లి సేవా యజ్ఞంలో ఎప్పటికప్పుడు వివిధ వర్గాల వ్యక్తుల చేరికతో సరికొత్త చైతన్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పద్మావతీ వైద్యశాల సిబ్బంది, ధ్యాన మండలి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు కూడా పాల్గొంటున్నారు. పారిశుద్ధ్యంతోపాటు గ్రామపంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో నాటిన మొక్కలు ఏపుగా ఎదిగి పచ్చదనంతో పరిసరాలు కళకళలాడుతున్నాయి. చల్లపల్లి స్వచ్ఛ గ్రామంగా రూపుదిద్దుకునే వరకూ సేవలను కొనసాగిస్తామంటున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యసాధకుల కార్యదీక్ష రాష్ట్రంలోని వేల గ్రామవాసులకు స్ఫూర్తిదాయకం కాగలరని ఆశించడంలో తప్పులేదు.

స్వచ్ఛచల్లపల్లికి నేపథ్యం

ఒకనాటి చల్లపల్లి గ్రామంలోని స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్ రహదారి ప్రాంతంలోనూ, బీసీ కాలనీలోనూ, ఎస్.ఆర్.వై.ఎస్.పి.కళాశాల ప్రక్కన 60 ఏళ్ళకు పైగా గంగులవారిపాలెం రోడ్డు బహిరంగ మలవిసర్జనకు మారుపేరుగా ఉండేది. ఇక్కడ నెలకొన్న బహిరంగ మలవిసర్జన దురాచారాన్ని నిలువరించాలన్న కార్యాచరణకు 2013 డిసెంబరులో చల్లపల్లి ప్రజలు పూనుకొన్నారు. అయితే, తొలిదశలో చల్లపల్లిలో స్వచ్ఛందంగా తలపెట్టిన పరిశుభ్ర చల్లపల్లి కార్యక్రమానికి సైతం తిట్లు, శాపనార్థాలు, వెటకారాలు ప్రతిఘటనలు ఎదురయ్యాయి. అదే సందర్భంలో మరికొందరు సేవాతత్పరుల నుంచి సహకారం, ప్రోత్సాహం లభించింది. లక్ష్యసాధనలో కార్యాచరణకు దిగిన 50 రోజులకే 95% ప్రజలు చెత్తవేయడం మాని వేయడంతో గంగులవారిపాలెం రోడ్డుపై పరిశుభ్రత, పచ్చదనం పెరిగి, ఆహ్లాదకరంగా మారింది. బహుశా ఈ చిన్న విజయమే "స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం" నాందికి ప్రేరణగా మారింది.

2014 స్వాతంత్ర్య దినోత్సవాన ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర పిలుపు చల్లపల్లి వాసుల ఊహలకు రెక్కలు తొడిగింది. ఎన్నాళ్ళుగానో ఎదురు

చూస్తున్న ఒక కొత్త వాతావరణాన్ని ప్రజలు స్వాగతించారు. ఉపశాసనసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రేరణ, ఎంపిపి లంకబాబు గ్రామస్తులతో చేయించిన స్వచ్ఛ ప్రతిజ్ఞలు మరింత బలాన్నిచ్చాయి. గత ఏడాది నవంబర్ ఆరంభంలో పెద్ద సంఖ్యలో ప్రజలు చీపుర్లు, పారలు, కొడవళ్ళు చేతపట్టారు. ఈ స్వచ్ఛ యజ్ఞంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, అధ్యాపకులు,ఉపాధ్యాయులు, ఎన్నారైలు, యువకులు, మహిళలు, పాత్రికేయులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రముఖులు, అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు పాల్గొనడం విశేషం.

తొలి అడుగు చిన్నదే

నవంబరు 12, 2014 ఉదయం 4.30 నుండి 6.30 వరకు కొందరు స్థానికులు బందరు రోడ్డును చీపుళ్ళతో శుభ్రం చేయడం ద్వారా స్వచ్ఛ చల్లపల్లికి శ్రీకారం చుట్టారు. 15 రోజులకే వీరు 20 మంది అయ్యారు. 50 రోజులకు ఈ సంఖ్య యాభైగా, తర్వాత వంద మందిగా పెరిగింది. ప్రస్తుతం స్వచ్ఛ సైనికులు సుమారు 150 మంది ఉన్నప్పటికీ రోజూ మాత్రం కనీసం 50 మందికిపైగా పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మంచు, చలి, వాన, ఎండ, ఉక్కపోత - ఏవీ ఇన్నాళ్ళుగా వీరిని ఆపలేకపోతున్నాయి. కేవలం చీపుర్లను చేతపట్టి రోడ్లు ఊడ్చటమొక్కటే కాకుండా, మురుగుకాల్వల్లో పూడికతీయటం, చెత్తకుండీల్లోని చెత్తను తీయడం, బహిరంగ మలవిసర్జన ప్రాంతాలను శుభ్రపరచడం, ముళ్ళ కంచెలను తొలగించడం, చెత్తను తగులబెట్టడం వంటి పనులను స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు నిరభ్యంతరంగా చేయడం సమాజం మెరుగు పట్ల వారి చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోంది. పండుగ రోజుల్లోనూ, ఆదివారాలు, సెలవు దినాల్లో సైతం స్వచ్ఛ సేవల్లో పాల్గొనడం ప్రశంసనీయం. ఇప్పుడు చల్లపల్లి వాసుల నిత్యజీవితంలో స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం భాగస్వామ్యమైపోయింది.

స్వచ్ఛ చల్లపల్లి నిర్దేశిత విధానాలివి

1. చల్లపల్లిలో నివసించే 18 - 20 వేల మంది కాకుండా, బయట నుండి వచ్చే పోయే 10-12 వేల మంది జనం నిర్లక్ష్యంగా పారవేసే చెత్తతో పాటు ఇళ్ళలో, కార్యాలయాల్లో, విద్యాలయాల్లో, షాపుల్లో, హూటల్స్‌లో, మాంసం దుకాణాల్లో, కిళ్ళీకొట్లలో పుట్టుకొచ్చే తడి, పొడి, చెత్తలను, చెత్త కేంద్రాని (డంపింగ్ యార్డు) కి సక్రమంగా పంపడం.

2. అన్ని రకాల చెత్తలు, భోజన వ్యర్థాలు, పాస్లిక్ సంచులు, వేయకుండా వీధుల్ని పరిశుభ్రంగా ఉంచడం, ఒక్క కాగితం ముక్కైనా సరే వీధిలో కాక చెత్త డబ్బాలో మాత్రమే వేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ కలుగ చేయడం.

3. రోడ్ల పక్కన, ఇళ్ళ, కార్యాలయ, విద్యాలయాల, ఆవరణల్లో మొక్కలు నాటి, పెంచేలా చూడడం.

4. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి, పొడి చెత్తను నిరాకరించు, తగ్గించు, మళ్ళీవాడు , పునరుత్పాదించు అనే దిశగా గ్రామస్తులను ప్రేరేపించడం.

స్వచ్ఛ ప్రస్థానంలో కొన్ని మైలు రాళ్ళు

పారిశుద్ధ్య కార్మికులకు, బట్టలు, పంచాయితీ ఇచ్చే దానికి అదనంగా గౌరవవేతనం, పనిముట్లు, ఉచిత వైద్యం అందించాలని నిర్ణయించారు. రెండువందల మందితో వినూత్నంగా వార్డులు, వీధులన్నిటా ముగ్గులతో అందంగా ముస్తాబు చేశారు. ఉప సభాపతి, స్థానిక ఎమ్ఎల్ఏ మండలి బుద్ధ ప్రసాద్, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, ఇతర ప్రముఖులతో స్వచ్ఛత కోసం పాదయాత్రలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించారు. చల్లపల్లిని ఎమ్ఎల్ఏ దత్తతకు స్వీకరించారు. 100 మంది స్వచ్ఛ కార్యకర్తలకు టార్చిలైట్లు, ప్రశంసా పత్రాలను అందించారు. ఆరోగ్యమంత్రి డా.కామినేని శ్రీనివాస్ సమక్షంలో 150 మంది కార్యకర్తలకు డా. గురవారెడ్డి అభినందన పత్రాలు అందించారు. రోడ్లు భవనాల మంత్రి సిద్ధా రాఘవరావు, ఉపశాసనసభాపతి మండలి, కలెక్టర్ అహ్మద్ బాబు, ఇతర ప్రముఖులు ఈ గ్రామాన్ని సందర్శించినపుడు ఇచ్చిన సందేశం ప్రజలను ఆకట్టుకొంది. స్వచ్ఛ ఉద్యమం వీడియో -ఫొటో ప్రదర్శన ఏర్పరిచి, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. డా. ఎ.వి.గురవారెడ్డి వితరణతో రూ.5.1 లక్షలతో అందించిన టాటా ఏస్ హైడ్రాలిక్ ఆటోను కలెక్టర్ ప్రారంభించారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లికి గుర్తింపు

డాక్టర్ ప్రసాద్ నేతృత్వంలో సాగిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చింది. చల్లపల్లి వాసుల స్వచ్ఛ ఉద్యమ ప్రేరణతో కొన్ని పొరుగు గ్రామాల ముఖ్యుల అభ్యర్థనపై కృష్ణా జిల్లాల్లోని యార్లగడ్డ, వక్కలగడ్డ, గంగులవారిపాలెం, నూకలవారిపాలెం, కూచిపూడి వంటి గ్రామాల్లో కూడా 50 మంది స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు స్వచ్ఛ ఉద్యమం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్ లో 'క్లీన్ ఇండియా సంస్థ' చల్లపల్లి జన విజ్ఞాన వేదిక, పంచాయితీలకు సంయుక్తంగా 'చాంఫియన్ ఆఫ్ స్వచ్ఛ భారత్' అవార్డు ప్రకటించింది. అక్కినేని అమల నుండి చల్లపల్లి జె.వి.వి గ్రీన్ లీఫ్ ఇండియా బహుమతి అందుకుంది.

గ్రామంలోని పాఠశాల, కళాశాలల విద్యార్థులతో, స్వచ్ఛత, శుభ్రత, పర్యావరణ, ఆరోగ్యరక్షణలపై చర్చలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని 8 వార్డుల్లో ఇంటింటికి వెళ్ళి 'స్వచ్ఛ చల్లపల్లి' పై చర్చించి, ప్రేరణ కల్గిస్తున్నారు. అన్ని రకాల ప్లాస్టిక్ సంచుల స్వచ్ఛంధ నిషేధంలో కొంత పురోగతి సాధించారు. ఫేస్‌బుక్‌లో, శుభ్ర చల్లపల్లి వీధుల్ని చూసిన ప్రవాసాంధ్రుల్లో వాటిని ప్రత్యక్షంగా చూడాలనే తహతహ పెరిగింది. గ్రామ సర్వతోముఖాభివృద్ధిలో తామూ భాగస్వాములు కావాలనే గట్టి కోరిక కలగడం ఆహ్వానించదగ్గ పరిణామం.



– జాస్తి గోపాల ప్రసాద్

రాష్ట్రంలో మొట్టమొదటి సౌరశక్తి ఆధారిత త్రాగునీటి పథకం ప్రారంభం



ప్రతి గ్రామానికి త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. మారుమూల గ్రామాల్లో తరచుగా విద్యుత్తు అంతరాయం కలుగుతూ ఉండటం వల్ల, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని, సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. విద్యుత్తుతో సంబంధం లేకుండా సౌరశక్తితోనే 24 గంటలు త్రాగు నీటిని సరఫరా చేయడానికి వీలు కలుగుతుంది. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం, ఆంధ్రప్రదేశ్‌కు 851 సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకాలను రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అమలు చేయనున్నారు. రాష్ట్రంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలను దృష్టిలో వుంచుకొని, సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గంలోని వెలుగొండ మండలం సుద్దలపాలెం, నాతవరం మండలం మర్రిపాలెంలో సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలను రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అక్టోబర్ 2 న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో రూ.46 కోట్లతో 851 సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో 96 పథకాలను విశాఖపట్నం జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 33 సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలు మంజూరు చేశామన్నారు. ఏజెన్సీలో కొండలపై వున్న గ్రామాలకు కూడా సౌరశక్తి ఆధారంగా త్రాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఏజెన్సీ ప్రజలకు విద్యుత్తుతో సంబంధం లేకుండా 24 గంటలు త్రాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో వెలుగొండ మండలానికి 13, నాతవరం మండలానికి 10, మాకవరపాలెం మండలానికి 10 సౌరశక్తి ఆధారిత త్రాగు నీటి పథకాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఈ పథకంతో గ్రామాలలో వున్న త్రాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సౌరశక్తి ఆధారంగా త్రాగు నీటికి ఇబ్బంది లేకుండా, 24 గంటలు త్రాగునీరు అందుబాటులో ఉంటుందని అన్నారు.

– నత్తల రాజు(పిఆర్ఓ)

చక్కటి ప్రణాళిక, అంచనాలతో బాగా చేశారు

శంకుస్థాపన ఏర్పాట్లపై అధికారులకు సీఎం చంద్రబాబు ప్రశంస

అన్నిశాఖల అధికారులు చక్కని ప్రణాళికతో, అంచనాలతో బాగా పనిచేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు పి. నారాయణ,పత్తిపాటి పుల్లారావు,సిద్దా రాఘవరావు, వివిధశాఖల అధికారుల భేటీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆహ్వాన పత్రికల పంపిణీ, పాసులజారీ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బందోబస్తు, అలంకరణ, పార్కింగ్, పారిశుద్ధ్యం, ఆహార పంపిణీ, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఒకశాఖతో మరో శాఖ పోటీపడి పనిచేశాయంటూ ఈ స్ఫూర్తి ఇకపై కొనసాగించాలని ఆకాంక్షించారు. అందరినీ చాలా చక్కగా ఇన్వాల్వ్ చేశారని అభినందించారు.

రాజధాని నిర్మాణం ఒక యజ్ఞం అంటూ దీనిలో మొదటి అంకాన్ని పకడ్బందీగా చేయడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. దీనిపై ప్రజాభిప్రాయం సేకరించామంటూ వాటి వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమం 26% ప్రత్యక్షంగా తిలకించారని, 51% మంది టీవీ ఛానళ్లలో చూశారని, మొత్తం 77% మంది చూడటం రాజధాని నిర్మాణం పట్ల ప్రజల్లో ఉన్న ఆసక్తిని వెల్లడిస్తోందన్నారు. పోలీసుల పనితీరుపై 71%మంది సంతృప్తి వ్యక్తంచేయగా, 11%మంది అసంతృప్తి వ్యక్తంచేశారు, 18%మంది పర్వాలేదన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై 71% మంది బాగుందని, 12% మంది బాగాలేదని అన్నారు. సౌండ్ సిస్టమ్ పై 76% మంది బాగుందని అభిప్రాయపడ్డారంటూ వేదికపై ఉన్నవారికి సక్రమంగా వినబడలేదన్నారు. ఈసారి అటువంటి లోపం జరగకుండా చూడాలన్నారు. భోజనాలు,మంచినీటి సరఫరా మరింత పకడ్బందీగా జరిగివుంటేబాగుండేదన్నారు.

అందరూ వ్యక్తిగతంగా బాగా పనిచేశారంటూ శాఖాపరంగా సమన్వయం లోపించిందని అసంతృప్తి వ్యక్తంచేశారు. అంతర్గత సమన్వయం పెరగాలని, మిస్సింగ్ లింకులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆహారం పంపిణీ బాధ్యత ఒకరికే అప్పగించడంవల్ల ఇబ్బందులు వచ్చాయంటూ ఇకపై అలాంటివి పునరావృతం కాకూడదన్నారు. తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వద్ద వాహన యజమానులు ఇబ్బందులకు గురయ్యారంటూ ఈసారి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలే ముందుకువచ్చి కార్లు, బస్సులు, వాహనాలను సమకూర్చడం గొప్ప విషయంగా పేర్కొన్నారు.

❖

2018-19 నాటికి 10 వేల మెగావాట్ల సౌర, పవన విద్యుత్



రాష్ట్రాభివృద్ధికి విద్యుత్‌రంగం కీలకమైనది. అధికారం చేపట్టిన నాటి నుంచీ, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విద్యుత్ రంగం మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫలితంగా అప్పటికే వేధిస్తున్న 22.5 మిలియన్ యూనిట్ల లోటును వందరోజుల పాలనకాలంలోనే కొత్త ప్రభుత్వం అధిగమించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, పకడ్బందీ చర్యలు, అధికారుల కృషి ఫలితంగా మిగులు విద్యుత్ సాధించగలిగింది. ప్రస్తుతం అటు గృహ వినియోగదారులకు, ఇటు పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా అవుతోంది. ముందుచూపుతో వ్యవహరించడం, పంపిణీ, సరఫరాలో నష్టాలను గణనీయంగా తగ్గించడంతో పాటు, విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని ప్రత్యామ్నాయాల ద్వారా పెంచుకోడానికి రాష్ట్రం చేస్తున్న కృషికి ఇప్పటికే దేశవిదేశాల గుర్తింపు లభించింది.

ఆంధ్రప్రదేశ్ లో 2018-19 నాటికి పదివేల మెగావాట్ల సౌర, పవన విద్యుదుత్పత్తి సాధించాలని నవ్యాంధ్ర ప్రభుత్వ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన ఎస్ బీ సోలార్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ, స్పెయిన్‌కు చెందిన సుజలాన్ ఎనర్జీ, ఆక్సియానా ఎనర్జీ కంపెనీలు రూ.19 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

విజయవాడలో సోలార్‌విండ్‌డెవలపర్స్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయం తెలిపారు. ముఖ్యమంత్రి సమక్షంలో నెడ్ క్యాప్ ఎండీ కమలాకర బాబు, పలు విద్యుత్‌కంపెనీల ప్రతినిధులు ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఏపీలో నాణ్యమైన విద్యుత్‌సరఫరాపై దృష్టి పెట్టామని చంద్రబాబు వెల్లడించారు. పర్యావరణానికి హాని కలిగించని సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిని పెద్ద ఎత్తున ప్రోత్సహిసస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలోనే తొలి సౌర పవన హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పుతున్నట్టు చెప్పారు.

విద్యుత్ ఉత్పత్తికితోడు విద్యుత్ నష్టాలను తగ్గించే ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తోంది. ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో నష్టాలను, వాణిజ్యపరమైన నష్టాలను 10.4 శాతానికి తగ్గించగలిగారు. ఈ ఏడాది చివరి నాటికి వీటిని అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా 6 శాతానికి తగ్గించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోటీపడేందుకు చర్యల్లో భాగంగా ఈ రంగంలో భవిష్యత్తులో రూ.21 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. హైబ్రిడ్ విద్యుదుత్పత్తి వల్ల భూవినియోగం తగ్గి, రెట్టింపు ప్రయోజనాలు కలుగుతాయి. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను ప్రోత్సహించనున్నారు. ఇలా ఉత్పత్తయిన సౌర, పవన విద్యుత్తును గ్రిడ్ కు అనుసంధానించే ఏర్పాట్లు చేస్తున్నారు.

పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిలో నాణ్యత, పరిశోధన, ఆధునికీకరించడంపై ప్రత్యేక దృష్టి సారించడంతో వాటి ఉత్పత్తి వ్యయం నానాటికీ తగ్గుతోంది. సోలార్ విద్యుత్‌యూనిట్ ధర ఒకప్పుడు రూ.14 ఉండేది. ఇప్పుడు రూ.6 కు తగ్గింది. భవిష్యత్‌లో రూ.3,4 లకు తగ్గినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్నది రాష్ట్ర ప్రభుత్వ వర్గాల అభిప్రాయం. సౌర, పవన విద్యుత్ వ్యవస్థను ప్రోత్సహించడం వల్ల పర్యావరణానికి ఎంతోమేలు జరుగుతుందని చంద్రబాబు విశ్వసిస్తున్నారు. సౌర విద్యుదుత్పత్తితో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కేంద్ర ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి వర్ష జోషీ కూడా పేర్కొన్నారు. సోలార్ టెక్నీషియన్లుగా రాష్ట్రంలో తొలి విడత నాలుగు వేల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. అక్టోబరు 12 నుంచి శిక్షణ ప్రారంభమైన సూర్యమిత్రకు సంబంధించి గోడ పత్రికను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

ఇంధన విశ్వవిద్యాలయం

ఇంధన రంగంలో మరిన్ని పరిశోధనల కోసం నూతన రాజధాని అమరావతిలో ఇంధన (ఎనర్జీ) విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఈ విశ్వవిద్యాలయానికి సుజలాన్ ఎనర్జీ కంపెనీ నుంచి రూ.35 కోట్లు, రాష్ట్రప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్ కో, జెన్ కోలతోపాటు డిస్కంల నుంచి రూ.50 కోట్ల విరాళం లభించింది. ఈ మొత్తానికి సరిపోయేలా కేంద్రం కూడా మరో రూ.85 కోట్లు ఇచ్చేలా కృషి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వర్ష జోషీని కోరారు. ఫలితంగా రాష్ట్రంలో సోలార్ బ్యాటరీల విషయమై మరింత విస్తృత పరిశోధనలు సాగించనున్నారు.

సౌర విద్యుత్తుపై ఒప్పందాలివి

జపాన్‌కు చెందిన సాఫ్ట్ బ్యాంకు గ్రూపు కంపెనీలకు చెందిన ఎస్ బీ సోలార్ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ రూ.18 వేల కోట్ల పెట్టుబడితో రెండు వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు, వేయి మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదు- ర్చుకుంది.

స్పెయిన్ కు చెందిన ఆక్సియానా ఎనర్జియా రూ.1400 కోట్ల పెట్టుబడితో 200 మెగావాట్ల పవన విద్యుత్తు ప్రాజెక్టును కర్నూలులో నెలకొల్పేందుకు, రూ.150 కోట్లతో తయారీ (మానుఫ్యాక్చరింగ్) యూనిట్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది.

❖

వైద్యసేవల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి నమూనా కావాలి

- సీఎం చంద్రబాబు



విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రి

వైద్య,ఆరోగ్యసేవల్లో భారతదేశానికే ఒక నమూనాగా రాష్ట్రం ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. తన కార్యాలయంలో వైద్య,ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సందర్భంగా, ముఖ్యమంత్రి వైద్య, ఆరోగ్య వ్యవస్థ గురించి తన ఆలోచనలను, అభిప్రాయాలను వెల్లడించారు. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ డా. జితేంద్ర కుమార్ శర్మ, యునిసెఫ్ స్టేట్ కన్సల్టెంట్ డా. శ్రీకృష్ణ తదితరులు హాజరయ్యారు.

ఈ భేటిలో సీఎం మాట్లాడుతూ వైద్యానికి అయ్యే ఖర్చులో 40% పైగా మెడికల్ టెస్ట్‌లకే వ్యయం అవుతోందంటూ ఆ భారం తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్న రూ.480 కోట్ల విలువైన ఎక్విప్‌మెంట్ 100 శాతం రోగులకు ఉపయోగపడేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఒక వ్యక్తి అనాసక్తి, నిర్లక్ష్యం వల్ల లక్షలాది రోగులకు ఇబ్బందులు కలుగుకూడదంటూ ఆసుపత్రులకు నిధుల విడుదలలో అలసత్యం చేయవద్దని అధికారులకు సూచించారు.

మిషన్లు ఉండి ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడం, టెక్నీషియన్లు ఉన్న చోట ఎక్విప్‌మెంట్ పనిచేయకపోవడం వంటి పరిస్థితులు ఉండకూడదన్నారు. ప్రైవేటు వైద్యులు కూడా ప్రభుత్వ వైద్యశాలలకే వచ్చి ఇక్కడి పరికరాలు, వసతులను వినియోగించుకుని ఎన్టీఆర్ వైద్యసేవ కింద శస్త్ర చికిత్సలు చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రధాన కూడళ్ళలో విలువైన స్థలాలు, భవనాలు, వసతి మన వైద్యశాలల సొంతం అంటూ సేవలను మెరుగుపరిస్తే దేశంలోనే మంచి నమూనా రాష్ట్రంగా పేరు వస్తుందన్నారు.

రేడియాలజీలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తమిళనాడులో అల్ట్రా సోనాలజీ సెంటర్లు అందిస్తున్న సేవలపై అధ్యయనం చేయాలన్నారు. 13 జిల్లాల ఆసుపత్రులలో సీటీస్కాన్ పరీక్షలు అందుబాటులో ఉన్న రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనంటూ ప్రతి నియోజక వర్గ కేంద్రంలో సీటీస్కాన్ సేవలు అందుబాటులోకి రావాలన్నారు. హిమోగ్లోబిన్ పరీక్ష నుంచి సీటీస్కాన్ వరకు పేదలకు తక్కువ ధరలకే అందుబాటులో ఉండాలంటూ, అవసరమైతే టెక్నీషియన్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఇవ్వాలన్నారు. జనవరి 1 నుంచి అమలు చేసేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

రాష్ట్రంలో బాధ్యతాయుతమైన వైద్య సంరక్షణ ఉండాలనేది తన సంకల్పంగా పేర్కొన్నారు. సాధారణ వ్యాధులకు "హెల్త్‌కేర్ ఏటీఎంల" ద్వారా మందుల పంపిణీ, వెండింగ్ మిషన్‌కు అయ్యే వ్యయం తదితరాలపై చర్చించారు. ఇతర రాష్ట్రాలవలే ప్రస్తుతం మన రాష్ట్రంలో 100 హెల్త్ కేర్ ఏటీఎంలు పెడదామని, పనితీరును బట్టి వాటిని తర్వాత పెంచుకోవచ్చని తెలిపారు. క్లస్టర్ వారీగా వీటి వినియోగంపై అధ్యయనం చేయాలన్నారు.

ఇండియన్ మెడికల్ డివైస్ మాన్యుఫాక్చరర్స్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని, వైద్యపరికరాల తయారీ పరిశ్రమలు నెలకొల్పే వారికి ప్రభుత్వపరంగా అన్ని ప్రోత్సహకాలు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతి ఆసుపత్రికి గ్రేడింగ్ ఇవ్వాలి, అక్రిడేషన్ చేయాలని, బాగా పనిచేసిన వారిని ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రతి క్వార్టర్‌కు వారి పనితీరుపై ప్రజల్లో సంతృప్తిస్థాయి కాల్ సెంటర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. 108,104 సేవలు, టెలిమెడిసిన్ తదితర అంశాలపై చర్చించారు.

"కాయకల్ప" కింద దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో పారిశుద్ధ్యం మెరుగు పర్చడం, పరిశుభ్ర వాతావరణం నెలకొల్పడంపై యునిసెఫ్ స్టేట్ కన్సల్టెంట్లు డా.శ్రీకృష్ణ, సంజయ్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు, ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం అవుతామని నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ జితేంద్ర కుమార్ శర్మ తెలిపారు.

ఈ సమీక్షలో మంత్రులు డా.కామినేని శ్రీనివాస్, పీతల సుజాత, ఉన్నతాధికారులు పూనం మాలకొండయ్య, ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.

రూ. 240 కోట్ల పర్యాటక ఒప్పందాలు

ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా ఏపీ ఉండాలని సీయం చంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను 'పర్యాటక ప్రదేశ్'గా మార్చేందుకు జరుగుతున్న కృషిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుంది. అక్టోబరు 10న ముఖ్యమంత్రి కార్యాలయంలో రూ.1240 కోట్ల విలువైన వ్యాపార ఒప్పందాలు (ఎంవోయూ) జరిగాయి. మొత్తం 8 టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ఈ ఒప్పందాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, వివిధ సంస్థల ప్రతినిధులు పత్రాలను మార్చుకున్నారు.

విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలలో రూ.800 కోట్లతో అమ్యూజ్‌మెంటు, వాటర్ వరల్డ్ పార్కుల నిర్మాణానికి ఎల్ఈపీఎల్ వెంచర్స్, పాన్ ఇండియా పర్యాటన్ (ఎస్సెల్ వరల్డ్-ముంబై) ఎంవోయూలు చేసుకున్నారు. ఇవే నగరాలలో డెస్టినేషన్- ప్యాకేజ్ టూర్స్ కోసం ఎయిర్ కోస్టా కంపెనీతో ఒప్పందం జరిగింది. అలాగే, విజయవాడ, తిరుపతిలలో హోటళ్లు, రిసార్టుల కోసం ఫ్లూర్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు టూరిజం శాఖతో ఎంవోయూ చేసుకున్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 4 సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. విశాఖలోని రిషికొండ ప్రాంతంలో రూ. 50 కోట్ల వ్యయంతో బీచ్ రిసార్టు నిర్మించేందుకు సాయిప్రియ బీచ్ రిసార్ట్స్, విజయవాడ పటమట, ఇబ్రాయెల్ పేటలో రూ.300 కోట్లతో మూడు, ఐదు నక్షత్రాల హోటళ్ల నిర్మాణానికి వీఎస్ఎన్ ఎస్టేట్స్ ప్రైవెట్ లిమిటెడ్, కడపలో రూ. 5 కోట్ల రూపాయిల పెట్టుబడితో వే సైడ్ అమెనిటీస్ కోసం పోలి సునీత, తిరుపతి తిరుచానూరులో రూ.85 కోట్లతో గేట్ వే ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసం బ్లిస్ హోటల్ ప్రతినిధులు ముఖ్యమంత్రి నుంచి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్స్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సన్ రైజ్ స్టేట్‌గా నిలిపేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇప్పటివరకు రూ. 4500 కోట్ల పెట్టుబడులు సమకూరాయని టూరిజం ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంతోషం వ్యక్తంచేశారు.

❖

మంగళగిరిలో ఎయిమ్స్

ఆంధ్రప్రదేశ్ లో ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో రాష్ట్ర ప్రజల్లో ఆనందం వెల్లు విరుస్తోంది. నవ్యాంధ్ర రాజధాని సమీపంలో మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విభజనానంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఎయిమ్స్ తరహా సంస్థను ఏర్పాటు చేస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీని కేంద్రం నెరవేర్చింది. నూతన రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్న సమయంలో కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం శుభ పరిణామం. మహారాష్ట్రలో నాగపూర్, పశ్చిమ బెంగాల్‌లో కల్యాణి, ఆంధ్రప్రదేశ్‌లో మంగళగిరిలో ఎయిమ్స్ ఏర్పాటు చెయ్యాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధానమంత్రి స్వస్థ సురక్ష యోజన కింద రూ. 4,949 కోట్లతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో సంస్థలోను 960 పడకలతో కూడిన ఆస్పత్రి వుంటుంది. దీంతో పాటు బోధన భవనం, పరిపాలన భవనం, ఆయూష్ భవనం, ఆడిటోరియం, నర్సింగ్ కళాశాల, రాత్రి బస వసతి గృహం, నివాస సదు-పాయాలు ఉండనున్నాయి.

నాణ్యమైన వైద్య విద్య, నర్సింగ్ విద్యను అందించడానికి, స్థానిక ప్రజలకు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించడానికి జాతీయ ప్రాధాన్య సంస్థలుగా కొత్త ఎయిమ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్‌కు రూ. 1,618 కోట్లు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును 4 నుంచి 5 ఏళ్లలో పూర్తి చేయనున్నారు. అన్ని భవనాల నిర్మాణానికి రెండేళ్లు, మౌలిక సదుపాయాల కల్పన, తుది మెరుగులకు మరో ఏడాది పడుతుందని కేంద్రమంత్రి చెప్పారు. ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం ముందుకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. ఈ సంస్థ ఏర్పాటుకు మంగళగిరి అనువైన ప్రదేశం అని, ఇందుకోసం193 ఎకరాలను సిద్ధం చేసింది ఏపీ ప్రభుత్వం. ఎయిమ్స్ ఏర్పాటు కావడం వలన పేదలకు తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సదు-పాయాలు అందుబాటులోకి రానున్నాయి.

❖

జపాన్ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆసక్తి

ఏపి ప్రత్యేక ప్రతినిధి కంభంపాటి

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి పెట్టుబడి పెట్టేందుకు, రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు జపాన్ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కంభంపాటి రామ్మోహన్‌రావు చెప్పారు. ఆరు రోజుల పాటు జపాన్‌లో పర్యటించిన ఉన్నత స్థాయి బృందానికి నేతృత్వం వహించిన ఆయన ఢిల్లీలో విలేకరులతో తన అనుభవాలను వివరించారు. జపనీస్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోపరేషన్ (జెబిఐసి) అమరావతి ప్రాజెక్టులో ఈక్విటీ భాగస్వామిగా చేరేందుకు సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అంతేకాకుండా ఇందులో ఇతర జపాన్ పెట్టుబడిదారులు కూడా పెట్టుబడులు పెట్టేలా చూస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఎపికి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ఉన్న వనరులను సమగ్రంగా వివరించామని, జపాన్ సాంకేతికత సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు.

కాకినాడ-యెకహామా నగరాల మధ్య ఒప్పందం, కాకినాడ నౌకాశ్రయ అభివృద్ధి గురించి కూడా చర్చించామన్నారు. ఎపి-టొయోమా సోదర రాష్ట్రాలుగా పరస్పరం సహకరించుకునేందుకు కూడా ముసాయిదా ఒప్పందం సిద్ధం చేశామని, దీనిని ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించాల్సి ఉందన్నారు. మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయం తదితర 12 రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. డిసెంబరులో జపాన్ ప్రధాని భారత్ పర్యటనకు రానున్నారని ఆ సందర్భంగా భారీ స్థాయిలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి, ఎపి-టొయోమా సోదర రాష్ట్రాలుగా ఒప్పందాలు జరుగుతాయని వివరించారు. రాజధాని శంకుస్థాపన సందర్భంగా ప్రధాని మోదీ., ఏపికి ప్యాకేజీ ప్రకటించనున్నారని కంభంపాటి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి, విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, అయితే జపాన్ సహా పలు దేశాల పారిశ్రామిక వేత్తలు రాయితీల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఆ రాయితీలు కల్పించగలదని చెప్పారు. ప్రధాని తప్పకుండా ప్రకటన చేస్తారని, దాంతో జపాన్ సహా పలు దేశాల కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటవు తాయన్నారు.

❖

సీమకే వరం అనంతపురం



వీరభద్రాలయం, లేపాక్షి, అనంతపురం

నుగన్న నా తల్లి రాయలసీమ రతనాల సీమ/ తనువెల్ల తరుగని గనులున్న సీమ గిరులున్న సీమ– అంటూ రాయలసీమ ప్రాభవాన్ని చెప్పాడో కవి. అటువంటి రాయలసీమకే తలమానికం అనంతపురం. అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమ దిక్కున ఉండే పెద్ద జిల్లా.

జిల్లాకి కేంద్రం అనంతపురం నగరం

ఆంధ్రప్రదేశ్ లో పెద్ద జిల్లా మాత్రమే కాదు, వైశాల్యం దృష్ట్యా దేశంలోనే 7వ పెద్ద జిల్లా.

అనంతపురం జిల్లా 1882లో ఆవిర్భవించింది. అంతకు ముందు ఈ ప్రాంతం కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లాలో భాగంగా ఉండేది. జిల్లా విస్తీర్ణంలో భాగంగా కడప జిల్లాలోని కదిరి, ముదిగుబ్బ, నల్లమాడ, నంబులపూలకుంట, తలుపుల, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు, తనకల్లు, ఆమడగూరు మండలాలు 1910లో అనంతపురం జిల్లాలో కలిశాయి. తిరిగి 1956లో బళ్ళారి జిల్లాలో భాగంగా ఉన్న రాయదుర్గం, డి.హిరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మగట్ట ప్రాంతాలను అనంతపురం జిల్లాలో విలీనమై, జిల్లా విస్తీర్ణం 19,130 చ.కి.మీ.కు పెరిగింది.

జిల్లాను అనంతపురం, ధర్మవరం, పెనుకొండ మూడు రెవెన్యూ డివిజన్లుగా విభజించారు.

జిల్లాలో మొత్తం 63 మండలాలున్నాయి. అనంతపురం డివిజన్లో 20 మండలాలు, ధర్మవరం డివిజన్లో 17 మండలాలు, పెనుకొండ డివిజన్లో 26 మండలాలు ఉన్నాయి. 964 రెవెన్యూ గ్రామాలు, 1005 గ్రామపంచాయితీలు, ఏడు మున్సిపాలిటీలున్నాయి. అనంతపురం కార్పోరేషన్.

జిల్లాకు తూర్పున కడప జిల్లా, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రం, ఉత్తరాన కర్నూలు జిల్లా, దక్షిణాన చిత్తూరు జిల్లాలు ఎల్లలుగా ఉన్నాయి.

ముఖ్య నదులు

ఈ జిల్లాకు జీవనదులు లేవు. కాగా, పెన్నార్, జయమంగళ, చిత్రావతి, వేదవతి నదులు ప్రవహిస్తున్నాయి.

ఖనిజాలు

జిల్లాలో ఇనుము, సున్నం, వెట్‌క్లే, నాచురల్‌క్లే, డోలమైట్, కాల్‌సైట్, బ్రైరైటీస్, గ్రీన్‌క్వార్ట్జ్, బంగారు లోహాలు లభిస్తాయి. వజ్రకరూరు గ్రామంలో కింబర్‌లైట్ ఖనిజం ద్వారా వజ్ర నిక్షేపాలు ఉన్నాయి. తాడిపత్రి, యాడికి మండలాల్లో సిమెంటు తయారీకి అవసరమయ్యే సున్నపురాయి నిక్షేపాలున్నాయి. కలర్, నల్లనాపరాయి, ఫ్లోరింగ్‌కు పనికొచ్చే నాపరాయి నిక్షేపాలు ఉన్నాయి. ముచ్చుకోట ప్రాంతంలో పేపర్ ఇండస్ట్రీస్, డిటర్జెంటుకు ఉపయోగించే సోప్‌స్టోన్ నిక్షేపాలు ఉన్నాయి. ధర్మవరం డివిజన్‌లోని రామగిరి వద్ద బంగారు నిక్షేపాలున్నాయి.

సహజ సంపద

జిల్లాలో అడవుల విస్తీర్ణం 2.15 లక్షల హెక్టార్లు. ఇది మొత్తం వైశాల్యంలో 10.2 శాతం.

- ఉత్తరాన ఉన్న గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, రాయదుర్గం, కణేకల్లు, బెళుగుప్ప మండలాల్లో నల్లరేగడి భూములున్నాయి.
- మధ్యభాగాన ఉన్న కళ్యాణదుర్గం, కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, అనంతపురం, కూడేరు, ఆత్మకూరు, గార్లదిన్నె, పామిడి, పెద్దవడుగూరుమండలాల్లో ఎర్రనేలలున్నాయి.
- పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, హిందూపురం,

ముఖ్యమైన గణాంకాలు

అంశం	ప్రమాణం	పరిమాణం
వైశాల్యం	వేల చ.కి.మీటర్లలో	19.1
జనాభా	మంది	4,081,148
జనాభా పెరుగుదల (దశాబ్దంలో)	శాతం	12.1
జన సాంద్రత	జన సంఖ్య/ చ. కి. మీటరుకి	213
నగరీకరణ	శాతం	28.07
అక్షరాస్యత	శాతం	63.57

విద్యా సదుపాయాలు

వివరాలు	సంస్థల సంఖ్య 2014 - 2015	విద్యార్థుల సంఖ్య 2014 - 2015
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	13	19465
ప్రైవేట్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు	4	4989
రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు 2013-14	220 (సంస్థల సంఖ్య)	

పారిశ్రామిక సమాచారం

వివరాలు	పెట్టుబడి (కోట్లలో)	ఉద్యోగుల సంఖ్య
స్థాపించబడ్డ భారీ, మెగా ప్రాజెక్టులు	5212	25354
చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు	536.27	58816

లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర, రొళ్ల, అగళి, గడిబండ మండలాలు మిగిలిన మండలాల కన్నా ఎత్తయిన పీఠభూమితో ఎర్రనేలలు కలిగి ఉన్నాయి.

అక్షరాస్యత

అనంతపురం జిల్లా పట్టణ జనాభా అక్షరాస్యత 74.69 శాతం. ఇది జాతీయ సగటు అక్షరాస్యతా శాతం కంటే ఎక్కువ.

పదేళ్లలో 2001- 2011 మధ్య జిల్లా అక్షరాస్యతా శాతం 56.13 నుంచి 63.57కి పెరిగింది.

రాష్ట్ర జనాభాలో 4.83 శాతం జిల్లా జనాభా. నిష్పత్తి ప్రకారం ఎంచితే, ప్రతి వెయ్యిమంది మగవాళ్లకి 977 మంది ఆడవాళ్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

రోడ్లు

జిల్లాలో 353 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారి, 3489 కిలోమీటర్ల పొడవైన పిడబ్ల్యుడి రోడ్లు, 7157 కిలోమీటర్ల పంచాయతీ రోడ్లు ఉన్నాయి.

జిల్లా గుండా జాతీయ రహదారి ఎన్ హెచ్ 7, ఎన్ హెచ్ 42 వెళ్తాయి.

ఎయిర్ పోర్ట్

అనంతపురం- తిరుపతి రహదారి ద్వారా జిల్లాకి తిరుపతి ఎయిర్ పోర్ట్ చేరువలో ఉంటుంది. ఎన్ హెచ్ 7 ద్వారా బెంగుళూరు విమానాశ్రయం కూడా అందుబాటులో ఉంటుంది.

రైలు సదుపాయం

దక్షిణ మధ్య రైల్వే జోన్‌కి చెందిన అనంతపురం రైల్వే స్టేషన్ జిల్లాకి ప్రధానమైనది.

ఓడరేవు

కృష్ణపట్నం రేవుని జిల్లాకి స్టేట్ హైవే (ఎస్‌హెచ్)- 58, ఎస్‌హెచ్-34, తిరుపతి- అనంతపురం హైవేలు కనెక్ట్ చేస్తాయి.

పారిశ్రామికీకరణకి అనుకూలం

ఎన్‌హెచ్-7ని అనుసంధానిస్తూ అనంతపురం నగరానికి ఉన్న మంచి రోడ్డు సదుపాయం.

ఎన్నో గొప్ప విద్యాసంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో అనంతపురం జిల్లా సరస్వతీ నిలయంగా పేరొందింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జెఎన్‌టీయూ- అనంతపురం, శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, పివికెకె ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, ఇంటెల్ ఇంజనీరింగ్ కాలేజి, శ్రీనివాస రామానుజం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి వంటివి మచ్చుకు కొన్ని.

మహానగరాలన్నీ మహా చేరువ

అనంతపురానికి ఎన్‌హెచ్ -205 ద్వారా చెన్నై 406 కిలోమీటర్లు, ఎన్‌హెచ్-7 ద్వారా బెంగుళూరు 215 కిలోమీటర్లు.

చెన్నై - కొలకత్తాలను కలిపే ఎన్‌హెచ్ -5 గుండా విశాఖపట్నం 967 కిలోమీటర్లు.

తిరుపతి- అనంతపురం హైవే మీదుగా తిరుపతి కేవలం 292 కిలోమీటర్లు.

రైలు ద్వారా...

హైదరాబాద్, బెంగుళూరు, ముంబై, న్యూఢిల్లీ, అహ్మదాబాద్, ధర్మవరం, హిందూపూర్, ఆదోని, జైపూర్, భువనేశ్వర్, పూణె, విశాఖపట్నం వంటి దేశంలోని ప్రధానమైన ప్రాంతాలకి రైలు సదుపాయం ఉంది.

ఆకాశయానం

అనంతపురంకి 280 కిలోమీటర్ల దూరంలోని తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, గోవా, కోయంబత్తూర్‌లకు విమానం ద్వారా ప్రయాణం చేయవచ్చు.

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 220 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

మౌలిక సదుపాయాలు

కప్పలబండలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఇఎంసి) ఇప్పటికే ఆమోదం పొందింది.

ప్రమోటర్

ఎల్సినా రాగమయూరి

క్లస్టర్ పేరు- ఎల్సినా రాగమయూరి ఎలక్ట్రానిక్స్ పార్క్

మొత్తం వైశాల్యం: 48.25 ఎకరాలు

బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి 66 కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారిని ఆనుకొని.

– పెరుమాళ్ళ నాగరాజు
మీడియా లైజన్ అధికారి

నవ్యాంధ్రలో జలమార్గ రవాణాకు పెద్దపీట

రూ.3వేల కోట్ల ఖర్చుతో 1078 కి.మీ. అంతర్గత రవాణా



కాకినాడ నుంచి పుదుచ్చేరి దాకా జాతీయ జలరవాణా వ్యవస్థ

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతి' నిర్మాణానికి దేశ,విదేశీ ప్రముఖుల సమక్షంలో భారత ప్రధాని నరేంద్రమోడీచే శంకుస్థాపన చేయించి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఇపుడు రాష్ట్రంలో జలమార్గ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

సుదీర్ఘ తీర ప్రాంతం గల నవ్యాంధ్రప్రదేశ్‌లో జల మార్గ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో 'సాగరమాల కమిటీ' ని ఏర్పాటు చేశారు. జలాధారంగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశారు.

రాష్ట్రంలో గల ఓడరేవుల ఆధునీకరణ, తీరంలో పటిష్టమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు దాదాపు 974కి.మీ పొడవున తొమ్మిది జిల్లాల పరిధిలో ఉన్న సముద్రతీరం, గోదావరి, కృష్ణా తదితర నదుల వెంబడి పెద్ద ఎత్తున జలమార్గ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని

చంద్రబాబు సంకల్పించడం రాష్ట్ర భవిష్యత్‌కు ఒక శుభపరిణామం.

నవ్యాంధ్రలో దాదాపు 1078 కి.మీ. పొడవున అంతర్గత జల రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సన్నాహాలు ప్రారంభించారు. ఇందుకోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రతిపాదనలపై న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 'జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ' తొలి ఉన్నతస్థాయి సమావేశంలో చంద్రబాబు ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. భారత అంతర్గత జలమార్గ రవాణా అథారిటీ(ఐడబ్ల్యూఏఐ) ఛైర్మన్ అమితాబ్ వర్మ ఈ భేటీలో దాదాపు మూడు గంటలపాటు ప్రజెంటేషన్ ఇచ్చారు. నవ్యాంధ్రలో జలమార్గ రవాణా ప్రాజెక్టును (ఎన్‌డబ్ల్యూ-4) రెండు దశల్లో అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తొలిదశలో... ఎన్నూరు సముద్ర ముఖప్రాంతం నుంచి పెదగంజాం వరకు 300కి.మీ వరకు ఉత్తర బకింగ్‌హాం కాలువను పునరుద్ధరించనున్నారు. కొమ్మమూరు, ఏలూరు, కాకినాడ కాలువల్లో తగినంత నీరు ఉన్నట్టయితే, పెదగంజాం నుంచి కాకినాడ వరకు సుమారు 302కి.మీ వరకు జలమార్గ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు.

రెండవ దశలో...ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆనకట్ట ప్రాజెక్టులన్నీ పూర్తయిన అనంతరం కృష్ణా, గోదావరి నదుల్లో దాదాపు 328కి.మీ వరకు ఎన్‌డబ్ల్యూ-4 కింద జలమార్గాలను అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. 500టన్నులకు పైచిలుకు సరకు రవాణాచేసే నౌకలు నడిచేందుకు వీలుగా క్లాస్-3 జలమార్గాలను అభివృద్ధి చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

కాలువల అడుగు వెడల్పు 40మీటర్లు, లోతు 2.5మీటర్లు ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. జలమార్గ టెర్మినల్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సరుకు రవాణాకు వీలుగా సమీపంలోని జాతీయ, రాష్ట్రరహదారి, రైల్వేలైను ఉండేలా టెర్మినల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిపాదించిన ఈ టెర్మినల్స్‌లో కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, కృష్ణపట్నం, ఎన్నూరు ప్రాంతాలున్నాయి.

రూ.3 వేల కోట్లతో జాతీయ జల రవాణా

రూ.1800 నుంచి రూ.3,000వేల కోట్ల అంచనా వ్యయంతో నవ్యాంధ్రలోని కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు జాతీయ జల మార్గ రవాణా వ్యవస్థ(ఎన్‌డబ్ల్యూ)ను ఏర్పాటు చేయడానికి మరో కార్యాచరణ ప్రణాళిక అమలుకోసం కసరత్తు కేంద్రప్రభుత్వ పర్యవేక్షణలో ఈ కమిటీ కసరత్తు చేస్తున్నది.

ఈ ప్రణాళిక ప్రకారం భూసేకరణ, నిర్వాశితులకు పునరావాస, మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించారు.

ఇదీ జాతీయ జలమార్గం స్వరూపం

- కాకినాడ నుంచి రాజమండ్రి వరకు కాకినాడ కాలువను 50కి.మీ వరకు
- గోదావరి నదిలో భద్రాచలం నుంచి రాజమండ్రి వరకు 171కి.మీ వరకు
- రాజమండ్రి నుంచి విజయవాడ వరకు ఏలూరు కాలువ...
  - ఏ) రాజమండ్రి నుంచి ఏలూరు వరకు 74కి.మీ పొడవున గోదావరినదిపై ఏలూరు కాలువ నిర్మాణం
  - బి) ఏలూరు నుంచి విజయవాడ వరకు 157కి.మీ పొడవున కృష్ణానదిపై ఏలూరు కాలువ నిర్మాణం
- కృష్ణానదిపై వజీరాబాద్ నుంచి విజయవాడ వరకు 157కి.మీ పొడవున కాలువ నిర్మాణం
- విజయవాడ నుంచి పెదగంజాం వరకు 113కి.మీ పొడవున కొమ్మమూరు కాలువ ఏర్పాటు
- పెదగంజాం నుంచి చెన్నై వరకు 316కి.మీ పొడవున ఉత్తర బకింగ్ హెూం కాలువ ఏర్పాటు
- చెన్నై నుంచి మరక్కణం వరకు 110కి.మీ పొడవున దక్షిణ బకింగ్‌హెూం కాలువ నిర్మాణం
- మరక్కణం నుంచి పుదుచ్చేరి వరకు 22కి.మీ పొడవున కాలువెళ్లి ట్యాంక్ ద్వారా రవాణా మార్గం ఏర్పాటు

జలరవాణా అథారిటీ చేపట్టాల్సిన సర్వే

జలమార్గ వ్యవస్థను అమలుచేయడానికి ముందు భారత అంతర్గత జలరవాణా అథారిటీ ఆధ్వర్యంలో జలవనరుల నీటి మట్టాలపై తొలుత సర్వే చేపట్టాల్సి ఉంటుంది. పర్యావరణం, కోస్తా నియంత్రణ జోన్ (సీఆర్‌జెడ్), అటవీ, వన్యప్రాణుల సంరక్షణ క్లియరెన్సులను సంబంధిత అధికార యంత్రాంగం నుంచి తీసుకోవాలి. తవ్వకాలు, మట్టి తోడిపోయడం, సముద్ర ముఖద్వారాన్ని తెరవడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

టెర్మినల్ సదుపాయాల అభివృద్ధి, మార్గసూచీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హద్దుల నిర్ధారణ సర్వే ప్రక్రియను డిసెంబర్ నెలాఖరులోపు పూర్తిచేయాల్సి ఉంటుంది.

వ్యూహాల ఖరారు, రాష్ట్ర ప్రభుత్వ సర్వే, సిఫారసులతో పాటు, క్రాస్ స్ట్రక్చర్ల నమూనా, అంచనాలు వచ్చే జనవరిలోగా పూర్తికావాలి. ప్రాజెక్టు ప్రతిపాదనల తయారీ, ఆమోదం వంటి ప్రక్రియలు వచ్చే మార్చి నాటికి పూర్తికావలసి ఉన్నది. అన్ని రకాల అనుమతులనూ 2016ఆగస్టు నెలాఖరులోపుగా తీసుకోవలసి వుంటుంది. తవ్వకం పనులు వెంటనే ప్రారంభించాలని ఆ ప్రణాళికలో నిర్దేశించారు.

'సాగరమాల'లో రూ.400కోట్లతో నాలుగు ప్రాజెక్టులు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగరమాల ప్రాజెక్టులో భాగంగా ఓడరేవుల అభివృద్ధికోసం రూ.400కోట్ల అంచనా వ్యయంతో మరో నాలుగు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసింది. చిన్న, మధ్య తరహా రేవుల అభివృద్ధికి సంబంధించి కాకినాడ ఓడరేవు డైరెక్టరు కార్యాలయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనల్లో నాలుగింటిని కేంద్రం ఆమోదించింది. కాకినాడ లంగరు రేవుకు దగ్గరలోని కస్టమ్స్ కార్యాలయం ఎదురుగా ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. కృష్ణపట్నం ఓడరేవు నుంచి జాతీయ రహదారిని కలుపుతూ రెండు నాలుగులేన్ల రహదారులు నిర్మించేందుకు కేంద్రం అనుమతించింది.

అలాగే విశాఖపట్నం జిల్లా గంగవరం ఓడరేవు నుంచి జాతీయ రహదారిని కలుపుతూ మరో రోడ్డును నిర్మించేందుకు కూడ కేంద్రం ఆమోదం తెలిపింది. తూర్పుగోదావరిజిల్లా అంతర్వేది వద్ద దాదాపు రూ.1800కోట్ల అంచనా వ్యయంతో డ్రెడ్జింగ్ యంత్రాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టును వశిష్ట గోదావరిపై వంతెన నిర్మిస్తూ సఖినేటిపల్లి నుంచి నర్సాపురాన్ని అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీనితోపాటు 30కి.మీ వరకు నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనితోపాటు అంతర్వేది నుంచి 216 జాతీయ రహదారి వరకు 60కిలోమీటర్ల రహదారిని విస్తరించేందుకు కూడ కేంద్రం అనుమతించింది.

❖

అవార్డులు - రివార్డులు

- దేశంలోనే అత్యున్నతమైన శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుకు డాక్టర్ డి.శ్రీనివాస్ ఎంపికయ్యారు. పుణెలోని నేషనల్ కెమికల్ లేబరేటరీలో పని చేస్తున్న ఈయనకు 2015 సంవత్సరానికి గాను రసాయన శాస్త్ర విభాగంలో ఈ పురస్కారం దక్కింది.
- వెన్నెముకకు సోకే ప్రమాదకర జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి, వాటికి సరికొత్త ఆధునిక వైద్య విధాన పద్ధతులను కనుగొన్నందుకు తెలుగు వైద్యుడు డా.జె.నరేష్ బాబుకు అంతర్జాతీయ స్పైన్ సర్జన్స్ అసోసియేషన్ పురస్కారం లభించింది. ఈ సంస్థ నుంచి ఒక తెలుగు వైద్యుడి పరిశోధనకు ఉత్తమ అవార్డు రావడం ఇదే ప్రథమం.
- ఈ ఏడాది సాహిత్యంలో నోబెల్ బహుమతిని బెలారస్ రచయిత్రి స్వెత్లానా అలెక్సియేవిచ్ (67)కు ప్రకటించారు. చెర్నోబిల్ విపత్తు, రెండో ప్రపంచ యుద్ధంపై ప్రత్యక్ష సాక్షుల కథనాల ఆధారంగా ఆమె చేసిన రచనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందాయి.
- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాడరేవు వినయ్‌చంద్‌కు సఫాయిగిరి సమ్మిట్ అవార్డు ప్రదానం చేశారు.
- శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) ఏటా అందించే సీఎస్ఐఆర్ టెక్నాలజీ అవార్డుకు 2015 ఏడాదికి గాను లైఫ్ సైన్సు విభాగంలో హైదరాబాద్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ (సీమ్యాప్) ఎంపికైంది. అశ్వగంధ మొక్కల్లో వివిధ విత్తన రకాలను అభివృద్ధి చేసి ప్రదర్శన క్షేత్రాల్లో సాగుచేసినందుకు ఈ అవార్డు లభించింది.

జాతీయం

- ఫ్యాక్టరీ ఉద్యోగులకు, 20 కంటే ఎక్కువ మంది పనిచేసే సంస్థల్లోని ఉద్యోగులకు బోనస్ లెక్కించేందుకు ఉద్దేశించిన వేతన పరిమితిని రూ.3500 నుంచి 7000 కు పెంచాలని కేంద్రం నిర్ణయించింది.
- జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని సుప్రీం కోర్టు కొట్టేసింది. ఎన్‌జేఏసీతో పాటు సంబంధిత 99వ రాజ్యాంగ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది.
- రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజనకు సంబంధించి మార్గదర్శనం చేసే కమలనాథన్ నేతృత్వంలోని అడ్వయిజరీ కమిటీ కాలపరిమితిని 2016 మార్చి 31 తేదీ వరకూ పెంచారు.
- రైతులకు నీటిపారుదల సౌకర్యాలను పెంచే ఉద్దేశ్యంతో రూ.2,142.30 కోట్లతో జాతీయ వాటర్ షెడ్ నిర్వహణ పథకం నీరాంచల్ కు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది.
- విజయవాడ, తిరుపతి, విశాఖల్లో ఎమ్యూజ్‌మెంట్, వాటర్ వరల్డ్ పార్కులు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎనిమిది పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది.
- సంక్షేమ పథకాల్లో ఆధార్ కార్డు వినియోగంపై గతంలో విధించిన ఆంక్షలను సుప్రీం కోర్టు పాక్షికంగా తొలగించింది. అన్ని పెన్షన్ పథకాలతో పాటు, పీఎఫ్, జనధన యోజన, ఉపాధి హామీ పథకాల్లో ఆధార్ కార్డు వివరాలను ఐచ్ఛికంగా ఉపయోగించుకోవచ్చంటూ కేంద్ర ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది.
- భారత రక్షణ దళాల్లో మహిళలను యుద్ధ విమానాల పైలట్లుగా నియమించడానికి కేంద్రం నిర్ణయించింది.
- ఇపుడున్న అధికారాల పరిధికి లోబడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు నిబంధనలు కల్పించడం కుదరదని, అందుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.
- డిగ్రీ విద్యార్థులు తమ బ్యాక్ లాగ్ పేపర్లను ఇక మీదట కచ్చితంగా రెండేళ్లలో పూర్తి చేయాలని యూనివర్శిటీ గ్రాంటు కమిషన్ సూచించింది. దేశంలోని అన్ని యూనివర్శిటీలకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది.
- కిందిస్థాయి పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూత్ర ప్రాయంగా నిర్ణయించింది.
- ఇండియన్ రైల్వేస్ కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇకపై ముందస్తు ఆర్డర్లపై ప్రయాణీకులకు రైల్వేస్టేషన్లలోనే వారికి కావాల్సిన ఆహారాన్ని అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈకేటరింగ్ పేరిట దీనిని పైలట్ ప్రాజెక్టుగా తొలిదశలో 45 ప్రధాన రేల్వేస్టేషన్లలో అందజేయనున్నారు.

రాష్ట్రీయం

- ఆర్టీసి కార్మికుల ఉద్యోగ విరమణ వయసును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
- ఇతర రాష్ట్రాల్లో మాదిరి రాష్ట్రంలో 100 హెల్త్‌కేర్ ఏటీఎంలను ఏర్పాటు చేయాలని, పనితీరును బట్టి వాటి సంఖ్యను మరింత పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- మార్కెట్లో పొట్టేళ్ళ మాంసానికి మంచి గిరాకీ ఉన్న నేపథ్యంలో డ్వాక్రా మహిళలతో వాటి పెంపకాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యేకించి ఏ రంగంలో నైపుణ్యం లేని మహిళలను పొట్టేళ్ళ పెంపకానికి ప్రోత్సహించాలని నిర్ణయించారు.
- విశాఖపట్నం నుంచి విజయవాడకు శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలు నడిపేందుకు రైల్వే శాఖ సమ్మతించింది.
- రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి పదవీ విరమణ వయసును 60 ఏళ్ళకు పెంచారు.
- వైద్య ఆరోగ్య శాఖలో జరిగే పలు కార్యక్రమాల పర్యవేక్షణకు సామాజిక సాధికార సంస్థలో భాగంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కన్సల్టెంట్లను నియమించనున్నారు.
- రాష్ట్రంలో స్థానికత నిబంధన సడలింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2017 జూన్ రెండో తేదీ లోపు ఆంధ్ర ప్రదేశ్‌కు వచ్చిన వారికే స్థానికత వర్తిస్తుందని ప్రకటించింది. తెలంగాణలో చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు ఇతరులెవరైనా ఈ లోపు ఇక్కడకు వచ్చి నివాస ధ్రువ పత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన వారికి ఇక్కడి స్థానికత వర్తించదు.
- ఆంధ్రప్రదేశ్‌ను మూడు రీజియన్లగా వర్గీకరిస్తూ మూడు మహానగరాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలనుకలిపి విశాఖపట్నం మెగాసిటీగా అభివృద్ధి చేస్తారు. పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలను కలిపి అమరావతి మెగాసిటీగా అభివృద్ధి చేస్తారు. కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలను కలిపి తిరుపతి మెగా సిటీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.
- రాష్ట్ర విభజన నేపథ్యంలో విశాఖపట్నంలో కొత్తగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం సేకరణ విధానాన్ని, మద్దతు ధరలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మేలు రకం ధాన్యం క్వింటాలుకు రూ.1450, సాధారణ రకానికి రూ.1410 ధరలతో ధాన్యం సేకరించనున్నట్లు ప్రకటించింది.
- కందిపప్పు ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో తెల్ల రేషన్ కార్డుదారులకు సబ్సిడీతో సరఫరా చేసేందుకు వీలుగా కేంద్రం ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్న 5000 టన్నుల కందులలో 4000 టన్నులు రాష్ట్రానికి కేటాయించింది.
- కాలేజీల నుంచి బయటకు వచ్చే విద్యార్థులకు ఉద్యోగావకాశాల కోసం డిగ్రీలో కొత్త సబ్జెక్టులను ప్రవేశ పెట్టాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది.
- ఉమ్మడి హైకోర్టులో పని చేస్తున్న తొమ్మిది మంది అదనపు న్యాయమూర్తుల పదవీ కాలాన్ని మూడు నెలల పాటు పొడిగించారు.
- ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రధాని నరేంద్ర

మోడీ విజయ దశమి పర్వదినం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉద్దండరాయునిపాలెంలో సభను ఏర్పాటు చేశారు. దేశ విదేశాలకు చెందిన అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు.

వార్తలు.. విశేషాలు

- పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడి 'వారియర్స్ రిమెంబర్డ్ (యోధుల స్మృతిలో) పుస్తకాన్ని విడుదల చేశారు. సీఆర్‌పిఎఫ్ అమరవీరులపై రాసిన ఈ పుస్తకంలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన రెండు వేల మంది సిబ్బంది జీవితాలు, సాహస కృత్యాలను పొందుపరిచారు.
- ప్రముఖ హాస్యనటుడు కళ్లు చిదంబరం విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. కళ్లు చిత్రంతో తెరంగేట్రం చేసిన ఆయన దాదాపు 300 చిత్రాల్లో, పలు నాటకాల్లో నటించిన ఆయన ఆ సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు.
- ఉమ్మడి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిన అన్ని మోటారు వాహనాల నంబర్ల మార్పునకు రంగం సిద్ధమైంది. ఏపీ కోడ్‌తో ఉన్న నంబర్ ప్లేట్లపై ఇక ఏపీ స్థానంలో టీఎస్ కోడ్‌ను చేర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మార్పులు చేసేందుకు నాలుగు నెలలు గడువిచ్చారు.
- తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టారు.
- మాడా 300కు పైచిలుకు తెలుగు,ఇతర బాషా చిత్రాలలో నటించారు. ముత్యాలముగ్గు, లంబాడోళ్ల రామ్‌దాసు, మాయదారి మల్లిగాడు వంటి చిత్రాలలో ఆయన నటించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. మాడా చిత్రపరిశ్రమలోకి రాకుముందు ఎలక్ట్రిసిటీ బోర్డులో ఇంజినీరుగా పనిచేశారు.
- వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొక్కు నరేష్ అనే విద్యార్థి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు 2015(నెట్)లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించాడు.
- పూర్ణోదయ క్రియేషన్స్ అధినేత, ప్రముఖ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు కన్నుమూశారు. శంకరాభరణం, స్వాతిముత్యం, సాగర సంగమం, సిరిసిరిమువ్వ లాంటి అద్భుత చిత్రాలను నిర్మించిన ఆయన తెలుగుసినీ కీర్తిని ఖండాంతరాలకు చాటారు.
- భారతీయ పీడియాట్రిక్ సర్జన్ల అసోసియేషన్ గౌరవ కార్యదర్శిగా డాక్టర్ కె.రమేష్ రెడ్డి ఎన్నికయ్యారు.
- ప్రముఖ సీనియర్ నటి, తెలుగు, తమిళ భాషల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకుల మన్ననలందుకున్న మనోరమ కన్నుమూశారు. తమిళంలో ఎమ్జీఆర్, కరుణానిధి, జయలలిత లాంటి ముఖ్యమంత్రులతో కలిసి నటించారు. అలాగే తెలుగులో చిరంజీవి, నాగార్జున వంటి ప్రముఖులతో నటించారు. తెలుగు, తమిళ, మళయాల భాషల్లో కలిపి మొత్తం 1500 చిత్రాల్లో నటించిన ఆమె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో కూడా చోటు సంపాదించుకున్నారు.
- వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త పాలాది లక్ష్మి కాంతం శ్రేష్ఠి (79) కడపలో కన్నుమూశారు.
- ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు విశిష్ట పురస్కారం, సినీ నటుడు డాక్టర్ కైకాల సత్యనారాయణ, నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సి.మృణాళినిలకు విశేష పురస్కారాలను డాక్టర్ రామినేని ఫౌండేషన్ ప్రదానం చేసింది.

నవంబరు నెలలో ముఖ్యమైన రోజులు;

దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి	1
సి.పి.బ్రౌన్ జయంతి, తెన్నేటి విశ్వనాధం వర్ధంతి	10
జాతీయ బ్రాడ్ కాస్టింగ్ దినోత్సవం	12
కాళోజీ నారాయణరావు వర్ధంతి	13
బాలల దినోత్సవం	14
జాతీయ ప్రెస్ దినోత్సవం	16
జాతీయ మూర్ఛ, చెవిటి, మూగల దినోత్సవం	17
ఇందిరాగాంధీ జయంతి, జాతీయ సమైక్యతా దినం	19
గురజాడ అప్పారావు వర్ధంతి	30

నియామకాలు

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా రవీంద్ర గుప్తా బాధ్యతలు స్వీకరించారు.
- జి.వాణీమోహన్‌ను సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్‌గా, పి.ఉషాకుమారిని మైనార్టీ సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శిగా, విశాఖ జిల్లా పాడేరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వి. ప్రసన్న వెంకటేష్‌ను సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ వైస్ ఛైర్మన్ అండ్ ఎండీగా పనిచేస్తున్న రమణమూర్తిని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టరగాగా నియమించారు.
- ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.ఎస్.ఎం.లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ళ పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు.
- ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్‌గా దినేష్ పరుచూరి బాధ్యతలు స్వీకరించారు.
- రాష్ట్ర గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సంయుక్త కార్యదర్శిగా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవర వాసును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

క్రీడలు

- ఆంధ్ర అండర్19 మహిళల క్రికెట్ జట్టు అన్ని విభాగాల్లో సమష్టి ప్రదర్శన కనబరచి ఆలిండియా టోర్నీ విజేతగా నిలిచింది.
- భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసిఐ) కొత్త అధ్యక్షుడిగా శశాంక్ మనోహర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2017 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.
- దాదాపు దశాబ్ద కాలం పాటు భారత క్రికెట్ జట్టులో తనదైన ముద్ర వేసుకున్న క్రీడాకారుడు జహీర్‌ఖాన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.
- తమకంటే మెరుగైన ర్యాంక్ కలిగిన న్యూజిలాండ్ జట్టుతో జరిగిన నాలుగు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత్ సొంతం చేసుకుంది.
- ఈ సీజన్‌లో తన అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అజయ్ జయరామ్ డచ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి టోర్నమెంటులో విజేతగా నిలిచాడు.
- ఏటీపీ చాలెంజర్ టోర్నీలో హైద్రాబాద్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ రన్నరప్‌గా నిలిచాడు. అలాగే బల్గేరియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ టోర్నమెంటులో గురుసాయిదత్ రన్నరప్‌గా నిలిచాడు.
- ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ బాలికల అండర్18 డబుల్స్ టైటిల్‌ను తెలంగాణ క్రీడాకారిణి సామ సాత్విక గెలుచుకుంది.
- హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని వియత్నాం ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంటులో సింగిల్స్ చాంపియన్‌గా అవతరించాడు.
- డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్ టోర్నమెంటులో భారత బ్యాడ్మింటన్ పీవీ సింధు రన్నరప్‌గా నిలిచింది.
- కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సీనియర్ మహిళల 53 కిలోల విభాగంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన మత్స సంతోషి, యూత్ బాలికల 44 కేజీల విభాగంలో టి.ప్రియదర్శిని పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు.
- పోకెర్ స్టార్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ విజేతగా నిలిచాడు. అలాగే మహిళల విభాగంలో హరికకు మూడో స్థానం దక్కింది.

దాసరి దుర్గాప్రసాద్

రైతుల ఆదాయాలు పెరిగేలా యాక్షన్ ప్లాన్

5జిల్లాలలో వ్యవసాయ సంక్షోభంపై అధ్యయనం చేయాలి

రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం నెలకొన్న 5 జిల్లాలలో రైతుల ఆదాయాలు పెరిగేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 1998-2014 జూన్ వరకు 2379 మంది రైతు ఆత్మహత్యలు నమోదైనట్లు పేర్కొంటూ ఎన్‌సిఆర్‌బి నివేదికలో వెల్లడైంది. రాయలసీమ జిల్లాల్లోనే 1774 జరిగాయని ముఖ్యమంత్రితో సమీక్షా సమావేశం తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. 2014లో దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఆత్మహత్యలలో మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్ ముందున్నాయంటూ ఆంధ్రప్రదేశ్ లో 160మంది చనిపోయినట్లు ఈ నివేదిక వెల్లడించిందన్నారు. ఈ 160 మందిలో కూడా వ్యవసాయం చేసి నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నవారి సంఖ్య 48గా పేర్కొన్నట్లు వివరించారు. రాయలసీమ 4 జిల్లాలు, ప్రకాశం జిల్లాలోనే అధికంగా రైతు ఆత్మహత్యలు జరుగుతున్నట్లు వెల్లడైందంటూ వాటి వెనుక కారణాలను అధ్యయనం చేయనున్నట్లు చెప్పారు. సంక్షోభం ఎక్కువగా ఉన్న మండలాలను, గ్రామాలను గుర్తించి అందుకు దారితీసిన పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లకు మార్గ నిర్దేశం చేశామన్నారు.

ప్రతి రైతుకు బహుళ జీవనోపాధి కలిగేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. రైతు కుటుంబంలో ప్రతి ఒక్కరికీ వ్యవసాయ యంత్రాలతోపాటు ఏదోఒక ప్రత్యామ్నాయ ఉపాధి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు మిత్ర గ్రూపులను పటిష్టం చేయాలని, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేసి బ్యాంకర్లను, రైతుమిత్ర గ్రూపులను, డ్వాక్రా గ్రూపులను సమన్వయం చేయనున్నట్లు చెప్పారు. వేయి అడుగుల లోతుకు వెళ్ళి బోర్లు వేయడం వల్ల ఆర్థిక భారం పెరిగి వడ్డీలు చెల్లించలేని దురవస్థ రైతుకు ఎదురుకావడంపై

18 నెలల్లోపు కాకినాడ టెర్మినల్ పూర్తి చేయాలి

– షెల్ ఇండియా కంట్రీ ఛీఫ్‌తో సీఎం చంద్రబాబు

కాకినాడ ఫ్లోటింగ్ ఎల్ఎన్‌జీ స్టోరేజి రీ గ్యాసిఫికేషన్ యూనిట్‌ను 18 నెలల్లోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. అక్టోబరు 7న విజయవాడలో తనను కలిసిన షెల్ ఇండియా కంట్రీ ఛీఫ్ యాస్మిన్ హిల్టన్‌తో మాట్లాడారు. టెర్మినల్ నిర్మాణానికి నిధుల సమీకరణ ఎలా చేయాలి? సకాలంలో పనులు ఏవిధంగా పూర్తి చేయాలి అనేదానిపై చర్చించారు. ప్రపంచంలోనే ఇంధన వనరుల కంపెనీలలో ఒకటైన తమ సంస్థ ఆటో, ఏవియేషన్ ఇంధనాలైన లూబ్రికెంట్స్, బిటుమిన్‌ల విక్రయానికి లైసెన్సులు పొందిన కంపెనీగా యాస్మిన్ హిల్టన్ పేర్కొన్నారు. హజారియాలో రీగ్యాసిఫికేషన్ ప్లాంట్ నెలకొల్పామని, బెంగుళూరులో టెక్నాలజీ సెంటర్ ఉందని తెలిపారు. ఉత్పత్తి చేసిన గ్యాస్ మార్కెటింగ్ అంశాన్ని తామే చూసుకుంటామని షెల్ ప్రతినిధులు చెప్పారు. 15 నెల స్వల్ప వ్యవధిలోనే రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించిందంటూ గ్యాస్ అమ్మకాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

దేశంలోనే కాలుష్యరహిత ఇంధన వినియోగంలో ఆంధ్రప్రదేశ్ ముందుండాలనేది తన ఆకాంక్షగా పేర్కొన్నారు. విశాఖపట్నంలో కర్మాగారాలన్నీ కాలుష్యరహిత ఇంధనం వినియోగించేలా చూస్తామన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా మేకిన్ ఆంధ్రప్రదేశ్ కింద రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామికీకరణ గురించి వివరించారు. పరిశ్రమల విస్తరణకు అత్యంత అనుకూలమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా పేర్కొన్నారు. కోస్తాతీరంలో అపార సహజవాయు నిక్షేపాలు భారీగా ఉన్నాయన్నారు. రాజధాని అమరావతిని కర్బన ఉద్గార రహిత నగరంగా రూపొందిస్తామన్నారు. సైకిల్ పాత్‌లు, వాటర్ ట్యాక్సీల ద్వారా పర్యావరణహితంగా పబ్లిక్ ట్రాన్స్ పోర్టు ఉంటుందని తెలిపారు. ప్రతిపాదనలతో ముందుకు రావాలని, కలిసి పని చేద్దామని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో అత్యుత్తమ విధానాలతో ముందుకు రావాలని కోరారు.

❖

ఈ-ప్రగతి ద్వారా 774 సేవలు

33 శాఖల ద్వారా 774 సేవలను అందించే ఈ-ప్రగతి ప్రాజెక్టుకు 2,398 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని, దీని ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరుగుతుందని, అన్ని రంగాలలో ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత ఉన్నతంగా పెరుగుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాదిలో ఈ-ప్రగతి ఉధృతమైన నాలుగు ప్రధాన కార్యక్రమాల ద్వారా తన ఉనికి చాటుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పౌర సరఫరాలు, పించన్లు, మీ-ఇంటికి మీ-భూమి వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో టెక్నాలజీని అనుసంధానం చేయటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, మీ-ఇంటికి మీ-భూమి ద్వారా 64 సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు.

రాయలసీమ 4 జిల్లాలు, ప్రకాశం జిల్లాలోనే అధికంగా రైతు ఆత్మహత్యలు జరుగుతున్నట్లు వెల్లడైందంటూ వాటి వెనుక కారణాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.. సంక్షోభం ఎక్కువగా ఉన్న మండలాలను, గ్రామాలను గుర్తించి అందుకు దారితీసిన పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లకు ప్రభుత్వం మార్గనిర్దేశం చేసింది.

విశ్లేషించాలన్నారు. బోరుకు, బోరుకు మధ్య దూరం పాటించకపోవడం, వోల్టా చట్టం సక్రమంగా అమలు చేయకపోవడం రైతులకు నష్టదాయకంగా మారడంపై చర్చించామన్నారు. కౌలు రైతులకు రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ అందకపోవడం ప్రధాన సమస్యకావడంపై పుల్లారావు మాట్లాడుతూ భూ యజమానికి ఇబ్బంది లేకుండా కౌలు రైతులను ఆదుకునే అంశాలను అన్వేషిస్తున్నామన్నారు.

అనుబంధ రంగాల ద్వారా రైతుకు రాబడి పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా 10 గేదెలు లేదా 100 గొర్రెలు, 'మనకోడి' పథకం కింద 45 కోడిపిల్లలు పంపిణీ చేస్తామన్నారు. వర్షాభావ ప్రాంతాలలో పంటలు ఎండిపోకుండా ట్యాంకర్ల నుంచి రెయిన్ గన్స్ ద్వారా నీటిని అందించి కాపాడుతామన్నారు. బిందు, తుంపరసేద్యాన్ని అమలు చేసి స్వల్ప కాలంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల సాగుకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతు సాధికార సంస్థ ద్వారా "డిస్ట్రెస్ ఫండ్ " ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నాగార్జున సాగర్ కుడికాలువ, కృష్ణాడెల్టా ఆయకట్టులో ప్రత్యామ్నాయ పంటలుగా మినుము, పెసర, సెనగ తదితర పంటల సేద్యాన్ని ప్రోత్సహిస్తామన్నారు. సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రుణాల మంజూరులో లక్ష్యాన్ని చేరుకోని బ్యాంకర్ల మీద సమీక్ష చేస్తామన్నారు. 54 లక్షల రైతుల ఖాతాలలో రుణ ఉపశమనం నగదు జమచేశామని, 22.52 లక్షల మందికి గరిష్టంగా రూ.50 వేలు ఏక మొత్తంలో అందించామన్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల అధిక వడ్డీలకు రైతులు బలికాకుండా వారికి సంస్థాగత రుణ పరపతి అందేలా శ్రద్ధ వహిస్తామన్నారు. ప్రతి సంక్రాంతికి ఆదర్శ రైతులను, రైతు ప్రోత్సాహకులను గుర్తించి అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

❖

విజ్ఞానం-సాంకేతికతల ప్రాధాన్యత

విజ్ఞానం, సాంకేతికత రంగాలు అభివృద్ధిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పాత్ర పోషిస్తున్నాయని, డిజిటల్ లిటరసీ సాధించటమే మనకు ఉన్న ఏకైక మార్గమని, ప్రతి కుటుంబంలో కనీసం ఒక వ్యక్తి అయినా కంప్యూటర్ విద్యను అభ్యసించిన వ్యక్తి కావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలో ఉన్న అనేక పెద్ద ఐటి కంపెనీలకు భారతీయులు సిఇఓలుగా ఉండటం మనకు గర్వకారణమని, ప్రస్తుతం వారి సంఖ్య 20 నుండి 25 శాతం ఉందని, అది 50 శాతానికి చేరుకున్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. అమెరికాలో ఎంతో మంది తెలుగు వారు, భారతీయులు అనేక కంపెనీలు నెలకొల్పడం ద్వారా సాఫ్ట్‌వేర్ రంగంలో ఎన్నో అద్భుతాలు చేశారని, ఎంతో డబ్బు, పేరు ప్రఖ్యాతులు సంపాదించారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అమెరికాలో ఉన్న ప్రతి నలుగురు భారతీయుల్లో ఒకరు మన రాష్ట్రానికి చెందిన వారు కావడం మనకు గర్వకారణం అన్నారు.

ఏపీ జీడీసీలో 30% పెట్టుబడులకు ముందుకొచ్చిన ఐఎఫ్‌సి

– ముఖ్యమంత్రితో భేటీ అయిన ఐఎఫ్‌సి రీజినల్‌హెడ్ జెస్సికా జోలెన్ ఫార్మర్

ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లో 30% పెట్టుబడి పెట్టేందుకు ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకొచ్చింది. అక్టోబరు 7న విజయవాడలోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయిన ఐఎఫ్‌సి రీజినల్‌హెడ్ జెస్సికా జోలెన్ ఫార్మర్ ఈ విషయం తెలిపారు. గత 40 ఏళ్లుగా అంతర్జాతీయంగా ఈ రంగంలో పని చేస్తున్నామని, 15 ప్లాంట్‌లను నెలకొల్పామని తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి నడుంకట్టామన్నారు. భారతదేశంలో అభివృద్ధి వేగం పుంజుకుందని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి శరవేగంతో జరుగుతోందని చెప్పారు. 10 లక్షల ఎకరాలలో భూబ్యాంక్ ఏర్పాటు చేశామని, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేశామని వివరించారు. 2వ ఏడాది మొదటి క్వార్టర్ లో 9.74% వృద్ధి సాధించామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో 2వ ర్యాంకు పొందినట్లుగా చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి డబ్బు సమస్య కాదంటూ, విజ్ఞానం, సాంకేతికత, మేలైన విధానాలే ప్రధానంగా పేర్కొన్నారు. 33వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికి రైతులు ఇచ్చారని, మరో 50 వేల ఎకరాల అటవీ భూమిని డీనోటిఫై చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. సింగపూర్ ప్రభుత్వం రాజధాని మాస్టర్ ప్లాన్‌ను ఉచితంగా తయారు చేసి ఇచ్చిందంటూ బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతి నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రపంచ కంపెనీలన్నీ ముందుకు వస్తున్నాయన్నారు. రూపాయి లేకుండా ఇదంతా చేస్తున్నానంటే తన దూరదృష్టిపై, సామర్థ్యంపై ప్రజలకున్న నమ్మకం వల్లే సాధ్యం అవుతోందన్నారు. పర్యావరణ హితంగా ఉండే, తక్కువ వ్యయం అయ్యే ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి సారించామన్నారు.

❖



ఔషధ, సుగంధ మొక్కల పెంపకం

రాష్ట్రంలో ఔషధ, సుగంధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఔషద, సుగంధ మొక్కల బోర్డు అధికారులతో మంత్రులు కామినేని శ్రీనివాస్, బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సమావేశమయ్యారు. సాముహికంగానూ, క్లస్టర్ తరహాలోను ఔషధ న్నా మొక్కలను పెంచే రైతులకు సబ్సీడీలు ఇవ్వనున్నట్లు మంత్రి కామినేని తెలిపారు.

ఔషధ పంటలకు రాయితీలు ఈ క్రింది విధముగా ఇవ్వనున్నట్లు మంత్రి కామినేని తెలిపారు.

ఎకరాకు బోర్డు ఇచ్చే రాయితీ(రూ.)

కలబంద 3400/-	ఆశ్వగంధ 2000/-
పిప్పళ్ళు 5000/-	ఉసిరి 3380/-
అశోక 8125/-	వేప 1950/-
శతావరి 3750/-	నేలవేము 2000/-
దూలగొండి 1600/-	అడవినాభి 27500/-
నేలతంగేడు 2000/-	తులసి 2400/-
సర్పగంధ 9375/-	కొలియస్ 3440/-
మారేడు 5200/-	

పూర్తి వివరాలు www.apmab.gov.in వెబ్ సైట్ మరియు ఫోన్ నెంబర్ 040-27709447 ద్వారా పొందవచ్చును. రాయితీల విషయంలో అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వస్తే సహించేదిలేదని మంత్రి కామినేని హెచ్చరించారు.

ఈ మొక్కలను పెంచి తయారుచేసే మందులను ప్రత్యేక ఫార్మసీ ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు బోర్డు చేపట్టిన కార్యక్రమాలను ఆయూష్ సిఇవో నళిని మోహన్ ఈ సమావేశంలో మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పాల్గొన్న వైద్య, విద్యా స్పెషల్ సి.యస్ ఎల్.వి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఐటిడిఎ పరిధి, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఔషధ మొక్కలను పెంచడానికి తగు ఖాళీ భూముల వివరాలుంటే వాటిపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఔషధ మొక్కల పెంపకం, కార్యచరణ, బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను సమగ్రంగా ప్రభుత్వానికి ఇవ్వాలని ఎల్.వి సుబ్రమణ్యం సూచించారు.

జనవరి 1 నుంచి ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు: కామినేని

ప్రభుత్వ ఆసుపత్రులో రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసిందని మంత్రి కామినేని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 1156 ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో 8 వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. 192 కమ్యూనిటి హెల్త్ సెంటర్స్ లో 23 ల్యాబ్ రేటరి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. 31 ఏరియా, జిల్లా ఆసుపత్రులో 42 ప్రత్యేక పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని మంత్రి కామినేని తెలిపారు.

జిల్లా ఆసుపత్రులలో పనిచేయని సీటీ స్కాన్ ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కామినేని తెలిపారు.



అసైన్డ్ భూముల్లో సాగుకు రుణ సదుపాయం

అసైన్డ్ భూముల్లో సాగుకు రుణ సదుపాయాన్ని కల్పించేందుకు సహకారబ్యాంకులు తగు అవకాశాల్ని పరిశీలించాలని అటవీ, పర్యావరణ, విజ్ఞానశాస్త్ర సాంకేతికవిభాగ మరియు సహకార శాఖల మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆప్కాబ్ అధికారులకు సూచించారు. 1999 నుంచి సహకారబ్యాంకులు అసైన్డ్ భూముల్లో సాగుకు రుణ మంజూరును నిలిపివేశాయి. రుణాలకు ఈ భూముల్ని తాకట్టుపెట్టుకున్నా అవి డి.కె.టి పట్టా భూములు కావడంతో వాటిని రుణ వసూలు కోసం వేలం వేయడానికి నిబంధనలు అనుమతించవు. ఈ కారణంగా ఈ భూముల్ని తాకట్టు పెట్టుకున్నా రుణం వసూలు కాకపోతే నష్టపోతామని సహకారబ్యాంకులు రుణ మంజూరును నిలిపివేశాయి.

అసైన్డ్ భూముల్లో సాగుచేస్తున్న వారంతా సన్నచిన్నకారు రైతులే. పైపెచ్చు అంతా బలహీన వర్గాలకు చెందిన వారే. వారికి నిబంధనలంటూ రుణ సదుపాయాన్ని దూరం చేయడం భావ్యం కాదని మంత్రి అధికారులకు తెలిపారు. పంట రుణాల పద్దు కింద అసైన్డ్ భూముల్లో సాగు రైతులకు లక్షరూపాయల్లోపు రుణాలు మంజూరుకు ఉన్న అవకాశాల్ని కనుగొనాలని సూచించారు. అవసరమైతే నిబంధనలను సడలించో..ఇబ్బంది లేని సవరణలు తీసుకొచ్చో రుణ మంజూరుకు వెసులుబాటు కల్పించే ప్రక్రియకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టికి ఈ అంశాన్ని వెంటనే తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం దృష్టికి తీసుకెళ్లి అక్కడా నిర్ణయాలు తీసుకుందామని అన్నారు. ఎలాగైనా ఈ ఏడాదే ఎకరాకు రూ. 10 వేలు తగ్గకుండా 35,000 మించని రుణాలని తొలివిడత ప్రయోగంగా అయినా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. రుణ వసూళ్లకు ఆయా బ్యాంకు మేనేజర్లకే కచ్చిత బాధ్యతను అప్పగించి సకాలంలో వసూళ్లకు ఏయే పద్ధతులు పాటించాలో కూడా నిర్దిష్ట ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆప్కాబ్ ఎం.డి లక్ష్మి, చీఫ్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వరరావు, సహకారశాఖ రిజిస్ట్రార్ శేషగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- బీరక రవి, మీడియా లైజనింగ్ అధికారి

కోటప్పకొండ

అంతర్జాతీయ స్థాయి వసతుల కల్పనపై డాక్టర్ కోడెల దృష్టి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటప్పకొండ అభివృద్ధిపై శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నిరంతర సమీక్షలతో ఈ శైవక్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు తపన పడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వివిధ విభాగాలతో సమన్వయం సాధిస్తూ నిధుల కొరత లేకుండా చూస్తున్న సభాపతి, టూరిజం శాఖతో పాటు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. కేవలం ప్రభుత్వనిధులతోనే కాక, వదాన్యులు, కార్పొరేట్ సంస్థల నుండి సైతం నిధులు సమీకరించాలని తపన పడుతున్న సభాపతి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు.

ఈ భేటీలో పర్యాటక సంస్థ ఆర్కిటెక్చర్ విభాగానికి అధికారిక కన్సల్‌టెంట్‌గా ఉన్న సత్యన్నారాయణ, కోకాకోలా కంపెనీ ఆంధ్రా, తెలంగాణ జోనల్ హెడ్ పార్థసారధి పాల్గొనగా సభాపతి కోటప్ప కొండ అభివృద్ధిపై తనకున్న ఆలోచనలను వీరికి వివరించారు. ఆధునిక హంగులతో ఏకో టూరిజం ప్రాజెక్టుగా కోటప్పకొండను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రత్యేకించి పర్యాటక శాఖ రూ. 2.5 కోట్ల నిధులను ఇక్కడ వ్యయం చేయనున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పెరిగే భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కోటప్పకొండకు రోప్ వే, రెండు లాంచింగ్ స్టేషన్లు నిర్మించాల్సి ఉందని సభాపతి కోడెల చెప్పారు. పర్యాటకుల సౌకర్యాల కేంద్రాన్ని, ఏకో టూరిజం రిసార్ట్సును నిర్మించాలని, ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు పిల్లల ఆట స్థలం, టాయ్ ట్రైన్, అక్వేరియం వంటివి ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉండాలని సభాపతి టూరిజం కార్పొరేషన్ ఆర్కిటెక్ట్‌కు వివరించారు.

యాంపీ థియేటర్, సౌండ్ అండ్ లైట్ షో, పక్షుల ఉద్యానవనం, వ్యూ పాయింట్ వంటి వాటిని తీర్చిదిద్దడం ద్వారా ఈ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, ఆహ్లాదకర కేంద్రంగా మలచవచ్చన్నారు. కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తెరిగి వ్యవహరించాలని ఈ సందర్భంగా సభాపతి సూచించారు. అంతర్జాతీయ శీతల పానీయాల సంస్థ కోకాకోలా తెలుగు రాష్ట్రాల ప్రతినిధి పార్థసారథిని కోటప్పకొండ క్షేత్ర అభివృద్ధికి నిధులు సమకూర్చాలని కోరారు. వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి నిధులు పరంగా ఈ క్షేత్ర అభివృద్ధికి సహాయం అందుతుందని, ఈ క్రమంలోనే కార్పొరేట్ సంస్థలు కూడా సహకరిస్తే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించగలుగుతామన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ తమ వంతు సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే సంస్థ ఉన్నతాధికారుల తుది ఆమోదానికి లోబడి తమ నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. పర్యాటక సంస్థ ఆర్కిటెక్ట్ సత్యన్నారాయణ మాట్లాడుతూ వెంటనే తమ పని ప్రారంభిస్తామని, సాధ్యమైనంత త్వరగా ఏది ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.

– బొప్పన రవి, మీడియా లైజన్ అధికారి

టెక్నాలజీతో పరిపాలన తేలిక

ఐటి రంగంలో ఈ – ప్రగతి భారత దేశాన్ని ప్రభావితం చేయగల ప్రాజెక్టు కాబోతోందని, ఈ ప్రాజెక్టు అమలులో దిగ్గజ కంపెనీలతో పాటు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావల్సి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నం నొవొటెల్ హోటల్లో ఈ –ప్రగతి ప్రాజెక్టును లాంచనంగా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తియితే ఒక కమర్షియల్ ప్రాజెక్టుగా మారుతుందని, దానిని ఇతర దేశాలకు కూడా అందుబాటులోకి తీసుకురావచ్చని ముఖ్యమంత్రి అభిలాషించారు. ఈ ప్రాజెక్టును 24 నెలలలోపు పూర్తి చేయాల్సిందిగా ఐటి సలహాదారులను ఆదేశించామని అన్నారు. ఇక్కడ నిధుల కొరత లేదని అన్ని సెక్టార్లలో ఐటి అప్లికేషన్స్ ను పూర్తి స్థాయిలో అమలు చేయుటకు ఈ ప్రగతి ముఖ్య ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి చెప్పారు.


మాగ్జిమం గవర్నెన్స్

మినిమమ్ గవర్నమెంటు ద్వారా మాగ్జిమం గవర్నెన్స్ అందించటమే మా ప్రధాన లక్ష్యమని అయితే గత ప్రభుత్వాల కాలంలో మాగ్జిమం గవర్నమెంటు ద్వారా మినిమమ్ గవర్నెన్స్ అందించారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు.

ఈ–ప్రగతి ద్వారా 774 సేవలు

33 శాఖల ద్వారా 774 సేవలను అందించే ఈ–ప్రగతి ప్రాజెక్టుకు 2,398 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని, దీని ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరుగుతుందని, అన్ని రంగాలలో ఉత్పాదకత పెంచుకోవడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత ఉన్నతంగా పెరుగుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాదిలో ఈ–ప్రగతి ఉధృతమైన నాలుగు ప్రధాన కార్యక్రమాల ద్వారా తన ఉనికి చాటుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పౌర సరఫరాలు, పింఛన్లు, మీ–ఇంటికి మీ–భూమి వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో టెక్నాలజీని అనుసంధానం చేయటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని, మీ–ఇంటికి మీ–భూమి ద్వారా 64 సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు.

జాతి సంపదలో మన వాటా లేదా?



అది ఎనలేని సాంస్కృతిక సంపద, తరతరాల వారసత్వ సంపత్తు. అది అమూల్యం... దాని విలువ అనంతం. అది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని కళాసంపద. జాతి ఉమ్మడిగా సముపార్జించుకున్న ఆ సొత్తుని తెలంగాణా ప్రభుత్వం హక్కుభుక్తం చేసుకోవడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రతిఘటిస్తోంది. ఆ అక్రమాన్ని ఎదిరిస్తూ, విభజన చట్ట ప్రకారం న్యాయమైన వాటా కోరుతూ హైకోర్టులో ధర్మ పోరాటానికి సిద్ధమయ్యింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పడిన 142 సంస్థల్ని పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్ -10 కింద పెట్టింది. అవి ఉభయ రాష్ట్రాల ఉమ్మడి ఆస్తి. కానీ, భౌగోళికంగా తెలంగాణ (హైదరాబాద్) లో ఉన్న కారణంగా వాటిని ఆ ప్రభుత్వం సొంతం చేసుకుంటుంది. హైదరాబాద్ లో ఉన్న అన్ని షెడ్యూల్ 10 సంస్థలను స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాలు కూడా జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వ దృష్టి తాజాగా సోకిన సంస్థ- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. ఈ విషయంలో న్యాయపోరాటం ఆరంభించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తాజాగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వాటా ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆస్తులు, మేధోసంపత్తికి చెందిన సంపదను విభజించే ప్రసక్తే లేదని తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి పంపిన చర్యలను (ప్రొసీడింగ్స్ ను) సవాలు చేస్తూ ఏపీ సర్కారు ఈ వ్యాజ్యం వేసింది. తెలంగాణ సర్కారు గత ఆగస్టు 7న తమకు పంపిన ప్రొసీడింగ్స్.. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ, ఏపీ తరఫున రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సుమితా దావ్ర ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

ఎన్టీఆర్ మానస పుత్రిక

తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, కళలు, సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తి కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) స్థాపించిన కళల కాణాచి- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగువారికే కాకుండా, యావత్ ప్రపంచంలోని తెలుగువారందరికీ సేవలందించాలని ఎంతో దూరదృష్టితో ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారాయన. దాని ఫలితంగా, ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉండే తెలుగు వారికి సేవలందించే 'అంతర్జాతీయ తెలుగు కేంద్రం' హైదరాబాద్ నుంచి పనిచేస్తోంది.

ఇజ్రాయిల్‌లోని హిబ్రూ విశ్వవిద్యాలయం, అమెరికా కాలిఫోర్నియాలోని బర్కిలీ విశ్వవిద్యాలయాల్లో ఈ కేంద్రం ద్వారా పీఠాలు ఏర్పడ్డాయి.

అమెరికాలోని సిలికానాంధ్ర, తానా వంటి సంస్థలు, మలేషియాలోని మలేషియా తెలుగు సంఘం అక్కడి తెలుగు వారికి నిర్వహిస్తున్న తెలుగు భాషా బోధనకు అఫిలియేషన్ ఇవ్వడం, పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేయడం, పాఠ్యపుస్తకాలు తయారుచేసి అందించడం వంటి సేవలను అందిస్తోంది.

రాష్ట్రేతర ప్రాంతాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక, గుజరాత్‌లలో స్థాపించిన ఆరు తెలుగు పీఠాల ద్వారా తెలుగు బోధన, పరిశోధన నిర్వహిస్తోంది. అంతే కాకుండా, తెలుగు వారు ఎక్కువగా నివసిస్తున్న ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం, న్యూఢిల్లీ, అండమాన్ నికోబార్ దీవులు వంటి రాష్ట్రాలలో వివిధ స్థాయిలలో తెలుగు బోధనతో పాటు వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలను తయారుచేయడం, పాఠ్యపుస్తకాలను సరఫరా చేయడం, ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులకు స్వల్పకాలిక తెలుగు శిక్షణ శిబిరాలు నిర్వహించడం వంటి సేవలను కూడా ఈ కేంద్రం ద్వారా అందించడం జరుగుతోంది.

తెలుగుజాతి సంపదలో మన వాటాలేదా?

తెలుగుజాతి అపార సంపదైన తాళపత్ర గ్రంథాలు, అపురూపమైన గ్రంథాలు, కళాఖండాలు (పెయింటింగ్స్) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉన్నాయి. ఉమ్మడిగా ఏర్పరచుకున్న ఈ సంపద మొత్తం మాదేనని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం లాగేసుకోవడానికి తెగబడటమే ఆంధ్రప్రదేశ్ వ్యాజ్యానికి కారణం. వీటిని కాపాడుకొని, అందులో మన వాటా దక్కించుకొని రాబోయే తరాలకు అందించాలన్న సంకల్పమే ఆ వ్యాజ్యానికి మూలం.

గ్రంథాల భాండారం

తెలుగు విశ్వవిద్యాలయంలో ఉన్న తాళపత్ర, ముద్రిత గ్రంథాలు చాలా అపురూపమైనవి. సామవేదం, విద్యారణ్య వేదాంత గ్రంథం, ఉపనిషత్తులు, జ్యోతిష్యం మొదలైన అపురూప తాళపత్ర గ్రంథాలూ, తాతంభట్టు సులక్షణసారం, చిలుకూరి నారాయణరావుగారి ప్రాచీన విద్యాపీఠాలు, కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సార సంగ్రహం, పాల్కురికి సోమనాథుని చెన్నమల్లు సీసములు, బమ్మెర పోతన భోగినీ దండకం, ఏనుగు వీరాస్వామి కాశీయాత్రా చరిత్ర, పురిపండ అప్పలస్వామి మహాభారతం, మహాభాగవతం, అమరకోశం వంటి

ప్రసిద్ధి పొందిన గ్రంథాలు ఇక్కడ ఉన్నాయి. మెకంజీ కైఫీయత్తులు, ప్రాచీన పత్రికలైన కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, భారతి వంటి అమూల్యమైన ప్రాచీన పత్రికల మైక్రోఫిల్మ్ కాపీలు కూడా ఉన్నాయి. ఇక్కడ గ్రంథాలయంలో సుమారు 85,000 పుస్తకాలు ఉన్నాయి. పూర్వపు అంతర్జాతీయ తెలుగు సంస్థ, సంగీత, సాహిత్య, నాటక అకాడమీలు సేకరించి, ముద్రించిన అపురూపమైన గ్రంథాలన్నింటినీ ఈ గ్రంథాలయంలో భద్రపరిచారు. అదేవిధంగా ప్రముఖ రచయితలు, సాహితీవేత్తలు వారి తదనంతరం వారి గ్రంథాలన్నింటినీ తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి కానుకగా ఇచ్చారు. ఆ విధంగా అరుదైన గ్రంథాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి.

గొప్ప కళాఖండాలు (పెయింటింగ్స్)

పూర్వపు సంగీత నాటక అకాడమీలు, అంతర్జాతీయ తెలుగు సంస్థ, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వేయించిన తైలవర్ణ చిత్రాలు, చిన్నవి పెద్దవి అన్నీ కలిపి 1198 ఉన్నాయి. నేడు వీటి విలువ లక్షల్లోనే ఉంటుంది. పి.టి. రెడ్డి, ఎం.ఎస్.మూర్తి, సి.వి.ఆర్. చౌదరి, శేషగిరిరావు, జనార్దనరావు, ఎం.ఎస్. దాతార్, ఎ.ఆర్. కృష్ణ, ఎం. కృష్ణమూర్తి, వేలూరి రాధాకృష్ణ, బి.ఎ. రెడ్డి, ఎ. పైడిరాజు, సి. ప్రసాదరావు, సి.ఎస్.ఎన్. పట్నాయక్, మధుసూదన్ రావు, పి.ఆర్. రాజు వంటి మహనీయులు వేసిన తైలవర్ణ చిత్రాలు చాలా ఉన్నాయి. వీటన్నింటినీ రక్షించుకొని రాబోయే తరాలకు అందజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అపురూపమైన ప్రచురణలు

పూర్వపు సాహిత్య అకాడమీ వెలువరించిన వెలకట్టలేని ఎన్నో గ్రంథాలు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సంక్రమించాయి. వాటిల్లో కొన్నింటిని మాత్రమే విశ్వవిద్యాలయం ప్రచురించడమైంది. అలాంటి గ్రంథాలన్నింటి కాపీరైటు తెలంగాణ ప్రభుత్వానికే చెందటం అన్యాయం. దీనివల్ల, తెలుగు వాఙ్మయం, సాహిత్యచరిత్ర అభ్యాసానికి అవసరమైన అకార గ్రంథాలన్నీ నష్టపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే సాహిత్య అకాడమీ, విశ్వవిద్యాలయం వృత్తి పదకోశాలను తయారుచేసి ముద్రించడం జరిగింది. ఇందులోని సమాచారం చాలా విలువైనది. ఆ పదాలను డిజిటలైజేషన్ చేయవలసిన అవసరం కూడా ఉంది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న తెలుగువారి భాష, సాహిత్య, సాంస్కృతిక సంపదను సంరక్షించుకొని ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు విద్యార్థులకు, పరిశోధకులకు, సాహిత్యాభిలాషులకు, రాష్ట్రేతరాంధ్రులకు, విదేశాంధ్రులకు అందజేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

❖

రాజధాని అభివృద్ధిలో జపాన్ సహకారం

పారిశ్రామిక నగరాల రూపకల్పన

జపాన్-ఏపీ పరస్పర సంబంధాల మజిలీలో మలి అడుగు పడింది. ప్రజారాజధాని అమరావతి నగర నిర్మాణంలో జపాన్ భాగస్వామిగా మారింది. ఇదేగాక, అర్బన్ డెవలప్‌మెంట్, కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి, సూపర్ పవర్ థర్మల్, అగ్రికల్చరల్ టెక్నాలజీ వంటి రంగాలలో జపాన్ మనతో కలిసి పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. రాజధాని అభివృద్ధి, పారిశ్రామిక సహకారంపై జపాన్ మినిస్ట్రీ ఆఫ్ ఎకానమీ-ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (మేటి), ఏపీ ప్రభుత్వాల మధ్య విజయవాడ హోటల్ గేట్‌వేలో ఎంవోసీ (మెమొరాండమ్ ఆఫ్ కో-ఆపరేషన్) జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జపాన్ 'మేటీ' మంత్రి యొసుకే టకాగి పాల్గొని ఎంవోసీపై సంతకాలు చేశారు. అలాగే, రాజధాని నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధిపై ఏపీ ఆర్థిక శాఖ, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ మధ్య ఎంవోయూ జరిగింది. దీనిపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్, జపాన్ బ్యాంక్ (జేబీఐసీ) సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ డిపార్టుమెంట్ డైరెక్టర్ జనరల్ నోరికో నసు సంతకాలు చేశారు.

గతంలో తన జపాన్ పర్యటన సందర్భంగా ఆయా అంశాలపై కుదిరిన ప్రాథమిక ఒప్పందాలు ఇప్పుడు వాస్తవ రూపం దాల్చాయని ముఖ్యమంత్రి చెప్పారు. జపాన్ సాంకేతికంగా, ఆర్థికంగా, పాలనాపరంగా ఎంతో సుసంపన్నమైన దేశమని, ఆంధ్రప్రదేశ్‌కు అన్నివిధాలుగా సహకారం అందించేందుకు ప్రధాని అబే ఎంతో ఆసక్తి చూపించారని సీయం గుర్తుచేశారు. ఎంతో శుభప్రదమైన విజయదశమి రోజున ఈ ఒప్పందాలు చేసుకోవడం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు. జపాన్-భారత్ సంబంధాలలో ఇది మేలిమలుపుగా అభివర్ణించారు. అమరావతి శంకుస్థాపన కార్యక్రమం కోసం వచ్చిన జపాన్ జైకా, జెట్రో, నెడో, జేబీఐసీ, ఎంఎల్ఐటీ, ఎంఏఎఫ్ఎఫ్ బృందాలను చంద్రబాబు అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈరోజు 'బిగ్‌డే' అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. తూర్పుతీరానికి త్వరలో ఏపీ ముఖద్వారంగా మారనుందని జపాన్ 'మేటీ' మంత్రి యొసుకే టకాగి జోస్యం చెప్పారు. వ్యక్తిగతంగా తనకు చంద్రబాబు నాయుడు మంచి మిత్రుడని అన్నారు.

రాజధాని అభివృద్ధిలో జపాన్ భాగస్వామ్యం

రాజధాని ప్రాంతంలో రవాణా మౌలిక సదుపాయాల కల్పనలో మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేయడానికి జపాన్ ముందుకొచ్చింది. దీనికి సంబంధించిన సాంకేతిక సహకారాన్ని జైకా అందిస్తుంది. భవిష్యత్తులో పరస్పర సహకార పద్ధతిలో విజయవాడ మెట్రో రైలు సహా పలు మెట్రో ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తారు. రాజధాని ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి కూడా జపాన్ సహకారం అందిస్తుంది. పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయడం, మౌలిక సదుపాయాల కల్పన, ఇంటలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఐటీఎస్), కాంప్రహెన్సివ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తదితర రంగాలలో తోడ్పాటునందిస్తుంది.

కృష్ణపట్నం పోర్టు అభివృద్ధిలో కూడా జపాన్ సహకారం అందిస్తుంది. చెన్నయ్-బెంగుళూరు పారిశ్రామిక క్యారిడార్ అభివృద్ధిలో పాలు పంచుకుంటుంది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, సమృద్ధిగా నీరు, విశాలమైన రహదారుల నిర్మాణం వంటి అంశాలలో వేగవంతమైన అభివృద్ధి కోసం 'జైకా' సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. పోర్టుల అభివృద్ధి, ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటులో ప్రయివేటు భాగస్వాములతో కలిసి జపాన్ ఎంఎల్ఐటీ, మేటీ పనిచేయనున్నాయి. అంతేగాక, ఓడరేవుల అభివృద్ధికి సంబంధించిన వ్యూహరచనకు ఎంఎల్ఐటీ మన రాష్ట్రప్రభుత్వానికి సహకారం అందిస్తుంది. జపాన్ వ్యవసాయ విధానాల రూపకల్పనలో సహాయపడిన 'ఎంఎఎఫ్ఎఫ్' ఇతర జపాన్ ప్రభుత్వ ఏజన్సీలతో కలిసి పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల సమీకరణకు సహకరిస్తుంది. ఇందులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ చెయిన్స్ ఏర్పాటుచేసి వ్యవసాయంరంగానికి తోడ్పాటునిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో అల్ట్రా సూపర్ క్రిటికల్ కోల్ ఫైర్డ్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటుకు అవకాశాలపై అధ్యయనం చేయడానికి 'నెడో' రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుంది. అలాగే, గత ఏడాది నవంబరు నెలలో జరిగిన ఒప్పందాలకు అనుగుణంగా స్మార్ట్ కమ్యూనిటీ, పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం, ఇంధన నిల్వ తదితర అంశాలలో జపనీస్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఉపయోగించుకుని ముందుకు సాగాలని నిర్ణయించారు. 'ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టిమెంట్ టాస్క్ ఫోర్స్ ఇన్ జపాన్' (ఏపీఐటీ) పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందులో ఇరు ప్రభుత్వాల సంబంధిత మంత్రులు, అధికారులు, శాఖలు, సంస్థలు వుంటాయి.

❖



డా పి.కె. జయలక్ష్మి

స్మార్ట్ వైఫ్

డా పి.కె. జయలక్ష్మి

హెడ్ ఫోన్స్ పెట్టుకుని నాకిష్టమైన పాటల్ని ఎంజాయ్ చేస్తూ కంప్యూటర్ ముందు కూచుని చక చకా డేటా ట్రాన్స్ఫర్ చేసేస్తున్నా. నేనెప్పుడూ పనితో పాటు కాస్త రిలాక్సేషన్ ఉండాలనుకుంటా. దాంతో పని శ్రమ తెలియదు. సకాలానికి, పర్ఫెక్ట్ గా కూడా అయిపోతుంది. ఇంట్లో కూడా అంతే. స్వాబింగ్ చేస్తూ డాన్స్ చేస్తాను. పాటలు వింటూ వంట, ఏరోబిక్స్ చేస్తూ టి.వి చూస్తా. మధ్యలో ఇంకేదైనా తగిలినా విసుక్కోకుండా ఆ పన్లు చక్కబెట్టేస్తూ ఉంటా. చేసే పని ఏదైనా, నచ్చని పని అయినా సరే ఇష్టంగా సక్రమంగా, సకాలంలో చేయడం నా సుగుణం. నా ఫేవరెట్ సాంగ్ "జోరు మీదున్నావు తుమ్మెదా" అవుతూనే "ఎటో వెళ్లిపోయింది మనసూ"మొదలవగానే కిరీటి గుర్తొచ్చాడు. అంటే మా ఆయన! తనకీ పాట అంటే పిచ్చి. రోజుకోసారయినా వినాల్సిందే. మా ఇద్దరి అభిరుచులూ ఇంచుమించు ఒకలాగే ఉన్నా కొన్నిట్లో విపరీతమైన వ్యత్యాసం.

"హేకాంతీ! వాట్సప్?" నా ఛాంబర్ దగ్గరకొచ్చి గ్లాస్ విండో లోంచి కళ్ళు చికిలిస్తూ పలకరిస్తున్న కొలీగ్ జాన్కి చెయ్యి ఊపాను "ఫైన్ అంటూ. "మిసెస్ కిరీటీ వాట్ హేపెండ్ టు దట్ ఫైల్ విచ్ ఈస్ టు బి సబ్మిటెడ్ టుడే" మా టీం లీడర్ డేవిడ్ థామ్సన్ ఇంటర్ కమ్‌లో అడుగుతుంటే "ఇట్స్ రెడీ మిస్టర్ డేవిడ్. ఐ విల్ కంటిన్యూ జస్ట్ 5 మినిట్స్" అనగానే "వావ్ దట్స్ గుడ్ , యూ ఆర్ వెరీ స్వీట్ " సంతోష పడిపోయాడు. ఇక్కడ నాకు నచ్చే విషయం ఇదే. వాళ్ళొంచి పని చేస్తే గుర్తింపు, ప్రశంస, తగిన ప్రతిఫలం అన్నీ ఉంటాయి.. చాలా కంఫర్టబుల్ లైఫ్. కష్టపడి పనిచేస్తే నెత్తిన పెట్టుకుంటారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ కి విలువిచ్చే సంస్కృతి వీళ్లది. అందరూ పని చేయాల్సిందే. కష్టపడితేనే డబ్బులొచ్చేది. అదే విజయ రహస్యం.

ఇండియా నించి ఉద్యోగవేటలో చికాగో వచ్చి ఈ ఫర్మ్ లో చేరి 3 ఏళ్లయింది . కిరీటి యూనివర్సిటీ లో ప్రొఫెసర్‌గా ఉన్నాడు. ఇద్దరం వారమంతా పరుగులు తీసినా వీకెండ్స్‌లో హాయిగా కావాల్సినవి తింటూ, కోరుకున్నవి కొంటూ, చూడాలనుకున్న ప్లేసులు చూస్తూ, నచ్చినట్టు ఎంజాయ్ చేస్తూ రీఛార్జ్ అవుతూ ఉంటాం. ఏ మాటకామాటే చెప్పుకోవాలి


విశాఖపట్నం సెయింట్ జోసఫ్ మహిళాకళాశాలలో హిందీ విభాగాధ్యక్షులుగా పనిచేస్తున్న డా పి కె జయలక్ష్మి తెలుగు, హిందీ ఉభయభాషల్లో రచనలు చేస్తారు. వీరి రచనలు అన్ని ప్రముఖ పత్రికల్లో అచ్చయ్యాయి. 'మనస్విని' అనే తెలుగు కథా సంపుటి, 'సప్తక్ త్రయ్ మే' అనే హిందీ పరిశోధన గ్రంధం రచించారు.

ఇక్కడికొచ్చిన ఎవరూ అసంతృప్తికి లోనవరు. జాబ్ సాటిస్ఫేక్షన్, జేబ్ సాటిస్ఫేక్షన్ రెండూ దొరకడంతో ఇద్దరం కార్లు తీసుకున్నాం. ఇండియాలో కార్ తీయడానికి ధైర్యం చేయలేని నేను ఇక్కడికి రాగానే అవలీలగా డ్రైవ్ చేసేయడం నాకే ఆశ్చర్యం.

ఇండియా వదిలి మూడేళ్లయినా కిరీటికి చాదస్తం , అతి జాగ్రత్త మాత్రం తగ్గలేదు. బైటకి వెళ్తుంటే గేస్, స్విచ్చులు, కొళాయిలు సరిగ్గా కట్టామో లేదో, ఫ్రిజ్ డోర్ పడిందో లేదో, తలుపులు తాళాలు వేశామో లేదో పదేపదే చెక్ చేయడం, ఒకటే జాగ్రత్తలు చెప్తూ ఉండడం చిరాగ్గా అనిపిస్తాయి నాకు. నేను తనకి పూర్తిగా ఆపోజిట్. హేండ్ బ్యాగ్ కి జిప్ వెయ్యడం కూడా బద్ధకమే. బీరువాకి తాళం వేయడం, ఇంట్లో ఉన్నప్పుడయితే మెయిన్ డోర్ వెయ్యడం కూడా ఇష్టముండదు నాకు. తను వెనకాలే చెప్తూ ఉండడం ఇంకా చిర్రెత్తుతుంది. కారణమేంటంటే నాకు పనులన్నీ ఫాస్ట్‌గా అయిపోవాలి. దానికి తోడు సమయానికి వస్తువులు కనిపించకపోతే పిచ్చెక్కి పోతాను. దేని కోసమైనా బీరువా తాళం వెతుక్కుని, తీసి మళ్ళీ లాక్ చేసి అలాగే హేండ్‌బ్యాగ్ జిప్ తీసి మళ్ళీ వేసే కన్నా, అవి ఎప్పుడూ అందుబాటులో ఓపెన్‌గా ఉంటే అట్టే శ్రమ ఉండదు కదా అన్నది నా థియరీ. అదే నచ్చదు కిరీటికి. అలాగే పనులన్నీ తాత్సారం చేయకుండా ఫాస్ట్‌గా, చక్కగా చేసేయడం నాకు చాలా ఇష్టం. అందుకే మా ఫ్రెండ్స్ కిరీటితో "యూ హావ్ స్మార్ట్ వైఫ్" అని కితాబులిస్తుంటారు. కానీ తను మాత్రం మెచ్చుకోడు.

"అంత పడీపడీ ఒకేసారి అన్నేసి పన్లు త్వరగా పూర్తిచేయాలనుకుంటావు. ఆ గాబరాలో ముఖ్యమైన విషయాలు మాత్రం ఇట్టే మర్చిపోతావు. రోజూ వాడే వస్తువులు సైతం ఎక్కడ పెట్టావో కూడా గుర్తుండదు ఇదేనేంటి స్మార్ట్ నెస్" అని దెప్పుతాడు.

"హే హేకాంతీ!! టైమ్ అప్. డోంట్ యూ గో హోమ్" కన్ను కొడుతున్నట్టు రెప్ప ఆర్పుతూ అడిగింది పక్క సీట్ హెలెన్. వాచ్ చూస్తే 7 అయింది. 'మై గుడ్‌నెస్ ఆలోచనల్లో పడి చాలా పనే కంప్లీట్ చేసానే, పోన్లే, రేపు కాస్త తక్కువ చేద్దాం,' అనుకుంటూ అద్దాల కిటికీలోంచి దూరంగా కనిపిస్తున్న అందమైన మిచిగన్ లేక్‌ని చూస్తూ లేచాను. దార్లో మాల్‌కి వెళ్ళి కొనాల్సిన లిస్ట్ చదువుతూ లిఫ్ట్ దగ్గరకి నడిచాను. "హే కాంతీ.. వాట్స్ యువర్ ప్లాన్ ఫర్ వీకెండ్?" మెక్సికన్ కొలీగ్ పలకరించింది నవ్వుతూ. "నథింగ్ ఫర్ దిస్ వీక్, లాస్ట్ వీక్ వి హాడ్ బీన్ టు ఫ్లోరిడా యూ నో. ఓకే., సీ యూ డియర్. హేపీ వీకెండ్ అంటూ పార్కింగ్ దగ్గరికొచ్చానో లేదో గుండె గుభేల్. నా కార్ లేదక్కడ. అదేంటి పొద్దున్న ఇక్కడే పార్క్ చేసానే. కీస్ కోసం బ్యాగ్ తడిమా. లేవు. మళ్ళీ రూమ్ లోకి పరిగెత్తా. ఫైల్స్ లోనూ, టేబిల్ పైన, సిస్టమ్ దగ్గర మొత్తం వెతికా. ఎక్కడా లేవు. గాబరా , టెన్షన్ పెరిగిపోతోంటే సడన్‌గా జ్ఞాపకమొచ్చింది కీస్ ఇగ్నిషన్‌కే వదిలేస్తానన్న సంగతి. మైండ్ బ్లాంక్ అయిపోతున్న ఫీలింగ్. అంత కంగారులోనూ "కార్



లో కీస్ అలా వదలకు, ఎవడైనా చాలా సునాయాసంగా దొంగిలించేస్తారు చూస్కో. ఏదైనా మన చేతుల్లో ఉన్నంత వరకే మనది. పోయాక ఏడ్చే కంటే ముందే జాగ్రత్త పడడం తెలివైన వాళ్ళ లక్షణం" అనే కిరీటి మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చాయి.

అయినా సరే ఓటమి ని అంత తేలిగ్గా ఒప్పుకునే సగటు భారతీయ పిరికి మహిళని కాదుగా నేను. కిందపడ్డా పైనే అని నిరూపించుకోవాలని తహతహ లాడే గడసరి విదేశీ వనితల సహపంక్తిలో కూచున్నదాన్నాయే. మొండి ధైర్యంతో ఒక నిర్ణయానికి వచ్చి పోలీసులకి వెంటనే ఫోన్ చేసి ఆఫీస్‌లో పార్క్ చేసిన కార్ పోయిన వైనం వివరించి, కార్ ఏ కంపెనీదో చెప్తూ నంబర్, రంగు మొదలైన ఆనవాళ్లతో పాటు తాళాలు ఇగ్నిషన్ కే వదిలేసిన సంగతి చెప్పడం మాత్రం మర్చిపోలేదు. నా తప్పిదం కూడా చెప్పాలి కదా మరి. వాళ్ళు వెంటనే స్పందించి ఆఫీస్‌కి వచ్చి అంతా పరిశీలించి పాయింట్స్ నోట్ చేస్కోని వెళ్లారు.

టైమ్ 8 దాటుతోంది. ఆకలి వేస్తోంటే ఎదురుగా "బర్గర్ కింగ్" లోకి నడిచి శాండ్ విచ్, కోల్డ్ కాఫీ ఆర్డర్ చేసి ఆలోచనల్లో పడ్డా. ఏంటిలా జరిగింది? ఎలా వదిలేసినా ఎప్పుడూ ఏవీ పోగొట్టుకోని నాకు ఇంత పెద్ద దెబ్బ ఒక్కసారిగా. ఎంతో ముచ్చట పడి రెండేళ్ల పాటు కూడబెట్టి నలభైవేల డాలర్స్ పోసి కొనుక్కున్న టమాటో కలర్ మెర్సిడిస్ బెంజ్ కార్ చేతులారా దొంగ చేతిలో పెట్టాను. సేఫెస్ట్ ప్లేస్ అని కార్ పార్కింగ్‌లో పెట్టాక కీస్ ఇగ్నిషన్ కే వదిలేసిన నా అహంకారం మీద నాకు మొదటిసారిగా అసహ్యం వేసింది.

సెక్యూరిటీ ఉంటాడు. ఈ దేశంలో దేనికి భయపడాల్సిన పని లేదు అన్న నా నమ్మకం ఇవాళ పూర్తిగా వమ్ము అయింది. కిరీటి అతి చాదస్తంతో తెగ విసిగిస్తూ ఉంటాడని . వెనకాలే తిరుగుతూ 'తాళాలు వేశావా', 'బాగ్ జిప్ వెయ్ ముందు', 'డబ్బు జాగ్రత్త' అంటూ చెప్పిందే చెప్తూ నస పెడుతున్నాడని మనసులో తిట్టుకునేదాన్ని. కిరీటి థియరీయే కరెక్ట్. ఏదైనా మన దగ్గర ఉన్నంతవరకే జాగ్రత్త. మనిషయినా, వస్తువైనా! చేజార్చుకున్నాక వగచి ప్రయోజనం లేదు. అన్యమనస్కంగా కాఫీ తాగి యదాలాపంగా సెల్ చూస్తే కిరీటివి 3 మిస్ కాల్స్ ఉన్నాయి.అమ్మో ఎందుకు చేశాడో ఏంటో? కార్ విషయం తనకి తెలియాలి కదా ఎప్పటికయినా అనుకుంటూ కిరీటికి ఫోన్ చేశా. " హాయ్ స్వీట్ హార్ట్ !హౌ వజ్ ద డే?" అడిగా ముందు. కీలకమైన, క్లిష్టతరమైన సమయాల్లో తనని అలాగే సంబోధిస్తా. అందుకే వెంటనే అడిగాడు. " ఏం ఫోన్ తీయలేదు? ఎక్కడున్నావ్?" అని. జరిగింది గుక్క తిప్పుకోకుండా చెప్పేసి , "నీ మాటలు కొట్టి పారేసినందుకు నాకు బాగా అయ్యింది కిరీటీ" వేదనగా చెప్తోంటే .. ఒక్క నిమిషం మౌనం అవతల. నా గుండె సవ్వడి నాకే వినిపిస్తోంది. పెట్టేశాడా ఫోన్? అర్థం కాలేదు.

"యూ ఇడియట్" తిట్టాడు చిరాగ్గా. నాకు ఇది సరిపోదు, ఇంకా తగలాలి అనుకుంటూ ఉండగానే " అందుకే అన్ని పన్లు ఒక్కసారే చెయ్యద్దు అంటాను. నువ్వేం చేస్తున్నావో నీకే తెలియట్లేదు" అన్నాడు కోపంగా. "రియల్లీ సారీ డియర్. పోలీస్ కంప్లైంట్ ఇచ్చాలే. వాళ్ళు ట్రేస్ చేస్తామన్నారు. కంగారు పడ......"మాట పూర్తికాకుండానే "నీ తెలివి తెల్లారినట్టే ఉంది. నా కారు ట్రబులిస్తోందని ఇవాళ నిన్ను ఆఫీస్ దగ్గర డ్రాప్ చేసి నీ కారులో యూనివర్సిటీకి వచ్చా. ఎలా మర్చిపోయావ్ అసలు?" గట్టిగా అరిచాడు. మనసు పురివిప్పిన మయూరమైంది ఆ క్షణం. అత్యుత్సాహంగా "ఓ థేంక్యూ, థేంక్యూ స్వీట్ హార్ట్! రియల్లీ యూ ఆర్ ఆసమ్. అసలు గుర్తే లేదు నాకు. రోజూ నేనొక్కదాన్నే రావడం అలవాటు కదా. నువ్వు చెప్తోంటే ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. యస్, యూ ఆర్ రైట్ . నువ్వే డ్రాప్ చేసి వెళ్లావ్. సర్లే. ఇంతకీ ఎక్కడున్నావ్? నీ పని అయిపోగానే మా ఆఫీస్ దగ్గరకొస్తావా. ఇద్దరం కలిసి దార్లో డిన్నర్ చేసి ఇంటికెళ్లిపోవచ్చు" తేలిక పడ్డ మనసుతో గారాలు పోయాను. "అప్పుడే ఎక్కడా? ఈ పోలీసులు ముందు కన్విన్స్ అవ్వాలిగా నేను నీ కారు దొంగతనం చేయలేదని. అంత త్వరగా వదుల్తారనుకుంటున్నావా మహాతల్లీ? నువ్వు చేసిన నిర్వాకం చిన్నపాటిదా ఏంటి? పోలీస్ స్టేషన్‌లో గంట నించీ పాట్లు పడ్తున్న కిరీటి మొహం గుర్తు వచ్చేసరికి 'అయ్యో పాపం' అని నాలిక్కరుచుకుని అటుగా వెళ్తున్న కాబ్‌ని పిలిచి ఎక్కి కూచుని పోలీస్ స్టేషన్ అడ్రెస్ చెప్పి పోనిమ్మన్నాను.

❖



అమరావతి గీతం



అదిగదిగో! అల్లదిగో!! అమరావతీ!!!
సీమాంధ్రకు సాటిలేని మేటి బహుమతి!
నగరాలకే మహారాణి, నవ్యాంధ్రకు రాజధాని!
కృష్ణవేణి ముంగిటిలో నవరత్నపు రంగవల్లి!
అపూర్వ బహుమతి! అమూల్య బహుమతి!
అమరావతి! అమరావతి!! అమరావతి!!

సనాతనపు సంస్కృతి, అధునాతన పురోగతి
అందమైన ప్రకృతి, అద్భుతాల కళాకృతి
తెలుగు జాతి వెలుగు జ్యోతి, జగతికే మహోన్నతి
తేజోవతి, ఓజోవతి, పుడమికి జయహారతి
సృజనకు శిఖరాగ్రమిది, సృష్టికి ప్రతిసృష్టి యిది
అమరావతి! అమరావతి!! అమరావతి!!!

గోదావరి పాలధార, తుంగభద్ర తేనెధార
కృష్ణానది అమృతధార, కలిసి కరియు ప్రేమధార అమరావతి!
రాజరాజనరేంద్రుడు, కృష్ణదేవరాయలు,
టంగుటూరి, నందమూరి అశీస్సుల దివ్యఫలం
అమరావతి! అమరావతి!! అమరావతి!!

నన్నయ్య, తిక్కన, వేమన, పోతులూరి వాఙ్మయం
అష్ట దిగ్గజాల కావ్య అపురూప మకరందం
అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్యల స్వరార్ణవం
పినాకపాణి, బాలమురళి సుమధుర గానామృతం
గురజాడ, విశ్వనాథ, పుట్టపర్తి సాహిత్యం
బాపు, రమణల బంధపు వర ప్రతిభా పరిమళం
అణువణువున ప్రతిఫలించు అద్వితీయం నగరం
అమరావతి! అమరావతి!! అమరావతి!!

విద్యారణ్యుల కృపతో, విజయనగర స్ఫూర్తితో,
నాగార్జున బోధనలను నలు దిశలూ చాటుతూ,
పలనాటి ప్రాభవాన్ని పలుమారులు తలచుతూ,
తెలుగువారి హృదయ ధ్వనులె, తన మువ్వలుగా ధరించి
నర్తించే కూచిపూడి నవ మయూరి అమరావతి!
అమరావతి! అమరావతి!! అమరావతి!!


పచ్చదనపు పరిసరం, పరిశ్రమల ఆలయం
సమాచార, సాంకేతిక స్వర్ణ మందిరం
ఉన్నత జీవన ప్రమాణ ఉపాధులకు ఉషోదయం
నింగిని తాకే మేడలు, నిమిషంలో ప్రయాణాలు
వింత వింత శోభలతో పర్యాటక కేంద్రాలు
మానవతను తీర్చిదిద్దు ఆధ్యాత్మిక క్షేత్రాలు
అన్ని వసతులూ అమర్చు కల్పవృక్ష నందనం
అమరావతి! అమరావతి!! అమరావతి!!

కాల గీసిన చిత్రం, చరిత్ర చెక్కిన శిల్పం
ప్రగతిశీల పరిణామపు పథ గామిని, యశస్విని
తెలుగువారి మనోబలం, తెలుగుదేశ సంకల్పం
తెలుగు చరిత వైభవం, తెలుగుజాతి భవితవ్యం
తెలుగు ప్రజకు బాసట! తెలుగు కీర్తి బాపుటా!!
అమరావతి! అమరావతి!! అమరావతి!!

ఇటుక, ఇటుక చంద్రశిలగ అంతట అగుపిస్తున్నది
చంద్రప్రభల తెల్లదనం, చంద్రకాంతి చల్లదనం
కలిసి నిత్య పౌర్ణమిగా వెలిసిన బృందావనం
ఆచంద్రార్కం నిలిచే అసమానపు నగరం
అమరావతి! అమరావతి!! అమరావతి!!

మన స్వప్నం, అమరావతి – మన స్వర్గం, అమరావతి
మన బంధం, అమరావతి – మన బాధ్యత, అమరావతి
మన స్వేదం, అమరావతి – మన రక్తం, అమరావతి.
మన ప్రాణం, అమరావతి – మన సర్వం, అమరావతి
అమరావతి! అమరావతి!! అమరావతి!!

– పురిఘెళ్ల వెంకటేశ్వర్లు



బి ఎన్ రెడ్డి

కళాత్మకం... ఆ ద్రష్ట కన్ను!


ప్రసిద్ధ దర్శకుల జాబితా రాయమంటే – బి.ఎన్. రెడ్డి పేరుతో ఆరంభించడం అలవాటు. బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి చార్టెడ్ ఎకౌంటెన్సీ చదివినవారు – చదువుకుంటున్న రోజుల్లో నాటకాల్లో నటించినవారు. బళ్లారి రాఘవాచార్యతో కలిసి నటించిన అనుభవం కూడా ఉంది ఆయనకి. ఐతే, ఆనాటి నుంచే ఉన్న సినిమా మీది అవగాహన, ఆయన్ని సినిమా కళారంగం మెట్టుపైకి ఎక్కించింది. ఆ రోజుల్లో వచ్చిన బెంగాలి, హిందీ చిత్రాలన్నీ బి.ఎన్.రెడ్డి చూసేవారు. సినిమా సర్వకళల సమ్మేళనం. కళాత్మకం. సినిమా అలాగే ఉండాలన్న విశ్వాసం ఆయనది. కాని, సినిమా నిర్మాణం, దర్శకత్వం ఒక్క రోజులో పట్టుబడి పోయేవి కాదు. రంగంలోకి ఉరికి ప్రతిదీ తెలుసుకోవాలి. ఈ అభిప్రాయంతోనే ఆయన రోహిణి సంస్థ 'గృహలక్ష్మి' (1938) తీస్తున్నప్పుడు ఆ సంస్థలో భాగస్వామిగా చేరారు. తన వాళ్లని మరి కొందర్నీ కలిపారు. ఆయన తమ్ముడు నాగిరెడ్డి కూడా భాగస్వామి. కె.వి రెడ్డి క్యాషియరు. సముద్రాల రాఘవాచార్య రచయిత. 'రంగూన్ రౌడీ' అనే ప్రసిద్ధ నాటకం ఆధారంగా సినిమా కథ అల్లుకున్నారు. 'గృహలక్ష్మి'కి దర్శకుడు, నిర్మాతా హెచ్.ఎమ్. రెడ్డి. అందరికంటే అనుభవశాలి. ఐతే బి.ఎన్. భావాలు వేరు; హెచ్.ఎమ్. భావాలు వేరూ. అసలు, సినిమా పేరు దగ్గరే ఇద్దరికీ వేర్వేరు అభిప్రాయాలు వచ్చాయి. 'రంగూన్ రౌడీ' పేరుగల నాటకం కాబట్టి ఆపేరే ఉంచాలని హెచ్.ఎమ్ అన్నా, బి.ఎన్ విభేదించి మహిళాపరంగా, ఆకర్షణీయంగా ఉండాలని, 'గృహలక్ష్మి' పేరు ఖాయం చేయించారు. సినిమా పేరులో 'రౌడీ' ఏమిటన్న ఉద్దేశం ఆయనది. అలా – బి.ఎన్. రెడ్డివన్నీ ఉన్నత భావాలు. హెచ్.ఎమ్ – సినిమా సర్వజనాన్ని ఆకర్షించాలి గనక, హంగులుండాలన్న భావంతో ఉండేవారు. "గృహలక్ష్మిలో వెకిలి హాస్యం ఉంది. అది నాకు నచ్చలేదు" అని ఒక సందర్భంలో బి.ఎన్ రెడ్డి చెప్పారు. ఏమైనా, ఆ సినిమా తర్వాత, "మనమే మన ఊహలకీ భావాలకీ తగ్గట్టుగా సినిమా తీసుకుందాం" అని, వాళ్లంతా రోహిణి నుంచి బయటకి వచ్చి, వాహిని స్థాపించారు. సముద్రాల, కె.వి రెడ్డి, కమలాకర కామేశ్వరరావు (గృహలక్ష్మికి సహాయ దర్శకుడు) కూడా వాహినిలో చేశారు. అప్పటికే నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సామాజిక స్పృహతో, ఆ సమస్యమీద సినిమా తీయాలని బి.ఎన్. ఒక కథ అల్లారు. స్క్రీన్‌ప్లే రచన మీద ఎంతో అవగాహన గల చాయాగ్రాహకుడు కె. రామ్‌నాథ్‌తో స్క్రీన్‌ప్లే రాయించారు. 'వందేమాతరమ్' అని పేరు పెడితే, నాటి బ్రిటిష్ ఏలిక – తిరుగుబాటు సినిమా అనుకుంటుందని – అదొక లాటరీ కంపెనీ పేరుగా నిర్ధారించి, సినిమాతీస్తే ఘన విజయం సాధించింది. 'గృహలక్ష్మి'తో, గాంధేయవాది పాత్ర ధరించిన నాగయ్యని హీరోగా చేస్తే – ప్రజ ఆరాధించింది. ఇక వాహిని సంస్థకీ, బి.ఎన్. రెడ్డికీ తిరుగులేదు. రెండో సినిమా వితంతు వివాహాల మీద 'సుమంగళి'(1940) పేరుతో తీస్తే అదీ విజయం సాధించింది. తొలి చిత్రంలోని హీరో నాగయ్య – 'సుమంగళి'లో వృద్ధపాత్రధారి. "నటుడికి ఏ పాత్రయినా పాత్రే" అని, బి.ఎన్., నాగయ్యా ప్రకటించారు. మూడో సినిమా 'దేవత' (1941) ఇందులో మళ్లీ నాగయ్యే హీరో. వాహిని చిత్రాలంటే ఉన్నత ప్రమాణాలతో, అందర్నీ ఆకర్షించేలా వుంటాయన్న ఖ్యాతి వచ్చింది. బి ఎన్ కి 'సింబాలిజం' అనే టెక్నిక్ మీద నమ్మకం. "ఇది శాంతారామ్ చిత్రాల్లోఎక్కువగా కనిపిస్తుంది. సింబాలిజమ్ వల్ల ప్రేక్షకుడికి దర్శకుడి హృదయం దగ్గరవుతుంది" అని చెప్పేవారు బి.ఎన్ రెడ్డి. హీరోగాని, హీరోయిన్ గాని మోడైపోయిన చెట్టుకింద నిలబడితే, వాళ్ళ జీవితాలు అలా ఉన్నాయని తెలుసుకోడానికి ఆ షాటు ఉపయోగపడుతుంది. ఏ పాత్రయినా సంతోషంగా ఉన్నప్పుడు పాలు పొంగడం, మరణించినప్పుడు వెలుగుతున్న దీపం ఆరిపోవడం – వంటి షాట్సు బి.ఎన్. చిత్రాల్లో కనిపిస్తాయి. 'స్వర్గసీమ' 'మల్లీశ్వరి' 'బంగారుపాప' సినిమాలు బి.ఎన్.ని సినిమా రాజ్య సింహాసనం మీద కూచోబెట్టాయి. 'మల్లీశ్వరి'ని సర్వకళాత్మకమైన చిత్రంగా ప్రశంసిస్తే, 'స్వర్గసీమ'ని 'సాంఘికాల్లో తల మానికం'అని పొగిడాయి. ఆయన చిత్రాల్లో దర్శకుడి పనితనం కనిపిస్తుంది. దర్శకత్వానికి నిర్వచనం కనిపిస్తుంది. దేవత, మల్లీశ్వరి, స్వర్గసీమ, బంగారుపాప, రంగులరాట్నం చిత్రాల్లోని కొన్ని సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాల్ని తాకుతాయి; పిండేస్తాయి. ఆయన చిత్రాలన్నీ సినిమాని అభ్యసిస్తున్న విద్యార్థులకి పాఠాలే. అందరూ తీసి, విజయం సాధిస్తున్నారని ఆయన కూడా జానపదచిత్రం – 'రాజమకుటం' (1960) తీశారు. కథ చాలా మంచిదైనా, ఆ ధోరణి గల చిత్రాలు ఆయన ఒంటికి సరిపడలేదు. వాహిని కాకుండా, బి.ఎన్ ఇతర సంస్థలకి 'భాగ్యరేఖ', 'పూజాఫలం' చిత్రాలు తీశారు. చివరి చిత్రం – 'బంగారు పంజరం' (1969) అప్పటికే సినిమా అటూ ఇటూ కాని స్థితిలో కొట్టుకుంటుంది. 'బంగారుపంజరం' ప్రేక్షకామోదం పొందకపోవడంతో సినిమాలు చెయ్యడం మానేశారు. కాని, పరిశ్రమల గురించి, సినిమాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటూ ఉండేవారు. సినిమాలు చూసే వారు. ఆ సమయంలో, ఎవరైనా పలకరించి " హౌ ఆర్ యూ సార్?" అని అడిగితే, " లివింగ్ విత్ ద ఓల్డ్ ఫేమ్" అనేవారు చిరునవ్వుతో.

బి.ఎన్ కథమీద తీవ్రంగా ఆలోచిస్తారు. స్క్రీన్ ప్లే రాసుకుంటారు. దృశ్యాల్లో వచ్చే ప్రతి విషయం రాస్తారు (ఇంగ్లీషులో) తాను రాసుకున్న తర్వాత, రచయితతో చర్చిస్తారు. సాధారణంగా ఆయనదే పై మాట. ఆయన అభిరుచి, చిత్రాల ప్రమాణం చూసి, ఆ రోజుల్లో విశ్వవిద్యాలయాలు, సంగీత, సాహిత్య సంస్థలూ, ప్రభుత్వం ఆయన్ని ఆహ్వానించాయి. ఘన సన్మానాలు చేశాయి. సినిమా వారంటే అంతగా గౌరవం లేని ఆ రోజుల్లో బి.ఎన్ తన చిత్రాల వల్ల – గౌరవభావం సృష్టించారు. ఎక్కడికి వెళ్ళినా, ఆయనకి పెద్దపీట వేసేవారు. బి.ఎన్ సినిమాల్లో ఎక్కడా అసభ్యమైన మాటగాని, సంస్కారహీనమైన దృశ్యంగాని కనిపించవు. ఆయన తీసిన ఏ చిత్రంలోనూ ఒక్క 'సెన్సార్ కట్' లేకపోవడం – ఆయనకి ఒక రికార్డు.

వందేమాతరం నుంచి స్వర్గసీమ, మల్లీశ్వరి వరకూ అన్నిచిత్రాలూ తక్కిన దక్షిణ రాష్ట్రాల్లో ప్రదర్శింపబడి, ప్రేక్షకుల మెప్పుపొందాయి! 'స్వర్గసీమ' కేరళలో వందరోజులకి పైగా నడిచింది. (డబ్బింగ్ కాదు – తెలుగే) సంగీత, సాహిత్యాలకి 'మల్లీశ్వరి' ఉన్నతపీఠం వేసింది. ఆయనదంతా కళాత్మకం. భావాలు కళాత్మకం. కళాదర్శకుడు ఎ.కె శేఖర్ చెప్పినట్టు "బురద, రొచ్చు కాలువలు ఉండే సెట్టు కూడా కళాత్మకంగానే ఉండాలి!" పరిశ్రమ అభివృద్ధికి ఎందరో బి.ఎన్ రెడ్డి సలహాలు తీసుకునేవారు. అందరికీ ఆ రోజుల్లో ఆయన 'పెద్దదిక్కు'.

తన చిత్రాల ద్వారా సంపాదించుకున్న ఖ్యాతికి చిహ్నంగా కేంద్ర ప్రభుత్వం 'పద్మభూషణ్'తో ప్రశంసించింది. సినిమా వారికి ఇచ్చే అత్యున్నతమైన అవార్డు 'దాదాఫాల్కే' కూడా ఆయనకి అందించింది. మన జానపద కళలతో, ఉన్నత ప్రమాణాలతో ప్రజారంజకమైన చిత్రాలు తీసిన బి.ఎన్ రెడ్డిని తెలుగు సినిమా ఎన్నటికీ మరవలేదు.


– రావి కొండలరావు



కృష్ణబిలం

కృష్ణబిలం అంటే ఏమిటో తెలుసా పిల్లలూ! పోనీ, ఇంగ్లీషు మీడియం చదువులు కాబట్టి 'బ్లాక్ హోల్' అంటే చెప్పండి. అనంత విశ్వంలో మృత నక్షత్రాలు కాంతిహీనమయిపోయి, అంతరిక్షంలో ఏర్పడే చీకటి క్షేత్రాలనే 'బ్లాక్ హోల్స్' అని, తెలుగులో కృష్ణబిలం, లేదా కాలబిలం అంటారు. కృష్ణబిలంలో భూమి అంత గోళం ఒక చిన్న ముత్యపు పూసలా ఇమిడిపోతుంది. దాన్ని బట్టి కృష్ణబిలం ఊహించండి– ఆ చీకటి క్షేత్రం మొత్తం ఎంతటి పరిమాణం ఉంటుందో.

జర్మన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు కార్ల్ స్వార్జ్ ఛైల్డ్ 1907లో కృష్ణబిలాన్ని కనుక్కోవడమే కాకుండా వాటి గుట్టు విప్పాడు. కృష్ణబిలానికి గురుత్వాకర్షణశక్తి చాలా ఎక్కువ. సూర్యుడికంటె మూడు రెట్లున్న నక్షత్రంలో గురుత్వాకర్షణశక్తి న్యూట్రాన్ నక్షత్రం కూడా ఆపలేనంతగా వుంటుంది. అలాంటి గురుత్వాకర్షణ పదార్థాన్నంతటినీ అనంత సొరంగంలోకి లాగేస్తుంది. అందులో నుండి వెలుతురుకు సైతం తప్పించుకొనే దారి ఉండదు కాబట్టే అది చిక్కని చీకటి బిలం!



దారి కనుక్కోండి


చిన్నారి 'చిత్రం'



బేబి సృజన
7వ తరగతి,
డిఎవి పబ్లిక్ స్కూల్, ఇబ్రహీంపట్నం




చిన్నారుల పెయింటింగ్స్‌ను
apchiefeditor@gmail.com కు
ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.



చుక్కలు కలపండి

రంగులు వేయండి





అద్భుతాలకు మూలం ఏది?

మానవ సమాజంలో చోటు చేసుకున్న, ఇంకా చోటు చేసుకుంటున్న అద్భుతాలను మనం నిరంతరం గమనిస్తుంటాము. ఈజిప్టులో పిరమిడ్‌లు ఒక అద్భుత సృష్టి. అలాగే తాజ్‌మహల్ వంటి అనేక నిర్మాణాలు, చంద్రయానం మొదలుకొని మానవ నిర్మిత ఉపగ్రహాలు, శక్తివంతమైన విమానాలు, టెలివిజన్లు, సెల్‌ఫోన్లు, అతిశక్తివంతమైన కంప్యూటర్లు ఎలా ఉద్భవించాయి?

ఒక క్రొత్త ఆలోచన తరువాత ఆలోచనకు స్పష్టత ఏర్పడడం, తరువాత దానికి వాస్తవరూపం కల్పించడం, ఆ రూపాన్ని వర్తమాన సమాజంలో ఆవిష్కరించడం ద్వారానే అనేక అద్భుతాలు చోటు చేసుకుంటున్నాయి. అంటే ఈ అద్భుతాలన్నింటికీ మూలం కేవలం ఒక ఆలోచన. ఒక క్రొత్త ఆలోచన క్రమక్రమంగా విస్తరించి, ఒక అద్భుతం ఆవిష్కృతమవుతుంది.

క్రొత్త ఆలోచనలు నూతన సృష్టికి మూలాలని, క్రొత్త మార్గాలకు ద్వారాలు తెరుస్తాయని, మానవ జాతి పరిణామ చరిత్ర చాటి చెబుతున్న, అత్యధిక శాతం మంది క్రొత్త ఆలోచనలను ఎందుకు ఆహ్వానించరు? ఎందుకు ఆదరించరు? ఎంతో కాలంగా అలవాటయిన, అందరూ అంగీకరించే ఆలోచనలకు అంకితమై ఉండడానికే ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. భిన్నంగా ఆలోచించడం, నూతన మార్గాలు అన్వేషించడం, నూతన లక్ష్యాలు ఏర్పరచుకోవడం తమ పని కాదని ఎక్కువ మంది విశ్వసిస్తుంటారు.

మూడు శతాబ్దాల క్రితం, జకోస్లేవేకియాలో బొహేవియన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ స్థాపించబడింది. ఆ స్కూలు ప్రత్యేకత ఏమిటంటే, అక్కడి విద్యార్థులు తమకు అలవాటయిన ఆలోచనలకు స్వస్తి చెప్పి ప్రతీదీ క్రొత్తగా ఆలోచించాలి. ప్రతి ఒక్కరూ సౌకర్యవంతంగా కూర్చోవడానికి, సులభంగా తయారు చేయగల కుర్చీని ఎలా రూపొందించాలి? ఈ అంశంపై అనేక మంది విద్యార్థులు నెలల తరబడి రకరకాల డిజైన్లు రూపొందించారు. అంతకు ముందు కుర్చీలన్నీ పూర్తి అలంకరణతో, సింహాసనాలలాగా రూపొందించేవారు. అక్కడి విద్యార్థులు తమలో తాము సంప్రదించుకుంటూ, ఎంతో మథనపడిన తరువాత, ఈ రోజు మనం వాడుతున్న సాధారణమైన చెక్క కుర్చీని రూపొందించడం జరిగింది. వెనుక కాళ్ళు, ముందు కాళ్ళు, ఆనుకోవడానికి, కూర్చోవడానికి వెసులుబాటు కల్పించే కుర్చీ ఇవ్వాళ సాధారణంగా, మామూలుగా కన్పించవచ్చు. కాని దీనిని నిర్మించడానికి కొన్ని వందల సంవత్సరాలు పట్టింది. ఆ తరువాతే సులభంగా తయారు చేయగల కుర్చీల రూపకల్పన పెద్ద స్థాయిలో మొదలైంది.

పాత ఆలోచనలను ఆశ్రయించుకు ఉండే వారిలో మరో లక్షణం కనిపిస్తుంది. క్రొత్త ఆలోచనలకు అంకురార్పణ జరుగకుండా వారు ప్రతి సన్నివేశంలోను అవరోధాలు కల్పించడానికి ప్రయత్నిస్తారు. క్రొత్త ఆలోచనలను నిరసిస్తారు. వ్యతిరేకిస్తారు. తమ భావాలకనుగుణంగా క్రొత్త వాదనలు వెలయిస్తారు. అందరినీ గందరగోళ పరుస్తారు.

ప్రపంచ వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు దశాబ్దాల క్రితం స్థాపితమై క్రమ క్రమంగా విస్తరిస్తూ ప్రస్తుత స్థితికి చేరుకొన్నాయి. మానవ జాతి పరిణామ క్రమం అమిత వేగాన్ని పుంజుకొన్న సమయమిది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మూల మూలకూ విస్తరించింది. ప్రతిచోటా ఆధునికత తొంగిచూస్తోంది. ఆధునిక అవసరాలకు, ఇంకా చోటు చేసుకోబోయే పరిణామాలకు అనుగుణంగా నూతన నగరాలను నిర్మించుకోగల అవకాశం ఇప్పుడు మాత్రమే లభిస్తోంది.

నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఎలా ఉండాలి? ఈ ప్రశ్న తలెత్తినప్పుడు నేలబారు ఆలోచనలన్నీ తెర మీదకు వచ్చాయి. ఇరవై ఒకటో శతాబ్దంలో నిర్మితమయ్యే మొదటి నగరం ఎలా వుండాలి? ఈ అంశంపై ఎవరికీ స్పష్టత లేకపోవచ్చు. కాని పాత నగరాల లాగా నిర్మించాలని భావించే వారు వెనుకబాటు తనాన్ని ఆశ్రయించి, కొత్త ఆలోచనలను ఆదరించడానికి వెనుకాడుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక అవసరాలు, పౌరులకు పూర్తి సౌకర్యాలు, ఆశ్చర్యపరిచే ఆధునిక డిజైన్లు, దిగ్భ్రాంతి పరిచే నిర్మాణాలు అడుగడుగునా కొట్టవచ్చేట్లు దర్శనమివ్వాలి. రాబోయే తరాలకు ఈ నగరం స్ఫూర్తి నివ్వాలి. ప్రేరణగా నిలవాలి.

మానవజాతి పురోగతికి మూలం క్రొత్త ఆలోచనలేనన్న వాస్తవం కళ్ళెదుట కదలాడుతున్నా చాలా మంది దానిని గుర్తించ నిరాకరిస్తారు. ఇంగ్లండులోని మాంచెస్టర్ న్యాయస్థాన భవనం, ఉత్తరకొరియాలోని రియుగ్యాంగ్ హోటల్, బెలారస్ లోని జాతీయ గ్రంథశాల, స్పెయిన్ లోని గుగ్గెన్ హామ్ మ్యూజియం, ఢిల్లీలోని లోటస్ దేవాలయం, అమెరికాలో కొలరాడోలో ఏయిర్ ఫోర్స్ అకాడమి, బీజింగ్‌లోని నేషనల్ స్టేడియం, లాస్ వెగాస్ లోని లక్జర్ హోటల్, లండన్‌లో ఘెర్కిన్ భవంతి ప్రపంచంలోనే ఆధునికమైన, విశిష్టమైన కట్టడాలుగా అలరారుతున్నాయి. ఆయా కట్టడాలు, ఆయా దేశాలకు చిహ్నాలుగా నిలుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ క్రొత్త రాజధాని అమరావతి కూడా అటువంటి విలక్షణ, విశిష్ట నిర్మాణాలకు కొలువై వుండాలని ఆలోచించగల వారందరూ ఆశిస్తారు.

– సి.నరసింహారావు

జయహే అమరావతి

"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు
ఆంధ్ర సంతతికే మహితాభిమాన
దివ్య దీక్షా ముఖ స్ఫూర్తి తీవరించె
ఆమహా వేశమర్థించి యాంధ్రులార!
చల్లుదాంధ్రలోకమున నక్షతలునేడు"

అన్న రాయప్రోలు వారి మహోన్నత దివ్యకాంక్ష ఆశీఃఫలముగా నేడు ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం భూమి పూజా కార్యక్రమం 'విరిసె చల్లని వెన్నెల మరల ఈనాడు మాకన్నుల' అన్న కవిభావంలా అఖండ విఖ్యాతమై అలరు శుభవేళ 'గతమెంతో ఘనకీర్తికలవోడ' అన్నస్ఫూర్తితో గతంలోకి వెళ్దాం.

"చావలేదాంధ్ర జనమహోజ్జ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువుడో సదయులారా!"

అని గుండె నిండుగా గాలిపీల్చుకున్న ఆంధ్రజాతి ఈనాటిదికాదు. ఐతరేయ బ్రాహ్మణంలో తొలిసారి ఆవిష్కృతమై అలరారింది.


'కృష్ణా తరంగ పంక్తిన్ త్రొక్కుత్రుళ్ళింత
నాంధ్ర నౌకలు నాట్యమాడునాడు
చూచిసంతోషమున తలలూచి గర్వ
మాచిన ఆంధ్రజాతి' తనదైన ఆంధ్ర పౌరుషాన్ని చాటుకుంది.

"వేదంలా ఘోషించె గోదావరి" "కృష్ణవేణి తెలుగింటి విరిబోణి" అన్న ప్రశస్తులతో పుణ్యతోయముల జీవనదుల కిన్నెర నడకల సొగసులతో అలరారిన ఆంధ్రజాతి 'నాటి రాయల పేరు నేటికిని తలపోయు "తుంగభద్రానదీ తోయమాలికలందు" జలకాలాడింది. పాటలు పాడింది.

'అమరావతీ నగర అపురూపశిల్పాలు' అని కవుల చేతమల్లెదండను ధరింపచేసుకుంది.

ఆంధ్రుల గత ఘన చరిత్రకు సజీవాధారంగా నిలిచిన లిపిని పరిశీలిస్తే ఎన్నో మరుగున పడినవాటిని తవ్వి తలకెత్తవచ్చు.

క్రీస్తు పూర్వం 1000–800 సంల మధ్య లిపి ఏర్పడింది. (ఆధారం తెలుగు లిపి చరిత్ర డా॥ బూదరాజు రాధాకృష్ణ గారి వ్యాసం) తరువాత అనేక బేధాలతో మారుతూ వచ్చింది. ఆ విధంగా క్రీ.పూ. 3వ శతాబ్ది దాకా వాడకంలో వున్న తెలుగు లిపి బేధాన్ని 'భట్టిప్రోలు' లిపి అని వ్యాప్తంలో వుంది. అలాగే క్రీ.శ. తొలి రెండు శతాబ్దాల కాలంలో ప్రాచుర్యంలో వున్నది.



చారిత్రక అమరావతి ఊహాచిత్రం

'శాతవాహనలిపి' అని తదుపరి 3వ శతాబ్దానికి' ఇక్ష్వాకు లిపి' అని, నాల్గవ శతాబ్దానికి శాలంకాయన లిపి, అయిదో శతాబ్దిలో 'వేంగి లిపి' అనే పేర్లతో ఆయా రాజుల కాలాలకనుగుణంగా లిపి వెలుగు చూసింది.

క్రీ.శ 7వ శతాబ్ది నుండి 10వ శతాబ్ది దాకా (అంటే నన్నయ్య ముందు యుగందాకా) వేగి చాళుక్యుల తెలుగు–కన్నడ లిపి వ్యాప్తంలో వుంది. క్రీ.శ. 11వ శతాబ్దం నన్నయ మహా భారతానువాద కాలం నాటి లిపి తూర్పు చాళుక్య లిపిగా ప్రసిద్ధమైంది.

క్రీ.శ. 1వ శతాబ్దంలో అమరావతి స్థూపంలో తొలి తెలుగు మాట 'నాగబు' కన్పించింది.

రామాయణంలో ఆంధ్రప్రస్తావన కన్పిస్తుంది. దశరథుని మిత్రుడైన రోమపాదుడు, ఇతడు ఉ శీనరుని వంశంలో ఏడవ తరంవాడు. ఉశీనరుని తమ్ముడైన తితీక్షువు నుండి ఆ వంశం వాడు 'ఆంధ్రరాజు'. దశరథుడు, రోమపాదుడు, ఆంధ్రరాజు సమకాలీకులు అంటే ఏడవ మనుకాలంలో ఇరువది నాలుగు మహా యుగంలోనే ఆంధ్రశబ్దము, ఆంధ్ర వంశమై ఆంధ్ర ప్రశస్తి కన్పించిందంటే ఈ ఆంధ్రజాతి ఎంత ప్రాచీనమైనదో మనం గ్రహించవచ్చు.

అలాగే రామాయణం కిష్కింధకాండంలో సీతాన్వేష ఘట్టంలో ప్రాచ్యకదే శక్తులైన 'ఆర్యాంధ్రుల' ప్రస్తావన సుగ్రీవుడు తెలియజేయడం విశేషం. అలాగే మహాభారతంలో ధర్మరాజు రాజసూయం చేసినప్పుడు సహదేవునిచే జయించిన రాజ్యాలలో 'ఆంధ్రదేశం' కన్పిస్తుంది. 'ఉషా పరిణయం' ఘట్టంలో ఉషస్వప్నంలో చూసిన పురుషుని చిత్రంను చెలికత్తెవ్రాసే సందర్భంలో ఆరూప పటాలలో 'ఆంధ్రరాజు' ఉన్నట్లు వర్ణితమైంది.

మరొక విశేషం ఏమిటంటే అమరావతి శిల్పకాలం నుండి పరికిస్తే ఆంధ్రజాతికి సింహం గుర్తే కన్పిస్తుంది. అందుకే ఆంధ్రుల పతాకంపై సింహంపై కూర్చున్న యోధుని చిహ్నం ఆంధ్రజాతి పౌరుషానికి, వీరత్వానికి ప్రతీకగా వుండేదని విశ్వనాథవారు ఆంధ్రపౌరుషంలో పేర్కొన్నారు.

ఇక పురాణాల పరంగా పరిశీలిస్తే వాయుపురాణంలో, బ్రహ్మాండ పురాణంలో ఆంధ్రప్రస్తావన కన్పిస్తుంది. ప్రధానంగా బ్రహ్మాండపురాణం 77 అధ్యాయం 717 శ్లోకంలో

"ఆంధ్రాణీం సంస్థితా పంచతేషాం వంశాశ్చమే
పునఃసప్తైవతు భవిష్యంతి"అని పేర్కొనబడింది.

అప్పయ దీక్షితులు అనే మహావిద్వాంసుడు

"ఆంధ్రత్వ మాంధ్రభాషాచ, ప్రాభాకర పరిశ్రమః
తత్రాపి యాజుషీ శాఖానాల్పస్యతపసఃఫలం"

ఆంధ్రుడుగా పుట్టుట, ఆంధ్రభాష మాతృభాష

గల వాడుగా నుండుట, వైదిక దర్మావలంబియగుట, యజుశ్శాఖాధ్యాయి అగుట అల్ప తపస్సులకు అలభ్యము. అంటే పూర్వ జన్మలందు గొప్ప తపస్సు చేసిన వారికే ఆంధ్రభాషను మాట్లాడు ఆంధ్రుడిగా పుట్టుభాగ్యమబ్బును. అదే అప్పయ దీక్షితుల శ్లోకభావము.

కృష్ణా గోదావరి మధ్యదేశంగా ఆంధ్రదేశాన్ని అభివర్ణించాడు తిక్కన. మత్స్యపురాణంలో పందొమ్మిది మంది ఆంధ్రరాజుల ప్రస్తావన కన్పిస్తుంది. చారిత్రకంగా చూస్తే, అశోకుడు (మౌర్య చక్రవర్తి) క్రీ.పూ. మూడవ శతాబ్దం మధ్యలో ఆంధ్రులను తన సామంత జాతిగా పేర్కొన్నారు.

కథా సంప్రదాయం అనుసరించిచూస్తే ఆంధ్ర రాజులలో ప్రప్రథములుగా కృష్ణానదీ తీరపు కాకుళేశ్వరుడైన సుచంద్రుడు, అతని కుమారుడు ఆంధ్ర విష్ణువు కన్పిస్తారు. ఈ ఆంధ్ర విష్ణువే కృష్ణాతీరంలో కల శ్రీకాకుళంలో (కృష్ణా జిల్లా) వున్న ప్రాచీన దేవాలయంలో ఆరాధ్యదైవంగా పూజలందుకుంటూ ఆంధ్రజాతిపితా మహుడుగా పరిగణింపబడుతున్నాడు.

ప్రాచీనాంధ్రుల మత, సాంఘిక, రాజకీయ విషయాలకు సంబంధించి నాసిక్ గుహల్లో ఆధారాల వల్ల అనేక విషయాలు బహిర్గతమ య్యాయి. ఇక అమరావతీ నగరం విషయాలను పరికిస్తే, అమరావతికి బౌద్ధచరిత్రలో విశిష్టస్థానం వుందనే విషయం తేటతెల్లం అవుతుంది. ఈ అమరావతి నగరం శాతవాహనుల రాజధానియైన ధాన్యకటకానికి అరమైలు దూరంలో వుంది. మహాయాన బౌద్ధసిద్ధాంతానికి ఆటపట్టైన కేంద్రం. ఇక్కడ వున్న మహాస్థూపం వల్లనే ఈ నగరం ప్రపంచ విఖ్యాతమైంది. ఇక్కడున్న స్తూపం ఎత్తు నూరు అడుగులు, భూచక్రవ్యాసం నూటఅరవైరెండు అడుగుల ఏడు అంగుళాలు. అలాగే ఇక్కడి బుద్ధ విగ్రహం భక్తి తత్పరుడైన పరివ్రాజుకరూపునిగా దర్శనమిస్తుంది.

ఇక సంస్కృతి విషయానికొస్తే ఆంధ్రుల సంస్కృతి చరిత్రను ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు గ్రంథస్తం చేస్తే విశ్వనాథవారు తమ 'ఆంధ్ర ప్రశస్తి'లో ఈ విధంగా తెలియజేశారు.

గోదావరీ పావనోధార వాఃపూర
మఖిల భారతము మాదన్ననాడు
తుంగభద్రా సముత్తుంగ రావము తోడ
కవుల గానము శ్రుతి గలయునాడు
పెన్నానదీ సముత్పన్న కైరవదళ
శ్రేణిలో తెన్గు వ్యాపించునాడు
కృష్ణాతరంగ నిర్ణిద్రగానముతోడ
శిల్పమ్ము తొలిపూజసేయునాడు

అక్షర జ్ఞానమెఋగదో యాంధ్రజాతి
విమల కృష్ణా నదీసైక తములయందు
కోకిల పుబాట పిచ్చుక గూండ్లుకట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు

బౌద్ధపరంగా ఆంధ్ర సంస్కృతిని అధ్యయనం చేసినప్పుడు 'యువాన్‌చాంగ్' అనే చైనా యాత్రికుడు బుద్ధుడే స్వయంగా ఆంధ్రదేశంలో ధమ్మబోధ చేశాడని తెలియజేశాడు. మహాయానంలో మేరు సమానుడైన ఆచార్య నాగార్జునుడు ఆంధ్రుడు. ధాన్యకటకం ఈతని జన్మస్థలం. అలాగే బౌద్ధమతం వికాసానికి సంబంధించిన ఆధారాలు తెలిపే విషయాలను బట్టి ఈ ప్రాంతంలో క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి మొదలై క్రీ.శ 13వ శతాబ్దం వరకు బౌద్ధం వున్నట్లు అవగతమౌతుంది. అలాగే అమరావతిలో క్రీ.పూ. 2వ శతాబ్దంలోనే గ్రంథాలయాలున్నట్లు చైనా యాత్రికుడు 'పాహియాన్' తన గ్రంథం 'ఫో-కువో-కి'లో తెలియజేశాడు.

ఈ విధంగా మేటి చరితల ఘనకీర్తి కల్గిన ఆంధ్ర దేశాన్ని కీర్తిస్తూ 20వ శతాబ్దంలో కవులు ఈ విధంగా వర్ణించారు. శ్రీ బేల్కూరి శ్రీనివాస మూర్తిగారు

నన్నపార్యుని మురలి నాదమైనది గీతి
తిక్కన నవసృష్టి - తేజమైనది గీతి
శంభుదాసుని హృదయ - సారమైనది గీతి
ఆరాధన మొనర్తు - నాంధ్ర సుందర గీతి

అని కవిత్రయాన్ని ప్రస్తుతిస్తూ ఆంధ్ర కవిత్వాన్ని సుందరంగా అభివర్ణించారు.

శ్రీశ్రీగారు ఆంధ్ర యువతకు చైతన్యాన్నియిస్తూ...
"కదలవోయ్ ఆంధ్రకుమారా!
నిద్రవదలవోయ్ నవయుగం
నిర్మింపసాగవోయ్" అన్నారు.

ఈ ప్రబోధం ఈనాడు ఆంధ్రజాతి సగర్వంగా నిర్మించుకోబోతున్న రాజధాని భూమి పూజ, శంకుస్థాపన సందర్భాన్ని సుసంపన్నం చేస్తూ, రాజధాని నిర్మాణంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలనే సందేశాన్ని అందిస్తోంది.

అలాగే దేవులపల్లి వారి కలం పలికించిన భావం ఆంధ్ర ధరిత్రిపై ఇలా వర్షిస్తోంది.

"జయమహాంధ్ర జనయిత్రీ
జయప్రియాంధ్ర జనయిత్రీ
జయజయ ప్రియతమ భారత
ధాత్రి పుత్రీ సుభధాత్రి
ఒక అడుగేని చెదరనీము చెదరనీము
ఒక క్షణమేని వృధాపోనీము - వృధాపోనీము
శ్రీరస్తు శుభమస్తు శాంతిరస్తని దీవించు

ఎన్నడో గౌతమీపుత్ర శాతకర్ణితో ప్రారంభమైన ఈ వికాసం ఈనాడు మన ప్రియతమ ముఖ్యమంత్రి అవిశ్రాంత యోధులు అయిన నారాచంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో రాజధాని నిర్మాణ శుభఘట్టం శంకుస్థాపన రూపంలో ఆవిష్కృతం కావడం ఆంధ్రుల నిరంతర కీర్తి సంస్కృతులకు వాటి వికాసానికి నాందిగా భావించాలి.

జాషువా గారన్నట్లు


"ఒక నాఁడాంధ్రునికత్తి శాత్రవ బలవ్యూహాలపై
రక్తనాటకమున్ సల్పుట విస్మరింపకుము"

అన్న భవాన్ని పదే పదే స్మరించుకుంటూ ఆంధ్ర రాజధాని నిర్మాణంలో మనప్రియతమ రాష్ట్ర నాయకుని వెన్నంటి వుందాం. వెన్నంటి మనసుతో వెన్నంటి వుందాం. రాజధాని అమరావతికి మంగళాచరణ చేద్దాం.

శ్రీరస్తు శుభమస్తు నిత్యశ్రీరస్తూ
జయహే జయమే అమరావతి
శుభము కూర్చి జయమీవే అమరావతి
దేవి దుర్గమ్మ నుదుటి బొట్టువునీవై
కృష్ణమ్మ ఒడిలోన పచ్చనిమాగాణివై
అలరించె సోయగాల ఆంధ్రులకల్పవల్లి
జనావళికి ఈనాడు సంతసమిచ్చు మాతల్లి
వసంతాల తడసినటుల ముదమాయెతల్లి
వరత్తులో ఉషస్సులా ఉద్యమించవెతల్లి
జయహే జయహే అమరావతి తల్లి
జయహే జయహే ఆంధ్రుల కల్పవల్లి

- డా॥ నోరి రాజేశ్వరరావు

బొట్టూ... కాటుకా



1991... తూర్పు గోదావరి జిల్లాలో అన్నవరానికి ఆనుకుని ఉన్న శంఖవరం అడవుల్లో తిరుగుతూ నిగ నిగలాడే ఆకులతో ఆకర్షణీయంగా ఉన్న ఒక మొక్క దగ్గర ఆగిపోయాను. అది రెండు మీటర్ల యెత్తు ఉ ంది. దాని కొమ్మల చిగుళ్ళు మైనంలో ముంచినట్టు నున్నగా ఉన్నాయి. ఆ దారిలో నడిచి పోతున్న ఒక వన పుత్రికను ఆపి, ఆ మొక్క పేరేమిటని అడిగాను. 'కొమ్మిచెట్టు' అంది. 'ఎందుకైనా పనిచేస్తుందా?' అన్నాను. దానితో బొట్టు బిళ్ళలు చేసుకుని నుదురుకి పెట్టుకుంటామంది. 'దిష్టి తగలకుండా' అని జోడించింది. ఎలా చేస్తారో విడమరచి చెబుతావా? 'అలాగే సారూ, గూడెంలోకి పదండి చేసి చూపుత' అంటూ, జానెడు పొడవుండేలా ఒక కొమ్మి కొమ్మను విరిచి, చిగురు తప్ప మిగత ఆకులన్నిటినీ తెంపి పారేసి 'పదండి సారూ' అంది. ఆంధ్రప్రదేశమంతటా గిరిజన సంక్షేమపథకాల జోరు ఎక్కువైనప్పటినుంచీ 'ఈ సారూ! అనే పదం గిరిజనులందరికీ ఊతపదమైపోయి ఉంటుంది!' అనుకుంటూ నేను ఆమె వెనకే నడిచాను.

గూడెం చేరగానే ఆ గిరిజన మహిళ ఒక పళ్ళెం తెచ్చి, అందులో నీళ్ళు పోసింది. అగ్గిపెట్టె ఉందా సారూ? అని అడిగి తీసుకుని, ఓ పుల్ల వెలిగించి, దానితో– విరిచి తెచ్చిన కొమ్మి చిగుర్ని అంటించి, అది కాలుతుంటే ఆ మంటకు వేడెక్కి కరిగిన మైనం చుక్కలు నీళ్ళలో పడేలా అమర్చింది. అంతే! ఇక చూడండి తమాషా! పళ్ళెంలో పడుతున్న చిన్నా, పెద్దా మైనం చుక్కలు, అందులోని నీళ్ళకు తగిలీ తగలగానే చల్లారి, నల్లగా నిగనిగలాడే వలయాకారపు బొట్టు బిళ్ళలుగా మారి నీటిపై తేలిపోసాగాయి! 'షో–కేసుల్లో' పెట్టి అమ్మే బొట్టు బిళ్ళలు వీటి ముందు బలాదూరే!

ఈ అద్భుతమైన 'డిమాన్స్ట్రేషన్' అయిన తరువాత అడవి బిడ్డ మరో ముచ్చటను చెప్పింది– బుట్టెడు కొమ్మి ఆకుల్ని దూసుకొచ్చి, ముంతలో వేసి, తగినన్ని నీళ్ళు పోసి ఉడికించి, కషాయాన్ని వేరే దాకలోకి మార్చి, ముద్దలా అయ్యేవరకు వేడి చెయ్యాలి. ఆ ముద్దను సిలాయి చిప్పలో దాచుకుని అవసరమైనప్పుడల్లా కాస్త తడిచేసి, వేలితో అరగదీసి ముఖానికి బొట్టూ, బుగ్గకి దిష్టి చుక్కా పెట్టుకోవచ్చు.

ఇక కాటుక సంగతులు: వనమూలికలతో ఓషధీయుక్తమయిన కాటుక తయారు చేసుకోవడంలో అడవిబిడ్డలు వారికి వారే సాటి! 1983లో కరీంనగర్ జిల్లా మహదేవపూర్‌కి దగ్గరలో ఉన్న చింతకాని గ్రామం నుండి అడవులకు అడ్డంగా పోయి కనకనూరు అనే గిరిజన పల్లె చేరుకున్నాను. అక్కడ పులిసె సాయిత్రి మాయా మర్మం లేకుండా తనకు తెలిసిన మూలికా వైద్యాన్ని వివరించింది. అందులో నాకు బాగా నచ్చినది 'ములుపుచ్చ' గింజల కాటుక. సాయిత్రి చెప్పిన ములుపుచ్చను కొన్ని ప్రాంతాలలో 'పిచ్చి కుసుమ' అనీ, మరికొన్ని ప్రాంతాలలో 'సన్నాసి మొక్క', 'పీల ధత్తూర', 'ముండ్ల సొన' అనీ పిలుస్తారు.

సాయిత్రి చెప్పిన వివరాల సారాంశం ఏమిటంటే– "పిచ్చి కుసుమ గింజల్ని సన్నని మంటలో మాడేలా వేపి, పలచని గుడ్డలో మూటకట్టి, కొద్దిగా నీళ్ళు పోసిన పళ్ళెంలో పెట్టాలి. అలా కొంతసేపు నానిన తరువాత ఆ మూటను పళ్ళెంలో నొక్కిపట్టి రుద్దితే నల్లని సారం దిగుతుంది. అలా దిగిన సారాన్ని నీడలో ఆరబెట్టగా తయారైన కాటుకను ఓ చిప్పలో భద్రపరుచుకుని, రోజూ కంటి రెప్పలకు రాసుకుని కండ్లను గాలి పీడల (ఫంగల్ & వైరల్ ఇన్ఫెక్షన్స్) నుండి కాపాడుకోవచ్చు" అని.

ములుపుచ్చ గింజలతో కాటుక చేసే మరో పద్ధతిని కూడా పులిసె సాయిత్రి చెప్పకుండా ఆపుకోలేకపోయింది! 'మాడ్చిన గింజల్ని మెత్తగా చూర్ణించి, నువ్వుల నూనెలో కలిపి ప్రమిదలో వేసి వత్తిని వెలిగిస్తే వచ్చే మసిని కాటుకలాగ వాడుకోవచ్చు'. పులిసె సాయిత్రికి జేజేలు! ఈ కాటుక తయారీకి "ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్" సాయిత్రికే చెందాలి.

కాటుక గురించి మరికొన్ని ముచ్చట్లు!:

గుంటగలగరాకుతో: ఆదిలాబాద్ జిల్లాలోని చారసాల – చెడ్వాయ్ అడవుల్లో నివసించే గిరిజనులు గుంటగలగరాకు (ఎక్లిప్టా ఆల్బా)ను బాగా కుమ్మి, రసం తీసి దాన్ని నాలుగుడ్డకు పట్టించి ఆర బెట్టి, ఆరిన గుడ్డను కాల్చగా వచ్చిన బూడిదను చిన్న కర్ర పిడతలో వేసి, తగినంత (నాలుగైదు చుక్కలు) ఆముదం కలిపి కాటుక చేసుకుని కనురెప్పలకు రాసుకుని కళ్ళు విప్పారి కాంతులు వెదజల్లేలా చేసుకుంటారు. పచ్చ కామెర్లు కూడా తగ్గుతాయట.

కలబంద సారంతో: ఓ కత్తిని యెర్రగా కాల్చి కలబంద(అలో బర్బడెన్సిస్) మట్ట (ఆకు)ను పొడిస్తే వచ్చే నల్లని సారాన్ని మూడు నెలల వయసు వరకు ఉన్న బిడ్డల కళ్ళకు కాటుకలా వాడి, గాలి పీడలనుండి కాపాడి కళ్ళు విప్పారేలా చేస్తారు కడపజిల్లాలోని యెంటికుంట యేనాది తల్లులు.

పొడపత్రంతో: కంచు పళ్ళెం అడుగు భాగానికి పొడపత్రి (జిమ్నిమా సిల్వెస్టర్) ఆకు రసం రాసి, దానికి ఆముదం దీపం వెలిగించగా వచ్చే ధూపం మసి అంటుకునేలా పట్టుకోవడంవల్ల, అది రసంలో కలిసిపోయి దట్టంగా పేరుకుంటుంది. అలా పేరుకున్న మసిని ఈతాకుతో గీకి, ఒకటి రెండు చుక్కలు ఆముదం కలిపి, కాటుక భరణిలోకి మార్చుకోవాలి. అలా తయారుచేసుకున్న కాటుకను రోజూ పెట్టుకుంటే కండ్లకు గాలి పీడలు సోకవు. అలాగే, పొడపత్రి ఆకుల రసంలో దూది వత్తులు వేసి, ఎండబెట్టి ఆ వత్తులను ఆముదం ప్రమిదలో వేసి వెలిగిస్తే వచ్చే పొగ మసిని కూడా కాటుకలా ఉపయోగించుకోవచ్చు.

కాటుక కాడతో: పాపికొండల్లో కోయలు కాటుక కాడ




(దూసరి తీగ: కాక్యులస్ హిర్స్యూటస్) ఆకు రసంలో తెల్లని గుడ్డను వేసి దానిని ఎండబెట్టి, కాల్చి, ఆ బూడిదలో తగినంత ఆముదం వేసి, కాటుకలా వాడుకుని కండ్ల కలగను తగ్గించుకుంటారు.

గమనిక: అక్టోబర్ నెల పత్రికలో ప్రచురించిన వ్యాసంలో– చెంచీత చెప్పిన 'భూచక్ర గడ్డ' యొక్క శాస్త్రీయ నామము "మెరువా అరెనేరియా" (Maerua arenaria)
దాని వేరు బొటనవేలంత లావే ఉంటుంది. దానికి బదులు– పొరబాటున 20–30 సెంటి మీటర్ల లావు ఉన్న ఆరెంజ్ రంగు దుంప (?) ఇవ్వబడింది. ఈ 'భూచక్ర గడ్డ'ను బిజీగా ఉన్న బజార్లలో పలచగా ముక్కలు కోసి అమ్ముతారు. తింటే, కాస్త దురద అనిపిస్తుంది. రుచి కోసం శాకరిన్ పూత పూస్తాడంటారు. ఇది దేని వేరో/దుంపో నాకూ తెలియదు! కొందరు 'కిత్తనార వేరు' అంటారు. ఏది ఏమైనా, దీని శాస్త్రీయ నామం ఏమిటో హైదరాబాదులో ఉన్న బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు తెలియజేస్తే బాగుణ్ణు.

– కొప్పుల హేమాద్రి

'పాలబువ్వ' ఎక్కడకు పోయింది



అమరావతి పూర్ణకుంభం చిత్రం

జీవితం బుద్బుతం అని సూచిస్తాయి అర్థగోళాకృతిలోని బౌద్ధ స్థూపాలు. జీవితం క్షణికమే అయినా గాలి బుడగలా భూమ్యాకాశాల సౌందర్యాన్ని ప్రతిఫలించాలి అంటుంది బౌద్ధ తత్వం. అందుకు అనుగుణంగానే వాటిని నిర్మించారు. అమరావతి స్థూపం 90 అడుగుల ఎత్తయిన చలువరాతి గోళార్థం. పైన సూర్యచంద్రుల కాంతిని ఇనుమడించే రాతి చత్రం. చుట్టూ మణిమాణిక్యాలు. పంచ ఆయక స్థంభాలు. పంచశీలను పరిరక్షిస్తూ నాలుగువైపులా సింహరాజాలు. బుద్ధుని జీవిత ఘట్టాలు. 14 అడుగుల ఎత్తులో స్థూపం చుట్టూ శిలాలతాతోరణాలు. ధాన్యకటకంకు తలమానికమైన ఈ దీపాల దిన్నె ధరణికే కోటగా విలసిల్లింది. నేడు మట్టిదిబ్బగా కన్పిస్తోన్న దీపాలదిన్నె ఒక్కరోజులో నిర్మాణం కాలేదు. క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం నుంచి క్రీస్తు శకం మూడవ శతాబ్దం వరకూ నాలుగు దశల్లో నిర్మాణం అయ్యింది. దీపాలదిన్నెలో సామాన్యులకూ భాగస్వామ్యం కల్పించారు. బుద్ధుని జీవితంతో సంబంధం ఉన్న ఏదైనా ఒక ఘట్టాన్ని లేదా దృశ్యాన్ని శిల్పీకరించడానికి వితరణ చేసిన వారిపేరును శాసనాల్లో లిఖించారు. ఒక చర్మకారుడు పూర్ణకుంభాన్ని తన వంతుగా దీపాలదిన్నెపై చెక్కించాడు. ఆ శాసనం మ్యూజియంలో చూడవచ్చు. ఈ ఉదంతం గురించి అమరావతి కథలు రచయిత సత్యం శంకరమంచి తనదైన ఊహాగానం చేశారు. వివిధ బౌద్ధ గ్రంథాల సారాంశాన్ని ఒక చోట చేరిస్తే పూర్ణకుంభం చారిత్రక నేపథ్యం :

దు:ఖ కారణాన్ని కనుగొనేందుకు సిద్ధార్థుడు రాజ్యాన్ని వదిలాడు. అడవుల్లో ఆనాటి మేధావుల, తాత్విక మార్గాలన్నిటిలో నడచి చూచాడు. యజ్ఞపశువుల వధతో విందువినోదాలు, ముళ్లపాన్పులపై పవళించి, తలకిందులుగా వేలాడి, పొట్టవీపును తాకే ఘోరతపస్సులూ ఆచరించి చూశాడు. కింకర్తవ్యం అనుకుని ఒక మర్రిచెట్టుక్రిందకు చేరాడు. గాంధార శిల్పంలా శుష్కించి! 'ఓ... రంగయ్యో' అనే రీతిలో పనులు ముగించుకుని పాడుకుంటూ వెళ్లున్న జానపదుల పాట అతనికి విన్పించింది. పాట సారాంశం 'తెగేదాకా తంత్రిని మీటకు' అని! ఇక్కడిలా కట్ చేస్తే...

సిద్ధార్థుడు 'చింతమామి'గా కూర్చుని ఉన్న గయ ప్రాంతానికి దగ్గరలో సేనాని అనే గ్రామం ఉంది. నది, కొండ, పుట్ట, చెట్టును ఆరాధించే గ్రామీణుల సాంప్రదాయంలో భాగంగా సుజాత అనే యువతి బుద్ధుడు కూర్చుని ఉన్న మర్రి చెట్టుకు మొక్కుకుంది. తనకు కొడుకు పుడితే రుచికరమైన అన్నాన్ని నీకు సమర్పించుకుంటాను, అని. ఆమెకు పండంటి మగబిడ్డ పుట్టాడు. మొక్కు తీర్చుకోవాలి కదా. తయారు చేసింది. ఎలా?

సుజాత తండ్రి చుట్టుపక్కల జనావాసాల పెద్ద. గొప్ప పశుసంపద కలవాడు. తండ్రి ఆలమందలోంచి వేయి ప్రశస్తమైన ఆవులను ఎంపిక చేసింది. పుట్టపై మొలచే లేత గరికలను వాటి చివుర్లకు అందించింది. వాటి పాలను ఐదునూర్ల గోవులకు తాపింది. వాటి పాలను నూరు గోవులకు. వాటి పాలను ఎనిమిది గోవులకు. అష్టగోక్షీరాలతో పాయసాన్ని తయారు చేస్తూ, చెట్టుదేవత దగ్గరకు వెళ్లి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి రావలసినదిగా పున్న అనే పరిచారికను ఆదేశించింది. అక్కడికి వెళ్లిన పరిచారిక చెట్టుమొదట్లో సిద్ధార్థుని చూచి 'మా అమ్మగారు తయారుచేస్తోన్న పాయసాన్ని ఆరగించేందుకు చెట్టే మనిషిరూపం ధరించింది' అని భావించింది. ఆ మాటే సుజాతకు చెప్పింది. సుజాత బంగారు పాత్రలో సిద్ధార్థునికి పాయసం నివేదిస్తూ 'నీవు మనిషివో చెట్టువో. ఎవరివో. శుష్కించి ఉన్నావు. ఈ పాలబువ్వను ఆరగించు. నేను సంతృప్తురాలను. నీవూ సంతృప్తి చెందు' అన్నది. అంతకు క్రితమే సిద్ధార్థుడు జానపదుల పాటను విని ఉన్నాడు ప్రాణం పోయేంతగా ధ్యానం పనికి రాదని తీర్మానించుకున్నాడు. సుజాత పాలబువ్వను స్వీకరించాడు. ఆ క్షీరాన్నం ప్రసాదించిన శక్తితో రావిచెట్టు వద్ద అంతర్లోకాలను, బహి:ప్రపంచాన్నీ వీక్షించాడు. ఒక పౌర్ణమి రోజు బుద్ధుడయ్యాడు. సుజాత సిద్ధార్థునికి నివేదించిన పాలబువ్వ లేదా బోనాలకు ప్రతీక 'పూర్ణకలశం'! బౌద్ధ సాహిత్యంలో, శిల్పాలలో పూర్ణకలశానికి / పూర్ణఘటానికి విశిష్ట స్థానం ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్ణకలశాన్ని అధికార చిహ్నంగా స్వీకరించింది.

క్రీ.శ. 1816లో మెకంజీ బృందం అమరావతి (ధాన్యకటకం) సందర్శించిన నాడు ఇప్పటి స్థూపపు దిబ్బకు తూర్పువైపున పూర్ణకుంభం పడి ఉన్నది. నాలుగు అడుగుల నాలుగున్నర సెంటీ మీటర్ల ఎత్తు, రెండు అడుగుల, రెండున్నర సెంటీ మీటర్ల వెడల్పు కలిగిన పూర్ణకుంభం పూలసజ్జలా అలంకృతమై ఉంది. డ్రాయింగ్ ప్రకారం ఏమాత్రం దెబ్బతినని పూర్ణకుంభం, నాక్స్ క్యాటలాగ్ చిత్రం ప్రకారం ఎడమవైపు పైభాగం దెబ్బతిన్నది. దిగువ భాగం నెర్రె ఇచ్చింది. ఈ పూర్ణకుంభం రెప్లికాలు, చిత్తరువులు దొరుకుతున్నవి కాని ఒరిజినల్ ఎక్కడుందో తేలలేదు! 'పాలబువ్వ' ఎక్కడకు పోయింది?!

– పున్నా కృష్ణమూర్తి

సమాజ పరివర్తనతోనే 'స్వచ్ఛ భారత్'

ప్రధానమంత్రికి నివేదిక అందించిన ముఖ్యమంత్రుల ఉపసంఘం



ప్రజల ఆలోచనా విధానం, ప్రవర్తనలలో మార్పు తేగలిగినప్పుడే సమాజంలో పారిశుద్ధ్యం-పరిశుభ్రతలను సక్రమంగా అమలుచేయగలమని నీతి ఆయోగ్ ఉపసంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ప్రజలలో ఈ గుణాత్మక మార్పు తీసుకురావడానికి సమాచారం, విద్య, కమ్యూనికేషన్లు స్వచ్ఛభారత్ మిషన్‌లో ప్రధానపాత్ర వహించాలని కమిటీ పేర్కొంది. అలాగే, పాఠశాల బోధనా ప్రణాళికలో పారిశుద్ధ్యం-పరిశుభ్రత అంశాలని చేర్చాలని, పాఠశాల, కళాశాల విద్యార్థులలో 'స్వచ్ఛసేనాని' పేరుతో బృందాలను ఏర్పాటుచేయాలని నీతిఆయోగ్ ఉపసంఘం సూచించింది.

స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపకరించే పలు సూచనలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నియమించిన వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడిన నీతిఆయోగ్ ఉపసంఘం బుధవారం తన నివేదికను ప్రధానమంత్రి నరేంద్రమోడిని కలిసి అందించింది. ఏపీ ముఖ్యమంత్రితో పాటు హర్యానా, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రులు కూడా ప్రధానిని కలిసినవారిలో వున్నారు.

'స్వచ్ఛభారత్' కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర-రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపు 75: 25 నిష్పత్తిలో జరగాలని సిఫారసు చేసింది. స్వచ్ఛభారత్ మిషన్‌కు నిధులు సమకూర్చుకోవడానికి పెట్రోల్, డీజిల్, టెలికామ్, బొగ్గు, ఇనుము, అల్యూమినియం పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాల మీద సెస్ విధించాలని సిఫారసు చేసింది.

స్వచ్ఛభారత్ అభియాన్ అమలుకు కేంద్రంలోను, రాష్ట్రంలోనూ 'ప్రత్యేక మిషన్'ను అమలుచేయాలని, 'నేషనల్ టెక్నికల్ బోర్డు'ను ఏర్పాటుచేసి రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు కావాల్సిన సాంకేతిక సహకారాన్ని పొందడంలో సలహాలు ఇవ్వాలని కోరింది. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులకు సబ్సిడీలను పెంచాలని, వ్యర్థ పదార్థాల నిర్వహణ చేసే సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్ను రాయితీని ఇవ్వాలని సిఫారసు చేసింది.

పెద్ద పట్టణాలు, నగరాలలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో వ్యర్థాల్ని ఇంధనంగా మార్చే ప్లాంటులను నెలకొల్పాలని, గ్రామాలు, చిన్న పట్టణాలలో వ్యర్థాల్ని కంపోస్టుగా మర్చే సాంకేతిక పద్ధతుల్ని అవలంబించాలని ఉపసంఘం సూచించింది. పబ్లిక్ టాయిలెట్ల స్థాపన, నిర్వహణకు గ్రామ, పట్టణ ప్రాంతాలకు విడివిడిగా సూచనలు అందజేసింది. నీతిఆయోగ్ నేతృత్వంలో బహిరంగ మల విసర్జనను దేశంలో సమూలంగా నిర్మూలించడానికి మార్గదర్శకాలను రూపొందించాలని కోరింది.

వివిధ పంచాయతీలు, పురపాలక సంఘాలు, జిల్లాలు, రాష్ట్రాలు మధ్య స్వచ్ఛభారత్ ఆశయాల్లో మెరుగైన ఫలితాలు సాధించడంలో పోటీతత్వం నెలకొల్పే విధంగా కొన్ని మార్గదర్శకాలను కమిటీ సూచించింది. ప్రతి నెలలో ఒకరోజు, ప్రతి సంవత్సరంలో ఒక వారం స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ప్రత్యేకంగా కేటాయించి (అక్టోబరు 2తో ముగిసే విధంగా) వివిధ రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు రేటింగులు ఇచ్చి అవార్డులను ఇవ్వాలని పేర్కొంది. వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రభుత్వ సహాయాన్ని యూనిట్‌కు రూ.15 వేలు ఇవ్వాలని కమిటీ సిఫారసు చేసింది.

వీధుల్లో చెత్తను తొలగించడాన్ని బతుకుతెరువుగా ఎంచుకున్నవారి ప్రయోజనాలు దెబ్బతినకుండా వారిని స్వచ్ఛభారత్ మిషన్‌లో కలుపుకుని పోవాలని, మాన్యువల్ స్కావెంజింగ్ చట్టం 2013ను కఠినంగా అమలుచేయాలని కమిటీ సూచించింది. అంతేగాకుండా వ్యర్థ పదార్థాల నిర్వహణపై ప్రస్తుతం వున్న చట్టాలను, వాటి అమలును పున: పరిశీలించాలని కమిటీ సూచించింది.

నీతి ఆయోగ్ ఉపసంఘంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నాయకత్వంలో, బీహార్, ఢిల్లీ, హర్యానా, కర్నాటక, మహారాష్ట్ర, మిజోరాం, సిక్కిం, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు సభ్యులుగా వున్నారు. ఈ కమిటీ 4 సార్లు సమావేశమై ఈ నివేదికను రూపొందించింది.

వెండితెర వెనుక

స్థిత ప్రజ్ఞత

ధీరుడు విషాద ఘట్టాలలో కూడా శోకించడని పెద్దలు చెబుతారు. అది నిజమేనని ఒక సందర్భంలో నటసార్వభౌమ నందమూరి తారక రామారావు నిరూపించారు. అవి 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రం షూటింగ్ జరుగుతున్న రోజులు. శ్రీ కృష్ణదేవరాయల గెటప్‌లో ఎన్టీఆర్ ఆరోజు సెట్లో ఉన్నారు. అప్పుడు సాయంత్రం నాలుగవుతోంది. ఆ చిత్ర నిర్మాత ఎ.పుండరీకాక్షయ్య గారు హడావుడిగా సెట్లోకి వచ్చారు. ఎన్టీఆర్ వద్దకు వచ్చి ఏదో చెప్పడానికి జంకుతూ నిలబడిపోయారు. "ఏమిటి పుండరీకాక్షయ్య గారూ ఏమిటి విషయం? అని అడిగారు. ఆయన జంకుతూనే "ఒక అశుభవార్తండీ"అన్నారు.

"ఎవరికి...మాకా...లేక ఇక్కడున్న వారెవరికైనానా?" అని ప్రశ్నించారు ఎన్టీఆర్. "మీకే" అన్నారు పుండరీకాక్షయ్య. "ఐతే...ఆ అశుభవార్త ఇప్పుడు చెప్పవద్దు. కాల్‌షీట్ అయిన తర్వాత తెలియజేయండి" అన్నారు సీరియస్‌గా. కాల్‌షీట్ సమయం రాత్రి



తొమ్మిదైన తర్వాత ఆ అశుభవార్తను విన్నారు. అది ఎన్టీఆర్ పెద్ద కుమారుడు రామకృష్ణ మరణవార్త. విన్నవెంటనే ఆయన స్థాణువయ్యారు. కొన్ని నిమిషాల తర్వాత తేరుకుని "పుండరీకాక్షయ్యగారూ...మీ కాల్‌షీట్ ప్రకారం రేపూ షూటింగ్ జరపండి" అని చెప్పి వెళ్తున్న ఎన్టీఆర్ ను చూస్తూ "స్థితప్రజ్ఞత అంటే ఇదేమరి" అని సెట్లో ఉన్నవాళ్లందరూ అనుకున్నారు.

పోలీస్ స్టేషన్ లో కన్నాంబ

అంజలీదేవి వంటి నటీమణులు చిత్రరంగ ప్రవేశం చేసిన రోజుల్లో వాళ్లకు 'రోల్ మోడల్'గా ఉన్న తారల్లో (పసుపులేటి) కన్నాంబగారు ముఖ్యులు. సుదీర్ఘ సంభాషణలు రసవత్తరంగా చెప్పడంలో ఆమెకు ఆమే సాటి. కరుణ రసాభినయంలో ఆమె ప్రతిభ అసాధారణం.

ఒకసారి రోహిణీ పిక్చర్స్ వారి 'గృహలక్ష్మి'(1938) చిత్రం క్లైమాక్స్ దృశ్యాలు - చెన్నైలోని హైకోర్టు ముందున్న రోడ్డు మీద చిత్రీకరిస్తున్నారు. కార్లు, బస్సులు ట్రాములు (ఆ రోజుల్లో మద్రాసులో ట్రాములు ఉండేవి)...వాటిని దాటుకుంటూ కన్నాంబ పిచ్చిగా "దేవుడు లేడూ... సత్యం జయించదూ " అని అరుస్తూ పరుగులు తీయాలి. ఆమె నటన ఎంత సహజంగా ఉ



ందంటే, రోడ్డు మీదున్న జనం కొందరు ఆమె నిజంగానే పిచ్చిదనుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా జాలిపడి, ఆమె ఏ వాహనం కిందైనా పడిపోతుందని, గబగబా ఆమెను వ్యాన్ ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లిపోయారు. తాను సినిమా కోసం అలా నటిస్తున్నానని ఆమె ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ తర్వాత షూటింగ్ యూనిట్ వాళ్లు ఆ పోలీస్ స్టేషన్ కు వెళ్లి, అసలు సంగతి చెప్పి, ఆమెను విడిపించి తీసుకొచ్చారు !

ఎస్.వి. రంగారావు 'పెళ్లిమంత్రాలు'

కొందరు నటీనటులకు నటనలోనే కాకుండా కొన్ని ఇతర అంశాలలో కూడా ప్రావీణ్యం ఉంటుంది. ఐతే ఆ 'స్కిల్స్' తమకు ఉన్నట్లుగా చెప్పుకోరు. సందర్భం వచ్చినప్పుడే ఆ 'ప్రజ్ఞ' బయటపడుతుంది. జకార్తాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో 'నర్తనశాల' పాల్గొనగా, అందులో కీచక పాత్ర పోషణకు ఉత్తమ నటుడిగా అవార్డు గెల్చుకున్నారు ఎస్వీఆర్ (అదే ఓ తెలుగు నటుడు సాధించిన ఏకైక అంతర్జాతీయ అవార్డు!). అటువంటి ఘనత గల ఎస్వీఆర్ ఓ సాంఘిక చిత్రంలో పెళ్లి జరిగే సన్నివేశంలో నటిస్తున్నారు. అప్పుడు ఓ నిజమైన పురోహితుడు వెళ్లి మంత్రాలు చదువుతున్నాడు. చిత్రీకరణలో అవి అలాగే



రికార్డవుతున్నాయి. తను యాంత్రికంగా ఆ సన్నివేశంలో పాల్గొనకుండా, మధ్య మధ్యలో ఆ పెళ్లి మంత్రాలు కూడా వింటుంటే, అతను తప్పుగా చెబుతున్నట్లు ఎస్వీఆర్‌కు అర్థమైంది. వెంటనే షూటింగ్ ఆపించారు. ఆ పెళ్లి మంత్రాలు ఎలా కరెక్టుగా చదవాలో ఆయన గడగడా వల్లిస్తూ ఉంటే, ఆ పురోహితుడితో పాటు సహనటీనటులు కూడా ఎస్వీఆర్ వంక ఆశ్చర్యంగా చూశారు!

ఎమ్ ఎస్ నారాయణ లవ్‌స్టోరీ

ప్రముఖ హాస్యనటుడు, కీర్తి శేషులైన ఎమ్.ఎస్.నారాయణ తరచుగా అంటూ ఉండేవారు-'ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్లు...ప్రయత్నం విరమిస్తే మరణించినట్లు'అని సినిమా అవకాశాల కోసం ఆయన అప్పట్లో పన్నెండేళ్లు అనేక కష్టాలకు ఎదురీది పోరాటం సాగించాల్సి వచ్చిందంటే, అది నవ్వులాట కాదుమరి!

ఎమ్.ఎస్. ప్రేమాయణం కూడా ఓ పోరాటమే. ఆయన 'భాషాప్రవీణ' చదువుతున్నప్పుడు, తన సహ విద్యార్థిని కళా ప్రపూర్ణను ప్రేమించారు. వేర్వేరు కులాలని రెండు కుటుంబాలలోనూ వ్యతిరేకత ఎదురైంది. ఐనా ఇద్దరూ ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొని పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి చేసింది ఎవరో కాదు. నేటి ప్రముఖ సినీ



రచయితల ద్వయం పరుచూరి సోదరులలో ఒకరైన పరుచూరి గోపాలకృష్ణ. అప్పుడాయన అదే కళాశాలలో ఓ లెక్చరర్! అప్పటికప్పుడు ఎమ్.ఎస్.కు ఓ ఉద్యోగం కావాలంటే, ఆయనే మాట్లాడి తాత్కాలికంగా ఒక సినిమా థియేటర్లో బుకింగ్ క్లర్క్ ఉద్యోగం ఇప్పించారు. ఆ తర్వాతే భీమవరం కె.జి.ఆర్. కాలేజ్‌లో ఎమ్.ఎస్. లెక్చరర్ అయ్యారు. తన భార్యను 'భాషాప్రవీణ' చదివించాక, ఆమెకూ భీమవరం హైస్కూల్‌లో జాబ్ వచ్చింది. నాలుగు సంవత్సరాల తర్వాతే వాళ్లిద్దరి 'ప్రేమ'కు పెద్దల 'గుర్తింపు' లభించింది. ప్రేమలో విజయం సాధించినట్లే, ఆ తర్వాత తన ప్రయత్నాలతో ఎమ్.ఎస్. ముందు సినీరచయితగా, ఆ తర్వాత హాస్యనటుడిగా జీవన పోరాటంలో ఘనవిజయం సాధించారు.

- బి.కె. ఈశ్వర్

సంస్కృతి, సంప్రదాయాలు ఒక చట్రంలో స్థిరంగా వుండిపోవు. ఒక చక్రంలా తిరుగుతూ వుంటాయి. మనిషి బుద్ధిజీవి కాబట్టి విషయ మార్పిడికి భాషని తయారు చేసుకున్నాడు. పశుపక్ష్యాదులకు సంకేతభాష వుండొచ్చుగాని యింతటి విస్తృత వాఙ్మయం లేదు. ఆ తరువాత భాషకో లిపిని తయారు చేసుకున్నాడు. అక్షరానికి వూపిరి పోశాడు. మన తెలుగు భాషకి ఎప్పుడో లిపి ఏర్పడింది. ఆ తరువాత మూడున్నర శతాబ్దాలకుగాని ఇంగ్లీషు ఎబిసిడిలు రాలేదు. క్రీ.శ.1475లో అచ్చుయంత్రం రావడం ఒక విప్లవం. పుస్తకాలు, పత్రికలు విరివిగా వచ్చిపడ్డాయి. తాళపత్రాలపై ఘంటాలతో చెక్క వలసిన అగత్యం పోయింది.రాయసకారుల అవసరం తీరింది. కవులను, కథలను వారి రచనలతో ప్రదర్శించడానికి ఎన్నో రకాల పత్రికలు వచ్చాయి. లిఖిత సంప్రదాయంతో పాటు ఆశు సాంప్రదాయం కూడా పరిఢవిల్లింది. ఎన్నో జానపద కళారూపాలు ఆశు సంప్రదాయంలోనే జనంలోకి వెళ్ళాయి. పురాణాలు, ప్రవచనాలు, భజనలు, కోలాటాలు నోటి పలుకుతో భక్తిని ప్రోది చేస్తూ వచ్చాయి. వీటిని వేటినీ చూసి చదవరు. వేదంలా మనసుకి పట్టించుకుంటారు. గంటల తరబడి సాగే హరికథ, బుర్రకథ, జముకుల కథ వారివారి నోటి వెంట ఒక ప్రవాహంగా సాగుతాయి. ఇప్పుడు చక్రం తిరిగి స్థానం మారింది. అక్షరాల పని తగ్గింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నోటి మాట ఎక్కువగా వాడుకలోకి వస్తోంది. సందేశాలు, సందేహాలు, పిలుపులు, కబుర్లు అన్నీ లిపిలేకుండా పలుకుగా వినిపించేస్తున్నారు. దానికీ క్లుప్తంగా చెప్పడానికి సంకేతలిపి తయారవుతోంది. ఏదో ఒక కొత్త భాష, లిపి ఆవిర్భవిస్తుంది. అది విశ్వమానవ భాష అవుతుంది.

– సంపాదకుడు

తెలుగంటే యిది!

- 40 ఏళ్ల క్రితం శంకరమంచి సత్యం చెప్పిన "అమరావతి కథలు" భావపరంగా భాషాపరంగా కూడా అపురూప శిల్పాలు. ఒక కథలోంచి కొన్ని వాక్యాలు చవిచూద్దాం.



- ....కుమ్మరి సీతాలుకి కూడా మట్టే ప్రాణం. గబగబ కుండలు చేస్తుంది. చల్లటి కుండలు...అన్నం వండుకునే కుండలు, తిరగమోత కూరల చట్లు, పప్పుచార్లు...పాయసాలు...ఎంచక్కటి మూతలు...కాని ఇంత వయసొచ్చి వరన్నం ఎరగదు సీతాలు...ఆపక్కన పలకలు జ్ఞానపలకలు...బలపం పట్టుకుని స్వాతి ముత్యాల్లా ఓనమా దిద్దుకునే పలకలు...పెరిగి పెద్దై, మేథావులై, పదిమందిలో గొప్ప వారనిపించుకుని ఆ పలకల్ని, ఆ సీతాల్ని మర్చిపోయిన ఓ అయ్యలార, మట్టి ముందుకు రమ్మంటోంది... రండి.
- ఓ అయ్య నాగలి బుజానికెత్తుకుని ఎదరొస్తున్నాడు. నేలని నమ్ముకున్న అయ్య! మనకి పెరుగన్నం, పాలబువ్వ అందించే ఆ అయ్య రెండు పూటలా సంకటే తింటాడు. ముద్దలో నేతి బొట్టు ఎరగడు. అయితే నేమి! ఆ కళ్లలో దీక్ష, కండల్లో బలం, ఎత్తిన నాగలి, పైకెత్తిన ములకోల, అంగల్లో రాజసం, ఆ మీసంలో పొంకం, ఆ చూపులో ఠీవి...ఇవన్నీ ఎక్కణ్ణించివొచ్చాయి. ఆ అయ్య నేలతల్లి కొడుకయ్యా! ఓ తండ్రీ నీ నాగలికి అంటుకున్న మట్టి ఒకింత నాకియ్యావూ?
- మట్టి పలుకుతోంది. మట్టి తుళ్లి తుళ్లి పడుతోంది. ఇది మహాపురుషుల పాదాలు తాకిన మట్టి. బౌద్ధుల పావుకోళ్లలో దూరి పాదాభివందనం చేసుకున్న మట్టి...ఎటుచూసినా మట్టి...కృష్ణవొడ్డునిండా మట్టి...కృష్ణ గర్భంలో మట్టి, కృష్ణ అవతల మట్టి, వూరునిండా మట్టి...మట్టినిండా కథలు...మట్టినిండా చరిత్ర...తరతరాల మట్టి...యుగయుగాల మట్టి.
- "మట్టిని మర్చిపోతున్నార్రా" అంటోంది నేలతల్లి.

పెళ్ళి – పెండ్లి

కల్యాణం, వివాహం అనడం కంటె పెళ్లి అంటేనే తెలుగు వారికి యింపుగా వినిపిస్తుంది. పెళ్లికి ఎన్ని పర్యాయపదాలో! "....ఆ మూడు మూళ్ళూ పడితే చాలు" అంటుందొక తల్లి. "ఆదోసెడు తలంబ్రాలూ ఎప్పుడుపడతాయో"నని కలవరిస్తాడొక తండ్రి. "డోలు మీద దెబ్బపడేదెప్పుడో" అంటుందొక నానమ్మ.

"ఒక అయ్య చేతిలో పెడితే నా బరువు బాధ్యతలు తీరతాయి" అంటాడొక యింటిపెద్ద.

ఈమాఘంలోనైనా తోరణం మండ కట్టాలి, శ్రావణంలోనైనా పప్పన్నాలు పెట్టాలి, విడిదిళ్లకు లక్కలు పెట్టేది ఎప్పుడో!, మధుపర్కాలు



నేయించేదెన్నడో! – యివన్నీ పెళ్లి వూసులే!, ఏ ప్రాంతమైనా, ఏ జాతి, ఏ మతమైనా పెళ్లి ఒక్క గొప్ప వేడుక. పెండిలి పెండ్లామును తెచ్చునని వాడుక.

ఇంకా పెళ్లి వూసెత్తగానే బాజాలు, బాకాలు, పల్లకీలు, మేనాలు గుర్తొస్తాయి. అరివేణి కుండలు, పసుపులు, కుంకుములు, కారాలు, మిరియాలు జాబితాలోకి వస్తాయి. పెళ్లి పత్రికలతో పనులు మొదలై వరసగా పెళ్లిపనులు అందుకుంటాయి. ఆ పందిట్లో యిక ఎన్నో వింతలు విడ్డూరాలు. గాజుల బతే వస్తాడు. గొంగళి పరిచి గాజుల మలారం దింపి, ఇంటి వారికి బయటవారికీ రంగురంగుల గాజులు తొడుగుతాడు. అత్తరు సాహెబ్ వస్తాడు. అందరి ముంజేతులకు రకరకాల అత్తర్లు రుచి చూపిస్తాడు. ఆ ఘుమఘుమలు పందిరంతా వ్యాపించి, కొత్త తాటాకు వాసనలతో వియ్యమందుతాయి. అరటి పిలకలు అప్పుడే తోటనుంచి దిగుతాయి. పెండ్లి మంటపం క్షణాల్లో అలంకరణ పూర్తి చేసుకుంటుంది. మామిడాకు తోరణాలు అప్పటికే రామచిలకల్లా వేలాడుతూ ఉంటాయి. బెల్లం జీలకర్ర సిద్ధం చేశారా. తెరసెల్లా ఎక్కడమ్మా? ఇద్దరికీ భాషికాలు కట్టాం. పెళ్లిపీట తెచ్చామండీ. పెళ్లికూతురుని తెచ్చే గంప వచ్చేసిందా? కొబ్బరి బొండాలు వచ్చేసాయి. మిథున విడియాలంటే దంపతితాంబూలాలండీ, వాటికి వక్కలు ఆకులు కావాలి. గౌరీపూజకు ఆలస్యమెందుకు. సన్నికల్లు తెప్పించాం. ఆడపడుచులాంఛనాలు, వియ్యపురాలి కట్నాలు ఒక చోట పెట్టండి. ఇలా అన్ని ఘట్టాలు నడుస్తాయి. పట్టపగలే అరుంధతి నక్షత్రాన్ని దర్శింపచేస్తారు. తర్వాత అప్పగింతలంటారు. అమ్మాయి తల్లిదండ్రులు, పాలలో ముంచినా నీళ్లలో ముంచినా నీదే భారమంటూ పిల్లని అప్పగిస్తుంటే కళ్లు చెమరుస్తాయి. ఇవి తెలుగింటి పెళ్లి మాటలు. ఇంకా విందులో నోరూరించే మాటలు బోలెడు వినిపిస్తాయి. పెళ్లి బంతి, బూజంబంతి వేరే వేడుకలు. ప్రతి సందర్భానికి హాస్యంగా, వేళాకోళంగా, ఎత్తిపొడుపులుగా పాడుకునే అనేక పాటలున్నాయి. కోపాలు, తాపాలు, అలకలు, చిన్నబుచ్చుకోడాలు,

బుజ్జగింపులు, అధిపత్యాలు, ఆనందాలు – యివన్నీ సమపాళ్లలో కలిసినపుడే అది తెలుగింటి పెళ్లి!.

నుడికారాలు

చేసిన చేష్టలు ఎవరూ చూడరుకాని, కోసిన ముక్కుని



అందరూ చూస్తారు. – ఈ సామెత రామాయణంలోంచి పుట్టింది. శూర్పణఖ ముక్కూచెవులూ కోశాడనీ, ఒక స్త్రీని ఘోరంగా రామలక్ష్మణులు అవమానించారనీ కొందరు నిందిస్తూ ఉంటారు. కాని ఆ రాక్షస స్త్రీ చేష్టలను ఎవరూ ప్రస్తావించరు. "శూర్పణఖ" అంటే చేటలంత గోళ్లు కలదని అర్థం. ఆవిడ సీతను చంపడానికి సిద్ధమైంది. లక్ష్మణ స్వామిని కవ్వించింది. అప్పుడే ఆ చర్యకు పాల్పడ్డారు. ఈ సామెతలో యింత కథ ఉంది.

చోద్యాల సోమిదేవమ్మకు వాద్యారి మొగుడు – ఆమెకు ప్రతిదీ విచిత్రమే. పువ్వు పూస్తే విశేషం, పిందె తొడిగితే ఆశ్చర్యం, పండు పండితే చోద్యం, ఆవిడ భర్త ఉపాధ్యాయుడు. ఇక చెప్పేదేముంది. వాద్యారి అంటే గురువు. ఇది తమిళ పదం. చోద్యం ప్రాసకు వాద్యారి అనే తమిళ మాటని వాడారు. సామెతలకు భాష పట్టింపులు లేవనడానికి యిదొక ఉదాహరణ.

ఈదులకు పోయిన వాడు, ఇల్లు కాలినవాడు, తాళ్లకు పోయినవాడు చచ్చినా రారు – ఈతతోపుని ఈదులంటారు. తాటికల్లు ఈతకల్లు తాగపోయినవాడు ఒక్క పట్టాన రాడని భావం. "ఈదులు" కొన్ని ప్రాంతాలలో మాత్రమే వాడుకలో ఉంది. చాలా మంది ఏమిటో అనుకుంటారు.

నిత్యసత్యాలను క్లుప్తంగా చెప్పడంలో, భాషని వ్యాప్తి చేయడంలో సామెతలకు సాటి మరొకటి లేదు.

అచ్చతెలుగు పాటలు

ఆ రోజుల్లో సంస్కృతాన్ని కాదని ప్రజాసామాన్య భాష అయిన ప్రాకృతంలో రసవంతాలైన కావ్యాలు, నాటకాలు అనేకం వచ్చాయి. విశేష ఆదరణ పొందాయి. గాథాసప్తశతి, కర్పూర మంజరి యీ కోవలోవే. తెలుగులో కావ్య భాషనించి దూరంగా జరిగి వచ్చినవి ఎంకి పాటలు. భావం, రసం, ధ్వని అన్నింటినీ నింపుకుని ఎంకిపాటలు వచ్చాయి. పండితులు సైతం వీటిని గౌరవించారు.

"ఎలుతురంతా మేసి ఏరు నెమరేసింది" లాంటి ఎన్నో వాక్యాలు సామెతల్లాగా జనం వాడుకలో మిగిలి పోయాయి. ఒక్క నేనే నీకు, పెక్కు నీవులు నాకు, పూల బాసలు తెలుసు ఎంకికీ లాంటి ఎంకిపదాలు రానివారు అరుదుగా ఉంటారు. ఆ రోజుల్లో జానపదుల భాషలో, జ్ఞానపథుల ఊహలతో ఎంకిపాటలను రచించారు నండూరి సుబ్బారావు. ఇది తెలుగు జాతి తరతరాల పాట పదిల పరుచుకోవలసిన నిధులు.. ఒక్కసారి ఎంకిని నాయుడు బావని తలుచుకుందాం. ఆ పాటల్ని గుర్తు చేసుకుందాం.

చిన్నమాట

"బొడ్డు" – రెండక్షరాల మాట, కాని దీన్ని కోస్తే గాని శిశువు పూర్తిగా నేలకు రాడు. బొడ్డూడని పసివాడు, ధూ నాబొడ్డుపాల్, బొడ్డుకోసిన తల్లి అని వాడతాం. రొంటిన పెట్టుకోడాన్ని బొడ్డున దోపడం అంటారు. బావిచుట్టూ ఎత్తుగా వుండే పిట్టగోడని "బొడ్డు" అంటారు. బొడ్డు అంటే కేంద్ర బిందువని కూడా అర్థం. బొండుమల్లెని కొందరు కొన్ని చోట్ల



బొడ్డుమల్లెలని వ్యవహరిస్తారు. బొ్రడాయి పదం వాడుకలో ఉంది. తెలుగులో చిన్నమాటకు కూడా విస్తృతి అధికం.

వెలలేని మాగాణిరా!

ఒకనాడు ప్రజానాట్య మండలిలోనూ, ఇతరత్రా వినిపించిన ఒక పౌరుష గేయం–

శాతవాహన తెలుగు చక్రవర్తుల శౌర్య
మిదె బ్రహ్మమిదె క్షాత్రమన్న గర్జాఘోష
పులకలే ఎత్తించెరా పలనాటి
పౌరుషమ్మే పొంగెరా.

బుద్ధ నాగార్జునుడి బోధ ముద్రాజ్యోతి
వర 'మహాయానమై' వసుమతిని ప్రవహించి
కెచ్చుతగ్గులు సమిసెరా పలనాట
